www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 13-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 247

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: నవమి రా.11:34 తదుపరి దశమి, నక్షత్రం: మఖ రా.7:38 తదుపరి పుబ్బ, వర్జ్యం: ఉ.7:06-8:46, తె.4:12-5:54, దుర్ముహూర్తం: ఉ.10:07-10:52, మ.2:36-3:21, అమృతఘడియలు: సా.5:07-6:47, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:22, సూర్యాస్తమయం: 5:35 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

‘గ్లోబల్ ట్రేడ్ గేట్‌వే’గా విశాఖ

‘ఇన్వెస్ట్ ఇన్ ఏపీ’ నినాదంతో రేపటి నుంచే భాగస్వామ్య సదస్సు.. భారీ ఏర్పాట్లు

భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలే లక్ష్యం

విశాఖ చేరుకున్న సీఎం చంద్రబాబు

సదస్సు ముగింపు వరకూ అక్కడే

భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్‌తో భేటీ

14



ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులే లక్ష్యం

ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్

విశాఖ పెట్టుబడుల సదస్సుకు 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు

జీ20 దేశాల ప్రతినిధులు కూడా: లోకేశ్

నేటి ఉదయం 9కి సంచలన పెట్టుబడి ప్రకటన.. ఎక్స్‌లో మంత్రి ఆసక్తికర పోస్ట్



‘కల్తీ’లో కీలక పాత్రధారి వైవీ సుబ్బారెడ్డే!

ఒక్కొక్కటిగా బయటపడుతున్న ఆధారాలు

టీటీడీకి నెయ్యి సరఫరా నిబంధనల్లో 2020లో ఆయన హయాంలోనే మార్పులు

అస్మదీయ కంపెనీల కోసం అర్హతలు సడలింపు

పాల సేకరణ, నెయ్యి ప్రాసెసింగ్ కెపాసిటీలో కీలకమైన రెండు నిబంధనల తొలగింపు

డెయిరీ టర్నోవర్ 250 నుంచి 150 కోట్లకు

ఎక్స్‌పర్ట్ కమిటీ పేరుతో మార్చేసిన వైనం

రంగంలోకి అనామక డెయిరీలు..

కల్తీ నెయ్యితో శ్రీవారి ప్రసాదం అపవిత్రం

ఈవో సింఘాల్ మౌనముద్ర

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తిరుమల వెంకన్న లడ్డూ ప్రసాదం కల్తీ పాపంలో కీలక పాత్ర నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిదే! ఆయన పాత్రకు సంబంధించిన ఆధారాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. సుబ్బారెడ్డి పీఏ ఖాతాలో కోట్లాది రూపాయలు జమ అయిన విషయం వెలుగులోకి రాగా... 2020లో

మిగతా 12వ పేజీలో...

చైర్మన్ ఒత్తిడి తెచ్చారు!



పాలకమండలిలో కొందరు సభ్యులు కూడా: ధర్మారెడ్డి

వారు చెప్పినట్లు చేయాలని ఉన్నత స్థాయి నుంచీ ఆదేశాలు

దాంతో మిన్నకుండిపోయానన్న టీటీడీ మాజీ ఈవో

12

తిరుమల కల్తీ నెయ్యి కేసులో వరుసగా రెండో రోజూ సుదీర్ఘ విచారణ

సింఘాల్, జవహర్‌రెడ్డిని ప్రశ్నించరేమంటూ ఎదురు ప్రశ్నలు



నంద్యాల జిల్లా బేతంచెర్ల మండల కేంద్రంలోని 1వ సచివాలయంలో వేచి ఉన్న మహిళలు

సచివాలయాల పాలన పట్టాలెక్కించాలి

వాటి పనితీరు అస్తవ్యస్తం

కొందరు సిబ్బందికి పనిభారం

మరికొందరికి పనిలేక ఖాళీ

పలువురు వేళకు హాజరు కాని వైనం

ఎప్పుడొస్తారో.. ఎక్కడుంటారో?

సర్వేలు, ఫీల్డ్, ఇతర పనులంటూ ప్రజలకు అందుబాటులో లేని పరిస్థితి

పూర్తి స్థాయిలో అందని సేవలు

వ్యవస్థపై పర్యవేక్షణ లోపం

రాష్ట్రంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి

కొన్ని ప్రాంతాల్లో మెరుగ్గా సేవలు

‘ఆంధ్రజ్యోతి’ పరిశీలనలో వెల్లడి

13

2029 కల్లా ప్రతి పేదవాడికీ సొంతిల్లు

వచ్చే ఉగాదికి 5.90 లక్షల గృహప్రవేశాలు: ముఖ్యమంత్రి

ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహిస్తా

పెద్దలు, పిల్లలకు ఉమ్మడిగా ఇల్లు

బీసీ, ఎస్సీ, ఎస్టీలకులాగే.. ముస్లింలకూ అదనంగా 50 వేలు

గత ప్రభుత్వం ఇళ్ల పథకాన్ని నిర్వీర్యం చేసింది.. గృహ నిర్మాణ రంగాన్ని కుక్కలు చింపిన విస్తరి చేసింది

4.73 లక్షల ఇళ్లను రద్దు చేసింది

2.73 లక్షల మందికి రూ.900 కోట్లు చెల్లించలేదు

ఇప్పుడు నిధుల సమస్య ఉన్నా మేం 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేశాం

ఇవాళ గృహప్రవేశాలూ చేశాం

ప్రతి ఇంట్లోనూ ఓ పారిశ్రామికవేత్త రావాలి: సీఎం చంద్రబాబు

అన్నమయ్య జిల్లా చిన్నమండెంలో ప్రజావేదిక సభ

బీపీఎస్ గడువు పొడిగింపు



అన్నమయ్య జిల్లా దేవగుడిపల్లెలో గృహ లబ్ధిదారులు హేమలత, ఈశ్వర్‌తో కలసి నూతన గృహప్రవేశం చేస్తున్న సీఎం చంద్రబాబు

రాయచోటి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ‘ఇల్లంటే నాలుగు గోడలు మాత్రమే కాదు.. గౌరవం, సంతోషం, భవిష్యత్‌కు భద్రత, ఓ చిరునామా.. అందుకే.. 2029 నాటికి రాష్ట్రంలో పేదలందరికీ సొంతిళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం’ అని సీఎం చంద్రబాబు ప్రకటించారు. వచ్చే ఉగాది నాటికి రాష్ట్రంలో 5.90 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు నిర్వహిస్తామన్నారు. అన్నమయ్య జిల్లా

మిగతా 12వ పేజీలో...

మీ విషయంలో తప్పు చేశాను!

ఏబీవీ, జాస్తి కృష్ణకిశోర్‌కు ప్రవీణ్ ప్రకాశ్ క్షమాపణ

వారిపై చర్యల ఫైళ్లను తిరస్కరించి ఉండాల్సింది

నైతికత, విలువల కోణంలో చూడాల్సింది

11

అలా చేయనందుకు ‘పశ్చాత్తాపం’తో వీడియో

సివిల్స్ మెయిన్స్ ఫలితాలు విడుదల

దేశవ్యాప్తంగా ఇంటర్వ్యూకు 2,736 మంది ఎంపిక

2

టర్కీ నుంచి కుట్ర

ఆపరేషన్ సిందూర్ దెబ్బతో పాక్ నుంచి టర్కీకి మకాం మార్చుకున్న జైషే మహ్మద్ సంస్థ

ఫరీదాబాద్ ఉగ్రవాదులకు అక్కడి నుంచే ఆదేశాలు.. భారత్‌లో ఒకేసారి 200 పేలుళ్లకు కుట్ర

గత దీపావళికే అమలు చేయాలని ప్లాన్.. అది తప్పడంతో డిసెంబరు 6న దాడికి పన్నాగం

అది ఉమర్ నబీ జరపాలని నిర్ణయం.. సహచరులు దొరికిపోవడంతో ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడి

పోలీసుల అదుపులో ఉన్న డాక్టర్ ముజమ్మిల్ వెల్లడి!.. **పరారీలో మరో ఉగ్ర వైద్యుడు!**

ఉగ్ర ఘాతుకమే.. ఈ పిరికిపంద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.. కేంద్ర క్యాబినెట్ తీర్మానం



ఢిల్లీ ఆస్పత్రిలో ఓ క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 12: పాకిస్థాన్ లో కూర్చుని కుట్రలు చేసి భారత్‌లో దాడులకు పాల్పడే ఉగ్రవాదులు.. తాజాగా రూటు మార్చారు. పాక్‌లోని ఉగ్ర స్థావరాలను భారత్ ధ్వంసం చేయటంతో స్థావరాలను టర్కీకి మార్చారు. సోమవారం ఢిల్లీలో కారు బాంబు దాడికి పాల్పడిన ఫరీదాబాద్ ఉగ్ర ముఠాకు.. జైషే మహ్మద్ ఉగ్రవాదులు టర్కీ నుంచి ఆదేశాలు ఇచ్చినట్లు భారత నిఘా సంస్థలు గుర్తించాయి. దర్యాప్తులో సంచలన విషయాలు బయట కొస్తున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో దేశవ్యాప్తంగా ఏకకాలంలో 200 చోట్ల శక్తిమంతమైన బాంబులు పేల్చి అల్లకల్లోలం సృష్టించాలని కుట్ర చేసినట్లు తేలింది. గత దీపావళి పండుగ సందర్భంగానే ఈ కుట్రను అమలు చేయాలని భావించినప్పటికీ వీలు కాకపోవటంతో డిసెంబరు ఆరున, జనవరి 26న దాడి చేయాలని ప్రణాళిక వేసినట్లు గుర్తించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలన్నింటినీ భారత సైన్యం ధ్వంసం చేయటంతో అక్కడి ఉగ్ర ముఠాలు

మిగతా 2వ పేజీలో...

సివిల్స్ మెయిన్స్ ఫలితాలు విడుదల

» ఇంటర్వ్యూకు 2,736 మందికి అర్హత

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (మెయిన్)-2025 ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా ఆగస్టు 22 నుంచి 31 వరకు ఈ పరీక్షలు నిర్వహించారు. వీటిల్లో మొత్తంగా 2,736 మంది అభ్యర్థులు పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు అర్హత సాధించినట్టు యూపీఎస్సీ ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను తన అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఇంటర్వ్యూ పూర్తయిన తర్వాత మెయిన్, ఇంటర్వ్యూకి కలిపి మొత్తం వచ్చిన మార్కులతో మెరిట్ లిస్ట్ విడుదల చేస్తారు.

తీర్పుల వివరాలన్నీ వెల్లడించాలి

» అన్ని హైకోర్టులనూ ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 12: న్యాయస్థానాలు ఇచ్చే తీర్పుల విషయంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల హైకోర్టులు తమ వెబ్‌సైట్లలో ఒక డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేసి, అందులో తీర్పుల వివరాలను వెల్లడించాలని ఆదేశించింది. ఈ ఏడాది జనవరి 31 తర్వాత రిజర్వ్ చేసిన తీర్పులు, వెల్లడించిన తీర్పులు, అప్‌లోడ్ చేసిన తేదీలతో సహా డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చిల ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఝార్ఖండ్ హైకోర్టు సహా పలు హైకోర్టులు సివిల్, క్రిమినల్ కేసుల్లో తుది వాదనలు పూర్తయిన తర్వాత కూడా ఏళ్ల తరబడి తీర్పులు ఇవ్వకపోవడాన్ని ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది.

'కొడుకా.. ఇంటికి రా..'

» మావోయిస్టు నేత హిడ్మాకు తల్లి వేడుకోలు



చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పటికైనా ఇంటికిరా.. కొడుకా' అంటూ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాడ్వి హిడ్మాకు అతడి తల్లి కన్నీటి విజ్ఞప్తి చేసింది. రెండు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ శర్మ, హిడ్మా తల్లిని కలిసి కుమారుడిని లొంగిపోయేలా నచ్చజెప్పాలని సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే హిడ్మా తల్లి మాట్లాడిన ఓ వీడియో సందేశాన్ని మంగళవారం పోలీసులు విడుదల చేశారు. "బిడ్డా ఇంటికి వచ్చి సాధారణ జీవితం గడుపు. లేదంటే నేనే అడవిబాట పడుతా. నీ కోసం కుటుంబమంతా ఎదురు చూస్తోంది' అంటూ హిడ్మా తల్లి మాట్లాడింది. రెండు నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియో సందేశంలో హిడ్మా తల్లి గోండు భాషలో మాట్లాడగా.. ప్రస్తుతం అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అలాగే, మరో మావోయిస్టు నేత దేవా తల్లితోనూ పోలీసులు ఇదే తరహా వీడియో విడుదల చేశారు.

ప్రధాని, సీఎం తొలగింపు బిల్లుపై జేపీసీలో లావు, బాలశౌరి

న్యూఢిల్లీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఓ చట్టాన్ని ప్రవేశపెట్టింది. దాని ప్రకారం ఐదు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు జైలు శిక్షపడే తీవ్రమైన క్రిమినల్ కేసులో అరెస్టు అయ్యి, 30 రోజులు జైలులో ఉంటే ప్రధాని, సీఎం, ఇతర మంత్రులు రాజీనామా చేయాలి. లేదంటే వారిని తొలగించవచ్చు. దీన్ని చట్టం చేయాలంటే రాజ్యాంగంలోని 75, 164 ఆర్టికల్స్‌కు సవరణలు చేయాల్సి ఉంటుంది. దానికి ఉద్దేశించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, జమ్మూకాశ్మీర్ పునర్విభజన సవరణ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ సవరణ బిల్లులపై పార్లమెంటు సంయుక్త కమిటీ ఏర్పాటయింది. బీజేపీ ఎంపీ అపరాజిత సారంగి సారథ్యంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ఏపీ ఎంపీలు లోక్‌సభ నుంచి టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, జనసేన పార్లమెంటరీ పార్టీ నేత బాలశౌరి, రాజ్యసభ నుంచి వైసీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

జోగి వ్యాజ్యంలో కౌంటర్ వేయండి

» మద్యం కేసు సీబీఐకి బదిలీపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ, సరఫరా విషయంలో నమోదైన కేసుల దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ ఈ కేసులో అరెస్టయిన వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. నకిలీ మద్యం తయారీ, సరఫరాకు సంబంధించి అన్నమయ్య జిల్లా మొలకలచెరువు, విజయవాడ భవానీపురం పీఎస్‌లో నమోదైన కేసుల దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయాలని జోగి రమేశ్ తన పిటిషన్‌లో కోరారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు జనార్దనరావు పోలీసు కస్టడీలో ఉండగా వీడియో వాంగ్మూలం రికార్డు చేసి మీడియాకు విడుదల చేసిన వ్యవహారంపైనా సీబీఐతో దర్యాప్తు చేయించాలని జోగి తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా.. పిటిషన్ దాఖలు అనంతరం జరిగిన పరిణామాలు, వివరాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని కోర్టు జోగిని ఆదేశించింది. బుధవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా అదనపు అఫిడవిట్ దాఖలు చేశామని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ... వ్యాజ్యం విచారణార్హతపై కౌంటర్ దాఖలు చేస్తామని.. అందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. పిటిషన్ విచారణార్హతపైనే కాకుండా ప్రధాన వ్యాజ్యంలో సైతం కౌంటర్ వేయాలని పీపీకి సూచిస్తూ తదుపరి విచారణను ఈ నెల 26కి వాయిదా వేశారు.

నిర్మల సంతకం ఫోర్జరీ చేసి 99 లక్షలు చోరీ!

» వృద్ధ మహిళకు ఫోన్ చేసి సైబర్ నేరగాళ్ల దోపిడీ.. మహారాష్ట్రలో ఘటన

ముంబై, నవంబరు 12: సైబర్ నేరగాళ్లు మరీ బరి తెగిస్తున్నారు. ఏకంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఓ వృద్ధమహిళ నుంచి రూ.99 లక్షలు కొట్టేశారు. ఈ ఘటన మహారాష్ట్రలోని పుణెలో జరిగింది. ఎల్ఐసీలో పని చేసి పదవీ విరమణ పొందిన 62 ఏళ్ల వయసున్న ఓ మహిళకు అక్టోబరు నెల చివరి వారంలో ఓ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. మీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తున్నామని, మీ మీద అరెస్టు వారెంటు జారీ అయ్యిందని భయపెట్టాడు. ఈ మేరకు ప్రభుత్వ లోగో, నిర్మలా సీతారామన్ సంతకంతో కూడిన ఓ పత్రాన్ని ఫోన్‌లోనే చూపించాడు. ఖాతాల్లోని సొమ్మును పరిశీలించాల్సి ఉంది కాబట్టి, ఆర్బీఐ అకౌంట్లకు బదిలీ చేయాలని ఆదేశించాడు. బెదిరిపోయిన ఆ వృద్ధమహిళ పలు ఖాతాలకు రూ.99 లక్షలు బదిలీ చేశారు. ఆ తర్వాత వారికి ఆ మహిళ ఫోన్ చేయబోగా.. స్విచాఫ్ అని రావటంతో, మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తెలంగాణను నిలువరించండి

» జల విద్యుదుత్పత్తి కోసం ప్రాజెక్టులను ఖాళీ చేసేస్తోంది

» కేఆర్ఎంబీకి ఈఎన్‌సీ నరసింహమూర్తి లేఖ

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): 'జల విద్యుత్ ఉత్పత్తి చేయకుండా తెలంగాణను నిలువరించండి' అని ఆంధ్రప్రదేశ్ కోరింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర జల వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, కృష్ణానదీ యాజమాన్య సంస్థ(కేఆర్ఎంబీ)కి లేఖ రాశారు. 'జల విద్యుదుత్పత్తి కోసం శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి నీటిని తోడేస్తూ తెలంగాణ ప్రాజెక్టులను ఖాళీ చేసేస్తోంది. శ్రీశైలం జలాశయం ఎడమవైపు నుంచి తెలంగాణ జల విద్యుదుత్పత్తి చేసేందుకు ఇప్పటికే 27,921 క్యూసెక్కుల ప్రవాహాన్ని వాడేసింది. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ కేవలం 10,448 క్యూసెక్కులను మాత్రమే విద్యుదుత్పత్తి కోసం వినియోగించింది. నాగార్జున సాగర్ నుంచి 34,033 క్యూసెక్కులు, పులిచింతల నుంచి 16,600 క్యూసెక్కులను, 7,313 క్యూసెక్కుల వరద జలాలనూ తెలంగాణ వాడుకుంది. ఈ నెల 10 వరకూ విద్యుదుత్పత్తి కోసం ఈ స్థాయిలో తెలంగాణ నీటిని అనధికారికంగా తోడేసింది. దాని చర్యను అడ్డుకోవాలి. రుతుపవనాల ప్రభావం తగ్గిపోవడంతో వర్షాలు పడే అవకాశాలు లేవు. వరద వచ్చే వీలూ లేదు. తక్షణమే తెలంగాణ జల విద్యుదుత్పత్తి ఆపకపోతే ప్రాజెక్టులు ఖాళీ అయిపోతాయి' అంటూ ఈఎన్‌సీ, కేఆర్ఎంబీకి వివరించారు.

టర్కీ నుంచి కుట్ర

(మొదటిపేజీ తరువాయి)



ఢిల్లీలోని ఎర్రకోట వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సురక్షితమైన కొత్త స్థావరాన్ని వెతుక్కున్నాయి. నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో)లో భాగమైన టర్కీని ఉగ్ర డెన్‌గా మార్చుకున్నాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాలు భాగస్వామిగా ఉన్న నాటో కూటమి సభ్య దేశాలపై ఎవరు దాడి చేసినా ఇతర సభ్యదేశాలన్నింటిపై దాడి చేసినట్లుగానే భావించి అన్ని దేశాలు శత్రువుపై దాడి చేయాలన్న నిబంధన ఉండటంతో టర్కీపై భారత్ దాడి చేయదన్న ధీమాతో తమ కార్యకలాపాలను అక్కడికి మార్చినట్లు నిపుణులు చెబుతున్నారు. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రవాది ఒకరు టెలిగ్రాంలో రెండు గ్రూపుల ద్వారా ఫరీదాబాద్ కేసులో అరెస్టయిన వైద్యులను ఉగ్రవాదంవైపు ఆకర్షించినట్లు నిఘా వర్గాలు ఆధారాలు సంపాదించాయి. 'ఫర్జందాన్ ఇ దారుల్ ఉలూమ్ (దీయోబంద్), ఉమర్ బిన్ ఖత్తబ్ అనే టెలిగ్రాం గ్రూపుల ద్వారా వీరు తరుచూ సంభాషించుకునేవారని గుర్తించారు. ఇటీవల జమ్ముకశ్మీర్ పోలీసులు అరెస్టు చేసిన వైద్యులను ఉగ్రవాదంపై మళ్లించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న షోపియాన్‌కు చెందిన మత గురువు ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ ఆగాహ్ ఈ టెలిగ్రాం గ్రూపుల ద్వారానే టర్కీలోని జైషే మహ్మద్ ఉగ్రవాదితో సంభాషించినట్లు భావిస్తున్నారు. ఈ గ్రూపుల ద్వారా కశ్మీర్ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయాలని పిలుపునిస్తూ మెల్లిగా భారత్‌పై ఉగ్రదాడులు చేసేలా వారిని పురికొల్పినట్లు గుర్తించారు. ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన ఉగ్రవాది ఉమర్ నబీ కూడా ఈ గ్రూపుల్లో సభ్యుడేనని భావిస్తున్నారు. ఇమామ్ ఇర్ఫాన్, నబీలు రెండుసార్లు టర్కీ వెళ్లి వారి జైషే హ్యాండ్లర్‌ను కలిసినట్లు నిఘా వరాల సమాచారం. ఆ తర్వాతే ఫరీదాబాద్ మాడ్యూల్ విస్తరణ వేగం పుంజుకుందని పేర్కొన్నాయి. మరింత మందిని ఉగ్రవాదంవైపు మళ్లించేందుకు, దాడులకు కావాల్సిన సరంజామాను సమకూర్చుకునేందుకు టర్కీ హ్యాండ్లర్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఉగ్ర డాక్టర్లను దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో పనిచేసేలా ప్రోత్సహించినట్లు అనుమానిస్తున్నారు. అందులో భాగంగా డాక్టర్ ముజమ్మిల్ అల్ ఫలాహ్ యూనివర్సిటీలో చేరగా, డాక్టర్ అదీల్ సహరాన్‌పూర్‌లో ఉద్యోగంలో చేరాడు. వీరంతా ఎవరెవరితో టచ్‌లో ఉన్నారు అనేదానిపై దర్యాప్తు అధికారులు ఇప్పుడు దృష్టి పెట్టారు.

ముంబై దాడుల తరహాలో పేలుళ్లకు కుట్ర..

ఈ ఉగ్రవాద ముఠా దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. 2008 నవంబరు 26న పాకిస్థాన్ ఉగ్రవాదులు ముంబైలో మెరుపు దాడులకు పాల్పడిన తరహాలో దేశంలోని ప్రధాన నగరాల్లోని కీలక ప్రదేశాలు, రైల్వే స్టేషన్లు, పెద్దపెద్ద షాపింగ్ మాల్స్‌లో దాదాపు 200 చోట్ల ఏకకాలంలో అత్యంత శక్తిమంతమైన ఐఈడీ బాంబులు పేల్చి విధ్వంసం సృష్టించాలని ప్రణాళిక వేసినట్లు నిఘా వర్గాలు తెలిపాయి.

దీపావళికే దాడికి ప్రణాళిక

పోలీసుల అదుపులో ఉన్న డాక్టర్ ముజమ్మిల్ ఉగ్ర కుట్ర గురించి విచారణలో కీలక విషయాలు వెల్లడించినట్లు సమాచారం. గత దీపావళి రోజునే ఢిల్లీలో దాడులు చేయాలని ప్రణాళిక వేసినట్లు అతడు తెలిపాడు. అందుకోసం ఢిల్లీలోని ఎర్రకోట, ఇండియా గేట్, కాన్‌స్టిట్యూషన్ క్లబ్, గౌరీశంకర్ ఆలయం తదితర చోట్ల రెక్కీ నిర్వహించినట్లు అంగీకరించాడని తెలిసింది. ఈ పేలుళ్లకు గత జనవరి నుంచే ప్రణాళిక వేసినట్లు పోలీసులు తెలిపారు. దీపావళి ప్రణాళిక తప్పిపోవటంతో డిసెంబరు 6న (బాబ్రీ మసీదు కూల్చివేసిన రోజు) దేశవ్యాప్తంగా దాడులు చేయాలని ప్రణాళిక వేసినట్లు ముజమ్మిల్ తెలిపాడు. వచ్చే ఏడాది జనవరి 26న గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఢిల్లీలో భీకర దాడులకు కూడా కుట్ర చేసినట్లు ఒప్పుకున్నాడని సమాచారం. ఎర్రకోట బాంబుదాడికి కారణమైన ఉమర్ నబీ డిసెంబరు 6న దాడికి సిద్ధమయ్యాడని, అనుకోని విధంగా ఫరీదాబాద్ మాడ్యూల్ పోలీసులకు దొరికిపోవటంతో ముందుగానే ఎర్రకోట వద్ద దాడి చేశాడని దర్యాప్తు అధికారులు తెలిపారు. ఉమర్ నబీ ఆత్మాహుతి దాడికి ముందు రామ్‌లీలా మైదాన్ సమీపంలోని ఓ మసీదుకు వెళ్లినట్లు ఢిల్లీ పోలీసులు బుధవారం వెల్లడించారు.

బాధితులకు ప్రధాని పరామర్శ

కారు బాంబు దాడిలో గాయపడి ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ప్రధాని మోదీ బుధవారం పరామర్శించారు. భూటాన్ పర్యటన ముగించుకొని ఢిల్లీకి చేరుకున్న వెంటనే ఆయన నేరుగా ఆస్పత్రికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. అనంతరం మోదీ ట్వీట్ చేశారు. 'ఆస్పత్రికి వెళ్లి బాధితులను కలిశాను. వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. బాంబు దాడి కుట్ర కారకులను చట్టం ముందు నిలబెడతాం' అని పేర్కొన్నారు.



నబీ మరో కారు లభ్యం

ఉమర్ నబీకి చెందిన మరో కారును పోలీసులు బుధవారం గుర్తించారు. ఎరుపు రంగు ఎకోస్పోర్ట్ కారు (డీఎల్10సీకే0458)ను ఫరీదాబాద్ జిల్లా ఖందవాలీలో సీజ్ చేశారు. ఈ కారులో కూడా బాంబులు అమర్చారేమోనన్న అనుమానంతో ఢిల్లీ పోలీసులు హరియాణా, యూపీ పోలీసులను అలర్ట్ చేసి బుధవారం భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు హరియాణా పోలీసులు ఖందవాలీ గ్రామంలో దానిని గుర్తించటం, అందులో బాంబులు లేకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.

లోకం తీరు



అల్ ఫలాహ్ వర్సిటీపైనే ఫోకస్!

భారీ బాంబు దాడులకు కుట్ర పన్నిన ఉగ్ర వైద్యులకు అడ్డాగా మారిన అల్ ఫలాహ్ యూనివర్సిటీ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇటీవలి వరకు ప్రతిష్ఠాత్మక జామియా మిలియా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలకు ప్రత్యామ్నాయంగా గుర్తింపు పొందిన అల్ ఫలాహ్ వర్సిటీ ఇప్పుడు ఉగ్ర మరకలతో అప్రతిష్ఠపాలైంది. హరియాణాలోని ఫరీదాబాద్ పట్టణ శివార్లలోని దౌజ్‌లో 70 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో అల్ ఫలాహ్ ప్రైవేటు యూనివర్సిటీ ఉంది. ఇది 1997లో అల్ ఫలాహ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒక ఇంజనీరింగ్ కాలేజీగా ప్రారంభమైంది. 2014లో ప్రైవేటు వర్సిటీగా గుర్తింపు పొందింది. 2019లో ఇందులో 200 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాలను, దానికి అనుబంధంగా 650 పడకల బోధనాస్పత్రిని ఏర్పాటు చేశారు. ఈ వర్సిటీ వైద్య కళాశాలలో రెసిడెంట్ డాక్టర్లుగా పనిచేస్తున్న ముజమ్మిల్ షకీల్, ఉమర్ మహమ్మద్, షహీన్ షాహిద్‌ల ఉగ్ర లింకులు బయటపడటం కలకలం రేపింది. కాగా, తమ వద్ద పని చేస్తున్న ఇద్దరు వైద్యులను పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిసిందని, ఇక్కడ వారు నిర్వర్తించే విధులు మినహా మిగతా చర్యలతో వర్సిటీకి ఎలాంటి సంబంధం లేదని వర్సిటీ వైస్ చాన్సలర్ భూపిందర్ కౌర్ ఆనంద్ పేర్కొన్నారు.

పరారీలో మరో ఉగ్ర వైద్యుడు నిసారుల్ హాసన్!



అల్ ఫలాహ్ వర్సిటీలో పోలీసుల దర్యాప్తు సందర్భంగా మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. వర్సిటీలో పనిచేస్తున్న మరో ఉగ్ర వైద్యుడు నిసారుల్ హాసన్ పరారీలో ఉన్నట్టు గుర్తించారు. శ్రీనగర్‌లోని శ్రీమహరాజా హరిసింగ్ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సమయంలో నిసారుల్ హాసన్‌కు ఉగ్రవాదులతో సంబంధం ఉన్నట్టు బయటపడింది. దీనితో 2023 నవంబర్‌లో నిసారుల్ హాసన్‌ను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉద్యోగం నుంచి తొలగించారు. తర్వాత నిసారుల్ అల్ ఫలాహ్ యూనివర్సిటీలోని వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా చేరాడు.

11 రోజుల క్రితమే కారు కొని.. బాంబులతో సగం ఢిల్లీ చుట్టేసి!

ఎర్రకోట సమీపంలో భారీ పేలుడుకు కారణమైన హుండై ఐ20 పాత కారును 11 రోజుల క్రితమే కొనుగోలు చేసినట్టు దర్యాప్తు అధికారులు గుర్తించారు. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన తారిఖ్ పేరిట తప్పుడు డాక్యుమెంట్లతో దాన్ని కొనుగోలు చేశారని తెలిసినట్టు అధికారులు చెప్పారు. అక్టోబరు 29న దానిని కొనగానే పొల్యూషన్ సర్టిఫికెట్ తీసుకున్నారని.. తర్వాత నేరుగా తీసుకెళ్లి అల్ ఫలాహ్ వర్సిటీలో పార్కింగ్ చేశారని వెల్లడించారు. ఆ సమయంలో కారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారని గుర్తించినట్టు చెప్పారు. ఈ నెల 9న తోటి ఉగ్రవాదులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఉగ్ర వైద్యుడు ఉమర్ నబీ ఆందోళనకు గురై దాక్కున్నాడని.. ఈ నెల 10న పేలుడు పదార్థాలున్న ఆ కారును తీసుకుని ఢిల్లీ వైపు బయలుదేరాడని తెలిపారు. పేలుడుకు ముందు ఈ కారు దాదాపు సగం ఢిల్లీ అంతా చుట్టేసి వచ్చినట్టు గుర్తించామని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఉగ్ర వైద్యుడు ఉమర్ ఢిల్లీలోని ఆరు జిల్లాల పరిధిలోని 12 కీలక ప్రాంతాల్లో సంచరించినట్టు తేలిందని చెప్పారు. జనసమ్మర్ధం, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే కీలక ప్రాంతాలు నేతాజీ సుభాష్ ప్లేస్, అశోక్ విహార్, కన్నాట్ ప్లేస్, రంజిత్ ఫ్లైఓవర్, డిలైట్ సినిమా, షహీద్ భగత్‌సింగ్ మార్గ్, రోహ్తక్ రోడ్, కశ్మీరీ గేట్, దరియాగంజ్, ఎర్రకోట తదితర చోట్లకు వెళ్లినట్టు సీసీ కెమెరాల ఫుటేజీలతో గుర్తించినట్టు చెప్పారు. నిఘాను తప్పుదారిపట్టించేందుకు గానీ, పోలీసులు, భద్రతా ఏర్పాట్లు ఏ మేరకు ఉన్నాయని పరిశీలించేందుకు గానీ ఉమర్ ఇలా కీలక ప్రాంతాల్లో తిరిగి ఉంటాడని వెల్లడించారు.

మెల్లగా వచ్చి.. ఒక్కసారిగా పేలి..

కారు బాంబు పేలుడుకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలు బుధవారం బయటికి వచ్చాయి. 15 సెకన్ల నిడివి ఉన్న వీడియోలో రోడ్డు మొత్తం ట్రాఫిక్‌తో నిండి ఉంది. వాహనాలు మెల్లగా కదులుతున్నాయి. సాయంత్రం 6.50 గంటల సమయంలో ఒక కారు పేలిపోయి భారీ అగ్నిగోళం ఏర్పడింది. ఆ కారుతోపాటు చుట్టుపక్కల ఉన్న వాహనాలు ధ్వంసమయ్యాయి. దాని ధాటికి సీసీ కెమెరాలు కూడా ధ్వంసమై వీడియో రికార్డింగ్ ఆగిపోయింది. ఆ క్షణం వరకు కంట్రోల్ రూమ్‌లో రికార్డయిన వీడియోను అధికారులు సేకరించారు.



మోచేతులతో పోలీసులను నెట్టేస్తున్న అంబటి

'మెడికల్ కాలేజీలపై' వైసీపీ ర్యాలీలు

» గుంటూరులో అంబటి రాంబాబు రచ్చ

» బారికేడ్లు తోసేసి.. కానిస్టేబుళ్లను మోచేత్తో నెట్టేసి దౌర్జన్యం

» ర్యాలీకి అనుమతి లేదన్న పోలీసులపై దురుసు ప్రవర్తన

గుంటూరు/అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నిరసన ర్యాలీలకు స్పందన అంతంతమాత్రంగానే ఉంది. అనంతపురం, శింగనమల, కడప, విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం, సత్తెనపల్లి, గుంటూరు, విజయనగరం, పుంగనూరు, తిరుపతి తదితర నియోజకవర్గాల్లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో ఆ పార్టీ ముఖ్యనేతలు, మాజీ మంత్రులు పాల్గొన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం మహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక మోస్తరుగా ర్యాలీలు జరిగాయి. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మించేందుకు విడుదల చేసిన ఉత్తర్వును రద్దు చేసుకోవాలని, ప్రభుత్వమే నేరుగా వైద్యకళాశాలలను నిర్వహించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. కాగా, గుంటూరులో ర్యాలీ సందర్భంగా వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు రెచ్చిపోయారు. ర్యాలీకి అనుమతి లేదన్న పోలీసులపై తన ప్రతాపం చూపిస్తూ దౌర్జన్యం చేశారు. పట్టాభిపురంలోని స్వామి థియేటర్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వైసీపీ నేతలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసేసి అడ్డొచ్చిన పోలీసులను తన మోచేతితో నెట్టేశారు. ర్యాలీకి అనుమతి లేదన్న పోలీసులకు వేలు చూపిస్తూ 'ఆపటానికి నువ్వెవరు... ఏం చేస్తావ్' అంటూ పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. అనంతరం కార్యకర్తలతో ర్యాలీగా ముందుకు సాగారు.

బాంబు పేలుడు ఉగ్ర ఘాతుకమే

దేశ వ్యతిరేక శక్తులు పక్కా ప్రణాళికతో ఈ ఘోరానికి పాల్పడ్డాయి.. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

» ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ తీర్మానం

న్యూఢిల్లీ, నవంబరు 12: లాల్‌ఖిలా వద్ద కారు బాంబు పేలుడును కేంద్ర ప్రభుత్వం దారుణమైన ఉగ్రవాద చర్యగా అభివర్ణించింది. దేశవ్యతిరేక శక్తులు పక్కాప్రణాళిక ప్రకారం ఈ ఘాతుకానికి పాల్పడ్డాయని మండిపడింది. ఈ కేసును వేగంగా దర్యాప్తు చేసి.. ఈ ఘోరానికి కారకులైనవారిని, వారి వెనుక ఉన్నవారిని చట్టం ముందుకు వీలైనంత త్వరగా తీసుకురావాలని దర్యాప్తు సంస్థలను ఆదేశించింది. ప్రభుత్వంలోని అత్యున్నతవర్గాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటాయని స్పష్టం చేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం సమావేశమైన కేంద్ర క్యాబినెట్.. అమాయకుల ప్రాణాలను బలిగొన్న దుర్మార్గమైన, పిరికిపంద ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమన్న విధానానికి భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించింది. ఈ ఉగ్ర ఘాతుకానికి బలైన అమాయకులకు నివాళిగా క్యాబినెట్ రెండు నిమిషాలపాటు మౌనం పాటించింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈ పేలుడులో గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించింది. దేశంలోని ప్రతి పౌరుడి ప్రాణాలను కాపాడేందుకు, దేశ భద్రతను, దేశ సమగ్రతను కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించింది. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం.. ఆ విశేషాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు వెల్లడించారు. ఈ ఉగ్రదాడిని యుద్ధచర్యగా (యాక్ట్ ఆఫ్ వార్) పరిగణిస్తారా? అని విలేకరులు ప్రశ్నించగా.. 'నేను ఇప్పటికే మంత్రి వర్గం ఆమోదించిన తీర్మానాన్ని చదివి వినిపించాను' అని బదులిచ్చారు. కాగా, ఈ భేటీకి ముందు ప్రధాని మోదీ.. 'భద్రతపై క్యాబినెట్ కమిటీ' భేటీని నిర్వహించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా తదితరులు ఆ సమావేశంలో పాల్గొన్నారు.

మరికొన్ని కీలక నిర్ణయాలు..

ఎర్రకోట వద్ద ఉగ్రదాడిని ఖండిస్తూ తీర్మానం చేయడంతోపాటు.. కేంద్ర క్యాబినెట్ కొన్ని కలీక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశ ఎగుమతి వ్యవస్థ బలోపేతానికిగాను 2025-26 నుంచి 2030-31 వరకూ రూ.25,060 కోట్లతో ప్రతిపాదించిన 'ఎగుమతి ప్రోత్సాహక మిషన్(ఈపీఎం)'కు ఆమోదం తెలిపింది. ఈ మిషన్‌లో అంతర్భాగంగా రెండు ఉప పథకాలు ఉంటాయి. ఒకటి.. నిర్యత్ ప్రోత్సాహన్. మరొకటి నిర్యత్ దిశ. వీటిలో నిర్యత్ ప్రోత్సాహన్ కింద దేశంలోని ఎంఎస్ఎంఈలకు రుణసౌలభ్యం, ఈకామర్స్ ఎగుమతిదారులకు వడ్డీ రాయితీ వంటివి కల్పిస్తారు. ఇందుకుగాను ఈ పథకానికి రూ.10,401 కోట్లు కేటాయించారు. రూ.14,659 కోట్లతో చేపట్టనున్న నిర్యత్ దిశ పథకంలో భాగంగా ఎగుమతి నాణ్యత, అంతర్జాతీయ బ్రాండింగ్, ప్యాకేజింగ్, రవాణా సదుపాయాలు, ఆర్థికేతర సదుపాయాల కల్పన తదితరాలపై దృష్టి సారిస్తారు. అలాగే.. రూ.20 వేల కోట్లతో.. ఎగుమతిదారులకు పూచీకత్తు లేని రుణసాయం కల్పించే సీజీఎస్ఈ పథకానికి కూడా కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద 'నేషనల్ క్రెడిట్ గ్యారంటీ ట్రస్టీ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సీజీటీసీ) ద్వారా ఎగుమతిదారులకు 100 శాతం రుణ భరోసా కవరేజీని కల్పించనున్నారు. దీంతోపాటు.. గ్రాఫైట్, సీజియం, రుబీడియం, జిర్కోనియం దేశీయ ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా వాటి రాయల్టీ రేట్లను హేతుబద్ధీకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

పెద్దిరెడ్డి కుటుంబానికి అటవీ భూములా?

» అడవుల మధ్యలో వారసత్వ భూములెలా వచ్చాయి?

» దీని వెనుక ఎవరి పాత్ర ఏంటో తేల్చండి

» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష



అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): "అటవీ శాఖ మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి అడవి మధ్యలో ఉన్న భూమి వారసత్వంగా వచ్చిందని చెబుతున్నారు. అసలు అడవుల మధ్యలో వారసత్వ భూమి ఎలా వచ్చింది? ఈ భూమి ఎలా.. ఎప్పుడు చేతులు మారింది.. ఇందులో ఎవరి పాత్ర ఎంత అనేదానిపై నివేదికలు తయారు చేయండి" అని ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మంగళంపేటలో పెద్దిరెడ్డి, ఆయన కుటుంబసభ్యుల చేతిలో ఉన్న సుమారు 104 ఎకరాల అటవీ భూములపై బుధవారం అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అటవీ చట్టం ప్రకారం ప్రిలిమినరీ అఫెన్స్ రిపోర్ట్ (పీఓఆర్), చార్జిషీటు దాఖలు చేశామని అధికారులు ఆయనకు చెప్పారు. ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో కేసుల వివరాలు దాఖలు చేశామన్నారు. పీఓఆర్, విజిలెన్స్ నివేదికలపై చర్చించిన పవన్.. 'అటవీ భూములు ఆక్రమించిన వారి వివరాలను శాఖ వెబ్‌సైట్‌లో వెల్లడించాలి. ఈ దిశగా ప్రణాళిక సిద్ధం చేయండి. ఎవరి ఆక్రమణలో ఎంత అటవీ ఆస్తి ఉంది? వారిపై నమోదైన కేసుల వివరాలు, ప్రస్తుతం సదరు కేసులు ఏ స్థితిలో ఉన్నాయి వంటి వివరాలు ప్రజలకు తెలియాలి" అని పవన్ ఆదేశించారు. "అటవీ భూముల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టం కఠినంగా ఉంది. అటవీ ఆస్తులను కబ్జా చేస్తే....కఠిన చర్యలకు ఉపక్రమించండి. మంగళంపేట అటవీ భూముల వ్యవహారం చూస్తే.. చట్టం కఠినంగా ఉన్నా.. అమలు లేకపోవడం వల్లే ఆక్రమణలు జరిగినట్టు కనిపిస్తోంది" అని పవన్ అభిప్రాయపడ్డారు. 'పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి 2024 ఎన్నికల్లో ఈ అటవీ భూముల గురించి అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారనే అంశం నా దృష్టికి వచ్చింది. దీనిపై న్యాయ నిపుణుల సలహా ప్రకారం ముందుకు వెళ్లాలి. అలాగే రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం 45.80 ఎకరాలు వాళ్ల ఆధీనంలో ఉంటే.. వెబ్‌ల్యాండ్‌లోకి వచ్చేసరికి 77.54 ఎకరాలుగా చూపారు. ఒకేసారి ఎందుకు ఇంత పెరిగిందన్న విషయాన్ని కూడా పరిశీలించాలి" అని ఆదేశించారు.



జస్టిస్ మల్లికార్జునరావుకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో, చైర్మన్

క్షీరా రామలింగేశ్వరస్వామి సేవలో

జస్టిస్ మల్లికార్జునరావు

పాలకొల్లు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లాలోని పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు బుధవారం దర్శించారు. ప్రత్యేక పూజల అనంతరం న్యాయమూర్తికి వేద పండితులు ఆశీర్వచనం, ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ మీసాల రాము స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

నేటి నుంచి సత్యసాయి శతజయంత్యుత్సవాలు

- తొలి రోజు నుంచే నారాయణ సేవ
- పుట్టపర్తికి పెరిగిన భక్తుల తాకిడి
- వేడుకలకు హాజరుకానున్న రాష్ట్రపతి, ప్రధాని

పుట్టపర్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వేడుకల్లో పాల్గొనే భక్తులకు నారాయణసేవను తొలిరోజు నుంచే ప్రారంభిస్తారు. ప్రతి సంవత్సరం నవంబరు 18 నుంచి జయంతి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. కానీ శత జయంతి పురస్కరించుకుని ఈసారి ఐదు రోజుల ముందే వేడుకలను ప్రారంభిస్తున్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ గురువారం ప్రశాంతి నిలయంలో నారాయణ సేవను ప్రారంభిస్తారు. లక్షలాది మంది భక్తులు వస్తుండటంతో ప్రశాంతి నిలయంలోనే గాక వేర్వేరు ప్రాంతాల్లో నారాయణ సేవను అందించనున్నారు. 18వ తేదీన సత్యసాయి రథోత్సవం, 19న అంతర్జాతీయ మహిళా దినోత్సవం, 20, 21 తేదీలలో అంతర్జాతీయ శాంతి సమ్మేళనాలు, 22న సత్యసాయి యూనివర్సిటీ స్నాతకోత్సవం, 23న సత్యసాయి శత జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ నెల 19న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, 22న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, 23న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొంటారు. ఈ నెల 20న తిరుపతి, 22న పుట్టపర్తిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన, ఈ నెల 14న ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ విశాఖ పర్యటన, ఈ నెల 19న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టపర్తి పర్యటనలకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో సత్యసాయి నిలయం యజుర్ మందిరం

సకాలంలో పనులు పూర్తి చేయాలి

- జల్‌జీవన్ మిషన్‌పై పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు
- శాఖల సమన్వయం ముఖ్యం.. గోదారి జిల్లాల్లో పురోగతి
- మిగిలిన జిల్లాల్లోనూ వేగం పుంజుకోవాలి
- గత ప్రభుత్వం కొళాయి పెట్టి కనెక్షన్ మరచింది
- అధికారులంతా నిబద్ధతతో పనిచేయాలి: పవన్
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఉపముఖ్యమంత్రి సమీక్ష



అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ పనుల పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో పనులను నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. జల్‌జీవన్ మిషన్ పనుల పురోగతిపై బుధవారం గ్రామీణ నీటి సరఫరాలశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజు పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించడం, అడ్డంకులుంటే జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో పరిష్కరించేలా పర్యవేక్షణ బృందాలు పనిచేయాలన్నారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించాలన్న ప్రధానమంత్రి కలల సాకారానికి, సీఎం చంద్రబాబు నాయకత్వంలో అధికారులంతా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన, శుద్ధ జలాలను అందించేందుకు కంకణబద్ధులై పనిచేయాలన్నారు. అదే సమయంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఇప్పటికే ఐదు జిల్లాల్లో ఇంటింటికీ తాగునీరు అందించే లక్ష్యంతో మెగా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. వాటికి అవసరమైన నిధుల సమీకరణ, పనుల వేగవంతానికి ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. పల్లెపల్లెకు శుద్ధ జలాలు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో రూ.1290 కోట్లతో మొదలు పెట్టిన ప్రాజెక్టు పూర్తయితే ప్రకాశం పశ్చిమ ప్రాంతంలో 21 లక్షల మందికి పైగా తాగునీరు అందించవచ్చన్నారు. ఫ్లోరైడ్ ప్రభావిత ఆ ప్రాంతానికి ఈ ప్రాజెక్టు సంజీవని వంటిదని వ్యాఖ్యానించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పనులు ముందంజలో ఉన్నట్లు అధికారులు గణాంకాలను వెల్లడిస్తున్నాయన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో రూ.1650 కోట్ల అంచనా వ్యయంతో రెండు నీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, 36 నీటి సంపులు, 24 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణంలో ఉన్నాయి. 1.50 లక్షలకు పైగా ఇళ్లకు కొళాయిల కనెక్షన్ ఇస్తామన్నారు. పశ్చిమగోదావరిలోనూ పనులు సంతృప్తికరంగానే సాగుతున్నాయన్నారు. మిగిలిన జిల్లాల్లో కొంత వేగం పుంజుకోవాల్సి ఉందన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులకు మన ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. చిన్న సమస్యల కారణంగా పనులకు ఆటంకాలు ఉంటే సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ జిల్లా కలెక్టర్లు వాటిని తొలగించే దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు. కలెక్టర్ల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసుకోవాలని, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రోడ్లు భవనాలు, అటవీ, రెవెన్యూ తదితర శాఖల నుంచి అధికారులను ఇందులో సభ్యులుగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్షలు నిర్వహించి వేగవంతానికి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ స్థాయిలో పరిష్కారం కాని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని నిర్దేశించారు. గత ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పనులను పూర్తిగా అటకెక్కించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.27 వేల కోట్లు కేటాయిస్తే, రాష్ట్రం నుంచి ఇవ్వాల్సిన వాటా కేటాయింపులు జరగలేదని, దీంతో ఒక వంతు పనులు కూడా పూర్తి చేయాలేకపోయారని తెలిపారు. రూ.4 వేల కోట్ల పనులు పూర్తి చేశామని లెక్కలు చూపారని, అక్కడక్కడ ఇళ్లకు కొళాయిలు పెట్టారే గానీ, కనెక్షన్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నిధుల కొరత లేకుండా ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఐదు జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

దేశ భద్రత ప్రతి పౌరుడి బాధ్యత

- అంతర్గత ఉగ్రవాదాన్ని నివారించాలి
- ప్రతి ఒక్కరూ ఆ బాధ్యత తీసుకోవాలి: పవన్

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): 'నిఘా, భద్రతా దళాల్లోని సిబ్బందికి నా హృదయపూర్వక వందనాలు' అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వారు నిజమైన వీరులని బుధవారం 'ఎక్స్'లో కొనియాడారు. 'వారు దేశ భక్తులు. పగలు, రాత్రి నిశ్శబ్దంగా ఎటువంటి గుర్తింపు కోరుకోకుండా మన దేశానికి సేవ చేస్తున్నారు. అదే మన పౌరులు కూడా ఊహించలేని సామూహిక ప్రాణనష్టాలను నివారిస్తోంది. మన దేశ భద్రత, శాంతిని కాపాడుతోంది. ఉగ్రవాదానికి మూలాలు, సంబంధాలు దేశవ్యాప్తంగా వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. జాతీయ భద్రత అనేది కేంద్ర ప్రభుత్వ పని మాత్రమే కాదు. ఈ విధి ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రతి ప్రభుత్వ శాఖకు, ప్రతి స్థానిక సంస్థకు, గ్రామ పంచాయతీకి ఉంది. ప్రతి రాజకీయ పార్టీ దేశ భద్రతపై ప్రత్యేక అజెండా కలిగి ఉండటం అత్యవసరమైంది. దీనికే తొలి ప్రాధాన్యం ఉండాలి. ప్రజలుగా మనం కళ్లు మూసుకుంటున్నాం. బుజ్జగింపు రాజకీయాలు, జాతీయ సార్వభౌమాధికారంపై భాషా, ప్రాంతీయ గర్వాన్ని ప్రేరేపించడం వల్ల కలిగే ముప్పులు కేవలం రాజకీయ సాధనాలు కావు, అవి మన ప్రజాస్వామ్య పునాదిని బలహీనపరిచేందుకు లోతుగా పాతుకుపోయిన కుట్రలు. పౌరులు, ముఖ్యంగా యువత ప్రేక్షకులుగా మారకూడదు' అని పేర్కొన్నారు.

వైద్య కళాశాలలపై దిగజారుడు రాజకీయాలు

- కోటి సంతకాలు తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టారా?
- జగన్‌ను నిలదీసిన మంత్రి సత్యకుమార్

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కనీవినీ ఎరుగని రీతిలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సగం సీట్లకు రూ.12 లక్షలు, రూ.20 లక్షలు ఫీజులు నిర్ణయించిన మాజీ సీఎం జగన్ ఇప్పుడు వైద్య విద్యార్థుల కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ బుధవారం ఆరోపించారు. కల్తీ మద్యం, శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ, భారీ అవినీతి ఆరోపణలతో నిండా మునిగిన జగన్ తన రాజకీయ ఉనికి కోసం పీపీపీ వైద్య కళాశాలలపై దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పీపీపీ విధానాన్ని ప్రయివేటీకరణగా చిత్రీకరిస్తూ కోటి సంతకాలంటూ నానా యాగీ చేస్తున్న జగన్‌కు ప్రజల మద్దతు లేకపోవడంతో తాడేపల్లి ప్యాలెస్‌లో ఎన్ని దొంగ సంతకాలు చేశారో చెప్పాలని మంత్రి నిలదీశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జగన్ అధికారంలో ఉన్నప్పుడు సెల్ఫ్ ఫైనాన్సింగ్ అంటూ కొత్త ప్రభుత్వ కాలేజీల్లో రూ.12 లక్షలు, రూ.20 లక్షల ఫీజులు ఎందుకు నిర్ణయించారో చెప్పాలని నిలదీశారు.

'కబుర్ల దేవత'కు బాలల సాహిత్య పురస్కారం

- రేపు ఢిల్లీలో రచయిత శివకుమార్‌కు ప్రదానం

న్యూఢిల్లీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ భాషలలో సాహిత్య అకాడమీ బాలల సాహిత్య పురస్కారాలకు ఎంపికైనవారికి శుక్రవారం అవార్డులను ప్రదానం చేయనున్నారు. తాన్‌సేన్ మార్గ్‌లోని త్రివేణి ఆడిటోరియంలో విజేతలకు అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ పురస్కారాలను ప్రదానంచేస్తారు. తెలుగు భాషలో గంగిశెట్టి శివకుమార్ కథల పుస్తకం కబుర్ల దేవత ఈ అవార్డుకు ఎంపికైంది. శివకుమార్ స్వస్థలం నెల్లూరు జిల్లా. అవార్డు గ్రహీతలకు రూ.50 వేలు నగదు అందిస్తారు.

డబ్బు ఆశ చూపి కిడ్నీ కాజేసి..

- మదనపల్లెలో కిడ్నీ రాకెట్ గుట్టు రట్టు
- ఆపరేషన్ తర్వాత మహిళ మృతితో వెలుగులోకి
- పోలీసుల అదుపులో నిందితులు.. ఏడుగురిపై కేసు

మదనపల్లె, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళకు డబ్బులు ఆశ చూపి కిడ్నీ ఇచ్చేందుకు ఒప్పించారు. ఆమెను విశాఖపట్నం నుంచి తీసుకొచ్చి అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని ప్రైవేటు ఆస్పత్రిలో కిడ్నీ ఆపరేషన్ చేయించారు. కానీ.. ఆ మరుసటి రోజే ఆమె మృతిచెందడంతో సీన్ రివర్సయింది. ఇన్నాళ్లూ సీక్రెట్‌గా సాగుతున్న కిడ్నీ రాకెట్ గుట్టు రట్టయింది..! దీంతో మదనపల్లె టూటౌన్ పోలీసులు ఏడుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ కేసు వివరాలను టూటౌన్ సీఐ రాజారెడ్డి బుధవారం వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా అనంతపురం మండలం బొడ్డుపాలేనికి చెందిన ఎస్.యమున (29) భర్త కృష్ణ ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి ఆమె ఓ దుకాణంలో పనిచేస్తూ తన తొమ్మిదేళ్ల కుమారుడితో కలిసి జీవిస్తోంది. ఈ క్రమంలో గాజువాక మండలానికి చెందిన పద్మ, సత్య ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న యమునకు డబ్బులు ఆశ చూపి కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు ఒప్పించారు. వారిలో ఒకరు మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రిలో, ఇంకొకరు కదిరి ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రాల్లో టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. వారికి అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన బాలరంగడు, సత్యసాయి జిల్లా కదిరికి చెందిన మెహరాజ్‌తో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో యమునతో చనువుగా ఉండే సూరిబాబు సాయంతో పద్మ, సత్య ఆమెను మదనపల్లెకు తీసుకొచ్చారు. ఇక్కడ బాలరంగడు, మెహరాజ్ ద్వారా ఆదివారం మదనపల్లె ఎస్‌బీఐ కాలనీలోని గ్లోబల్ ఆస్పత్రిలో చేర్పించారు. అదేరోజు డాక్టర్లు యమునకు కిడ్నీ ఆపరేషన్ చేయగా సోమవారం ఆమె మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని తిరుపతి తీసుకెళ్లిన సూరిబాబు.. వైజాగ్‌లో ఉన్న మృతురాలి తల్లి సూరమ్మకు ఫోన్ చేసి.. మదనపల్లెలో కిడ్నీ ఆపరేషన్ చేసిన తర్వాత యమున మృతిచెందిందని చెప్పాడు. 'నా కుమార్తెను నువ్వే తీసుకెళ్లి చంపేశావు..' అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేయడంతో భయపడిపోయిన సూరిబాబు 112 నంబర్‌కు ఫోన్‌చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన తిరుపతి ఈస్ట్ పోలీసులు..మదనపల్లె పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో వారు నిందితులను మంగళవారం సాయంత్రం మదనపల్లెలోని గ్లోబల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ గ్లోబల్ ఆస్పత్రి అధినేత, అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్ (జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త) డాక్టర్ ఆంజనేయులును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సూరమ్మ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. బెంగళూరుకు చెందిన ఓ డాక్టర్ కిడ్నీ ఆపరేషన్ చేసినట్లు సీఐ తెలిపారు. డాక్టర్ ఆంజనేయులుతో పాటు ఆపరేషన్ చేసిన వైద్యుడు, మధ్యవర్తులుగా వ్యవహరించిన పద్మ, సత్య, బాలరంగడు, మెహరాజ్, సూరిబాబుపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



అన్నమయ్య జిల్లా మదనపల్లె ఎస్‌బీఐ కాలనీలోని గ్లోబల్ ఆస్పత్రి

పిక్నిక్ అని తీసుకెళ్లి చంపేశారు

తన కుమార్తె యమునను పిక్నిక్ పేరుతో తీసుకొచ్చి చంపేశారని మృతురాలి తల్లి సూరమ్మ వాపోయారు. విశాఖకు చెందిన యమున కిడ్నీ రాకెట్ ముఠా చేతిలో మోసపోయి, మృత్యువాత పడిన నేపథ్యంలో.. ఆమె తల్లి సూరమ్మ బుధవారం మదనపల్లెకు చేరుకున్నారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆమె మాట్లాడుతూ... యమున సూరిబాబు భార్య కాదని, పిక్నిక్ పేరుతో మాయమాటలు చెప్పి తీసుకొచ్చి కిడ్నీ ముఠాకు బలిచేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీ జనగణన తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలి

- ఏపీ బీసీ సంక్షేమ సంఘం పిల్
- పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీసీ జనగణన జరిపిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ముఖ్య కార్యదర్శులు, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఈ పిల్ దాఖలు చేశారు. మరోవైపు.. రాష్ట్రంలో కుల గణనతోపాటు, జనాభా దామాషా మేరకు బీసీ రిజర్వేషన్లు చట్టబద్ధంగా వర్గీకరించాలని శంకరరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు వినతిపత్రం అందజేశారు. బీసీ రిజర్వేషన్లను చట్టబద్ధంగా వర్గీకరించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీఎస్‌ను కోరినట్టు బుధవారం ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. విద్య, ఉద్యోగాల తరహాలో ఏబీసీడీఈ వర్గీకరణ చేశాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

ఆస్పత్రులకు తుఫాను నష్టం రూ.13.13 కోట్లు

- ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఆరోగ్య శాఖ

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 40 ప్రభుత్వాస్పత్రుల భవనాలు దెబ్బతిన్నాయని, వీటికి తక్షణం మరమ్మతులు చేసేందుకు రూ.13.13 కోట్లు అవసరమని ఆరోగ్యశాఖ తాత్కాలికంగా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ వివరాలను శాఖ అధికారులు మంత్రి సత్యకుమార్‌కు అందించారు. ఉప ఆరోగ్య కేంద్రాల నుంచి బోధనాస్పత్రుల వరకూ మొత్తం 40 చోట్ల భవన నిర్మాణాలు దెబ్బతిన్నాయని ఇంజనీర్లు గుర్తించారు. కొన్ని ఆస్పత్రుల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఈ నష్టం వివరాలను ఆరోగ్యశాఖ ప్రభుత్వానికి పంపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇదేమి న్యాయం?

‘మరి, మా పిల్లలను ఎవరు చంపారు?’ అన్న ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం. దేశాన్ని కుదిపేసిన నిఠారీ హత్యకేసులో ద్రోహులెవ్వరో, దోషులెవ్వరో తేల్చకుండానే కథ ముగిసింది. ఎవరికీ ఏ శిక్షాపడకుండా ఇరవైమంది పిల్లల తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలింది. పనివాడు సురేందర్ కోలీ, యజమాని మనీందర్‌సింగ్ పంధేర్ కాక ఆ ఇంట్లో ఏవో దయ్యాలున్నాయని, అవే మీ పిల్లలను చంపాయని కోర్టులు అంటున్నాయా? అని వారు అడుగుతున్నారు. సురేందర్ కోలీమీద మిగిలిపోయిన ఆ ఒక్క కేసును కూడా సుప్రీంకోర్టు కొట్టివేయడం ద్వారా ఆ దారుణహత్యాకాండకు ఎవరూ బాధ్యులు కాదనీ, పాపులెవ్వరూ లేరని తేల్చేయడం నిఠారీ నివాసులకు తీవ్ర ఆగ్రహావేదనలు కలిగించడం సహజం.

రెండేళ్ళక్రితం అలహాబాద్ హైకోర్టు ఏకంగా పన్నెండు కేసుల్లో కోలీని బయటపడవేసిన నేపథ్యంలో, ఆ తీర్పును ఎత్తిపడుతూ, ఈ చివరికేసులో సైతం అతడు నేరం చేశాడని నిర్ధారించలేమని, వదిలేయమని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అతడివి బలవంతపు నేరాంగీకారాలేనని కోర్టు నమ్ముతోంది. నిఠారీ రాక్షసుడు, మృతదేహాలతో రమించే కామాంధుడు అంటూ కోలీకి అనేక పేర్లు పెడుతూ, యజమాని ఆదేశాల మేరకే ఇదంతా చేశాడని ఒకదశలోనూ, ఆ తరువాత పంధేర్ ప్రమేయం లేకుండా ఇతగాడే అన్నీ చేశాడన్నది పోలీసులూ సీబీఐ ఆరోపణ. చుట్టుపక్కల నిరుపేద పిల్లలను ఊరించి, బంగ్లాకు రప్పించి, అఘాయిత్యాలు, హత్య అనంతరం భవనం వెనుక ఉన్న కాలువలో మృతదేహాల విడిభాగాలు పడవేశారన్నది అభియోగం. దర్యాప్తు సాగుతున్నంతకాలం అధికార, అనధికార కథనాలకు హద్దేలేకపోయింది. పూర్తిగా ఒక్క మృతదేహమూ లభ్యం కాకుండా శరీర భాగాలు మాత్రమే కాలువలో లభించినందున కోలీని నరమాంసభక్షకుడన్నారు, వీరిద్దరూ ఆర్గాన్‌రాకెట్ అధిపతులనీ అన్నారు. పంధేర్‌ను నేరస్థుడుగా నిర్ధారించడానికి అత్యంత కీలకంగా నిలిచిన కోలీ నేరాంగీకారం విషయంలో వివిధస్థాయి న్యాయస్థానాలు భిన్న వైఖరి తీసుకోవడం కూడా కేసు బలహీనపడటానికి దోహదం చేసింది. ఇదే నేరాంగీకారం ఆధారంగా దిగువకోర్టు ఇరువురికీ మరణశిక్ష విధిస్తే, హైకోర్టులో అది చెల్లకుండా పోయింది. నిఠారీ హత్యల్లో విచారణకు వచ్చిన తొలి కేసులో ఇదే నేరాంగీకారాన్ని సెషన్స్ కోర్టు, అలహాబాద్ హైకోర్టు, చివరకు సుప్రీంకోర్టు సైతం ఆమోదించి ఉరిశిక్ష ఖరారు చేయడం, కోలీ క్షమాబిక్ష అభ్యర్థనను రాష్ట్రపతి నిరాకరించడం, ఆ తరువాత మళ్ళీ ఉరి నిలిచిపోవడం వంటి పరిణామాలు తెలిసినవే. మిగతా పన్నెండు కేసులకూ కూడా కీలకమైన ఈ నేరాంగీకారాన్ని కోలీ తరఫు న్యాయవాదులు సాంకేతికంగా అనర్హమైనదని నిరూపించగలిగారు. దీనికి ముందు అరవైరోజుల పాటు పోలీసు కస్టడీలో ఉండటం, కేవలం ఐదునిముషాలు మాత్రమే ఆయన తన న్యాయసహాయకుడితో మాట్లాడగలడం వంటి చిన్నచిన్న అంశాలు ఇందుకు ఉపకరించాయి. కోలీ, పంధేర్ నివాసం సమీపంలో ఉన్న ఒక వైద్యుడిమీద అప్పటికే శరీరభాగాల అక్రమరవాణా కేసులున్న నేపథ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని అలహాబాద్ హైకోర్టు కోలీనీ, మిగిలిన రెండు కేసుల్లోనూ పంధేర్‌ను పూర్తిగా వదిలేసింది. అనుమానం ఎంతగట్టిగా ఉన్నా, ఆధారాలు బలంగా లేనప్పుడు కేసు నిలవదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్య సముచితమైనదే. కానీ, ఒకే హత్యాకాండకు సంబంధించి వేర్వేరు న్యాయస్థానాలు భిన్నమైన పరిగణనలు, దృక్పథాలు, తీర్పుల ఆధారంగా వీరిద్దరూ నిక్షేపంగా బయటపడగలిగారన్నదీ వాస్తవం.

ఇరవై హత్యలకు వీరిద్దరూ కారకులు కానప్పుడు, కేసుమొత్తం వారి చుట్టూనే తిప్పుతూ, రెండుదశాబ్దాలపాటు పలుమార్లు పలురకాల శిక్షలు ఎందుకు వేశారంటూ సామాజిక మాధ్యమాల్లో కొందరు ప్రశ్నిస్తున్నారు. నిందితులు వీరు కాదని తేల్చేసిన న్యాయస్థానాలు కేసు తప్పుదోవపట్టినందుకు అధికారులను బాధ్యులను చేసివుంటే బాగుండేది. సుదీర్ఘకాలం దర్యాప్తు సాగించినా, అది న్యాయప్రమాణాలకు అనుగుణంగా నిలవలేకపోయిందని న్యాయస్థానం అంటోంది. అటువంటప్పుడు ఇద్దరు అమాయకులను రెండుదశాబ్దాలపాటు ఘోరమైన ఆరోపణలతో వేధించి, అవమానించిన వారంతా దండనార్హులు కాదా? అన్నది మంచి ప్రశ్న. న్యాయస్థానాలు వదిలేసినా, తమ పిల్లలను పొట్టనబెట్టుకున్న ఆ ఇద్దరినీ దేవుడు క్షమించడని నిఠారీవాసుల నమ్మకం.

విస్తృత, సమ్మిళిత కులగణన ఎలా?

కుల గణనను నిర్వహించాలని నిర్ణయించినట్టు గత ఏప్రిల్ 30న మోదీ ప్రభుత్వం ప్రకటించినప్పుడు ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. సామాజిక న్యాయసాధనకు పోరాడుతున్నవారు తమకొక విజయం లభించినట్టు ఆనందభరితులు అయ్యారు. ఆ నిర్ణయం తీసుకోవడంలో మోదీ సర్కార్ రాజకీయ అంచనాలు ఏమైనప్పటికీ అసంఖ్యాకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న, అయితే చాలా కాలంగా వాయిదా పడుతూ వస్తోన్న కుల గణన ఎట్టకేలకు సంభవించనున్నది. కుల అసమానతలను రూపుమాపడంలో స్వతంత్ర భారతదేశం తడబడుతూ వ్యవహరిస్తోంది. ఇప్పుడు ఆ అస్థిర పురోగతికి స్వస్తి చెప్పేందుకు దోహదం చేసే ఒక బృహత్తర ముందడుగును కులగణనతో వేయనున్నామనడం సత్య దూరం కాదు.


■ యోగేంద్ర యాదవ్

ప్రతిపాదిత కుల గణన విషయంలో జాగ్రత్తగా ఉండవల్సిన అవసరాన్ని రెండు కొత్త పుస్తకాలు మనకు నొక్కి చెప్పుతున్నాయి. వాటిలో ఒకటి సామాజిక శాస్త్రవేత్త త్రిన విథయథిల్ పరిశోధనా గ్రంథం ‘Counting Caste’ కాగా మరొకటి ప్రముఖ ప్రజా మేధావి ఆనంద్ తెల్తుంబ్డే రాసిన ‘The Caste Con Census’. విథయథిల్, తెల్తుంబ్డే ఇరువురూ సామాజిక న్యాయసాధనకు, కుల నిర్మూలన లక్ష్యాలకు నిబద్ధమైన వారు. కుల గణనపై ఇరువురివీ పూర్తిగా భిన్నమైన దృక్కోణాలు. అయితే విశేషంగా ఆకట్టుకునేవి, లోతుగా ఆలోచింపచేసేవి. ప్రతిపాదిత కుల గణనపై ప్రయోజనకరమైన చర్చను పురిగొల్పే గ్రంథాలవి. సామాజిక న్యాయ సంబంధిత అంశాలపై సంభాషణలను మరింత ప్రగాఢం చేసేవి కూడా అనడంలో సందేహం లేదు.

ఆనంద్ తెల్తుంబ్డే దేశవ్యాప్తంగా ప్రఖ్యాతుడు అయిన ప్రజా మేధావి. అంబేడ్కర్ వాది. కుల నిర్మూలనపై అంబేడ్కర్ దృక్పథాన్ని ఎటువంటి మినహాయింపులేకుండా ఆమోదించేవారి అభిప్రాయాలతో విభేదించేందుకు, వారి ఆలోచనలకు విరుద్ధంగా ఉన్న తన ఆలోచనలను వ్యక్తం చేసేందుకు భయపడని నవ భావ సాహసి. చారిత్రకంగా వివక్షకు గురవుతోన్న అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన సానుకూల చర్య (Affirmative action) విధానాన్ని ఆయన పూర్తిగా సమర్థిస్తారు. అయితే రిజర్వేషన్లు అనే సానుకూల చర్యను పటిష్ఠం చేసేందుకు సార్వత్రిక విద్య, ఆరోగ్య భద్రతా విధానాలను కూడా సంపూర్ణంగా అమలుపరచాలని ఆయన నొక్కి చెప్పారు. సానుకూల చర్యను మౌలిక సమానత్వాన్ని లక్ష్యిస్తున్న పరివర్తన సాధక విధానాలు, కార్యక్రమాలకు సంధానం చేయాలని ఆయన వాదించారు.

కుల గణనపై చర్చ సాధారణంగా ముందే చెప్పదగిన లేదా సూచించదగిన విధంగా సాగడం కద్దు. సామాజిక న్యాయాన్ని డిమాండ్ చేసేవారు కుల గణనను ఆమోదిస్తారు. కులగణన వ్యతిరేకులు కులవ్యవస్థ సమకూరుస్తున్న ప్రత్యేక హక్కులు, సదుపాయాలను బహిరంగంగా లేదా రహస్యంగా సమర్థించేవారై ఉంటారు. ఆనంద్ తెల్తుంబ్డే ఈ కోవకు చెందిన ఆలోచనాపరుడు కాదు. ఆ ఆలోచనా రీతులకు భిన్నంగా వివేచించే విలక్షణ మేధావి. వచ్చే ఏడాది నుంచి నిర్వహించనున్న జనాభా గణనలో భాగంగా కుల గణన కూడా జరపాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించడం తమ రాజకీయ ప్రయోజనాలు సాధించుకునేందుకు ఉద్దేశించిన ఒక వ్యూహాత్మక నిర్ణయం మాత్రమేనని ఆయన నిష్కర్షగా చెప్పారు. కుల గణన ఒక వంచన మాత్రమే అన్న ఏకాభిప్రాయం ఉదారవాదుల్లో వ్యక్తమవుతోంది. కుల గణన కులపరమైన గుర్తింపులను మరింతగా బలపరుస్తుందనేది ఆ ఉదారవాదుల ఆక్షేపణ. రిజర్వేషన్ల కోటాలో ఉప కోటాలకు డిమాండ్లు పెరుగుతాయని, ఫలితంగా అసమాన సామాజిక వ్యవస్థకు బాధితులుగా ఉన్న అట్టడుగు కులాల వారు సంఘటితం కావడాన్ని నిరోధిస్తుంది. కుల నిర్మూలన స్పృహతో కూడిన సానుకూల చర్యను బలహీనపరుస్తుంది.

కుల గణన సామాజిక న్యాయానికి దోహదం చేసేదికాదని, కుల వ్యవస్థను శాశ్వతం చేయడానికి మాత్రమే అది సాధనమవుతుందని తెల్తుంబ్డే సైతం తన పుస్తకంలో గట్టిగా వాదించారు. ఆయన కొత్త ఆలోచనలను ప్రేరేపించారు గాని వాటి సహేతుకత గురించి నచ్చచెప్పలేకపోయారు. కేవలం ఏ కులంలో ఎంతమంది ఉన్నారని లెక్కించడం సామాజిక అసమానతలకు పరిష్కారం కాదు, కాబోదని స్పష్టం చేసిన తెల్తుంబ్డే, సంఖ్యా గణన నుంచి సామాజిక అసమానతల సంక్లిష్ట స్వభావంపై లోతైన అవగాహనకు దోహదం చేసే మరింత సూక్ష్మమైన కుల గణన విధానాన్ని ఆయన పరిగణనలోకి తీసుకోలేదు.

> **మనం capital C census (ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే దేశ జనాభా గణన) నుంచి small c census (ఒక నిర్దిష్ట సామాజిక సమూహంలోని ప్రతి ఒక్క సభ్యుడి వివరాలను సేకరించే క్రమబద్ధమైన సర్వే)కు వెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. తద్వారా మాత్రమే వర్తమాన భారతదేశంలో ఆస్తులు, అవకాశాలు ఏ విధంగా పంపిణీ అవుతున్నాయనే విషయమై ఒక కచ్చితమైన అవగాహన సుసాధ్యమవుతుంది. అటువంటి నిర్దుష్ట అవగాహన ఉన్నప్పుడే సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడం సులభమవుతుంది.**

కుల గణన అనేది అణగారిన కులాల జనాభా లెక్కింపు మాత్రమే కాదని, అగ్రకులాల వారికి కుల వ్యవస్థ సమకూరుస్తున్న ప్రత్యేక హక్కులు, సదుపాయాలను బహిర్గతం చేస్తుందని సామాజిక శాస్త్రవేత్త సతీశ్ దేశ్ పాండే అభిప్రాయపడ్డారు. ప్రతి కుల సమూహ సభ్యుల విద్యార్హతలు, వృత్తిగత ఆచరణలు, ఆర్థిక హోదా మొదలైన వివరాలను కూడా వెల్లడిస్తుందని ఆయన అన్నారు. కుల గణన దానికదే సామాజిక న్యాయసాధనకు దోహదం చేయదు. అయితే అసమానతలను నిర్మూలించేందుకు అవసరమైన విధానాల రూపకల్పనకు, ఆ అమానుష వ్యవస్థను కూల్చివేసే రాజకీయాల ఆవిర్భావానికి అదొక తప్పనిసరి ముందడుగు అవుతుంది.



కుల గణన ఎలా నిర్వహించాలన్నదే అసలు ప్రశ్న. అది ఒక ప్రతీకాత్మక చర్యగా ఉండకూడదు. కులం కల్పించే ప్రత్యేక హక్కులను శాశ్వతం చేసేందుకు అది ఏ విధంగాను ఒక సాధనం కాకూడదు. కులగణనతో అందుబాటులోకి వచ్చే సమాచార స్వభావాన్ని, దాన్ని విశ్లేషించే పద్ధతులు విధానపరమైన నిర్ణయాలను అమలుపరిచే వ్యవస్థలు, మరీ ముఖ్యంగా కుల గణనకు పాలకులను పురిగొల్పిన రాజకీయ అజెండాకు సంబంధించిన పలు ప్రశ్నల వియంలో తెల్తుంబ్డే పుస్తకం మనలను జాగరూకులను చేస్తుంది.

ఇప్పుడు యువ పరిశోధకురాలు త్రిన విథయథిల్ తన ప్రథమ పుస్తకం ‘Counting Caste’లో వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఏమిటో చూద్దాం. జనాభా గణనలో కుల గణనపై ఆమె పుస్తకమొక సాధికార పరిశోధన. 1871లో బ్రిటిష్ వలస పాలకులు జనాభా గణనను ప్రారంభించిన నాటి నుంచీ స్వతంత్ర భారతదేశంలో కుల గణన నిర్వహించేందుకు జరిగిన విఫల ప్రయత్నాల దాకా ఆమె కుల గణన చరిత్రను విపులంగా వివరించారు. ఆమె తన పరిశోధనకు 2011 జనాభా లెక్కలను ఉపయోగించుకున్నారు. ఆ జనాభా గణన ఆధారంగా కుల నిర్దిష్ట సమాచారాన్ని సేకరించే ప్రయత్నాలను పాలకులు ఎలా అడ్డుకున్నారో ఆమె ప్రతిభావంతంగా విశ్లేషించారు. కుల గణనకు అనుకూలంగా పార్లమెంటులోని అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. అయితే దానిని సామాజిక, ఆర్థిక, కులగణన (ఎస్ఈసీసీ)గా పక్కదోవ పట్టించారు. అధికారులు ఉద్దేశపూర్వకంగా నమ్మదగని డేటా సృష్టించారని ఆమె విమర్శించారు. కుల గణన విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం సైతం యూపీఏ ప్రభుత్వం కంటే మెరుగ్గా వ్యవహరించలేదని ఆమె నిగ్గు తేల్చారు. అప్రధానంగా కన్పిస్తున్న విషయాల ఆధారంతో కఠోరమైన వాస్తవాలను వెల్లడించడం విథయథిల్ పరిశోధనా ప్రతిభకు తార్కాణం. ఈ దృష్ట్యా మనం మోదీ సర్కార్ ప్రతిపాదిత కుల గణన విషయంలో అప్రమత్తంగా ఉండితీరాలి. రెండు దశలుగా జరిగే 2027 జనాభా గణనలో కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వివరాలే కాకుండా ‘జనరల్’ కేటగిరీలోని కులాల లెక్కలు కూడా సేకరించాలి. కేవలం హిందువుల విషయంలోనే కాకుండా అన్ని మతాలవారికీ కుల గణనను వర్తింపచేయాలి. ఈ విషయమై 2011 నాటి ఎస్ఈసీసీ ఉపేక్ష వహించింది. దాని నియమావళి ముస్లింలు, క్రైస్తవులలో కులాలవారీ వివరాలు నమోదుచేయడాన్ని నిరుత్సాహపరిచింది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన సమూహాలను గుర్తించేందుకు రూపొందించిన ముందస్తుగా నిర్ణయించిన కుల జాబితాల విషయమై తొలుతనే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. ప్రతి ఒక్కరినీ తమ కులం పేరు చెప్పాలని అడగడమనేది గందరగోళానికి దారితీసే అవకాశమున్నది. కుల గణన అసలు లక్ష్యాన్ని పక్కదోవ పట్టించడానికి మాత్రమే అది ఉపయోగపడుతుంది. 2011 నాటి ఎస్ఈసీసీకి పట్టిన గతిని మనం విస్మరించకూడదు. కుల గణన ద్వారా సేకరించిన సమాచారాన్ని కులాలు, ఉపకులాల వారీగా అందరికీ అందుబాటులో ఉంచాలి.

కుల గణనపై చర్చ కులాల వివరాల సేకరణలో విస్తృతంగా వివిధ అంశాలను విధిగా అంతర్భాగం చేసుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. మనం capital C census (ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే దేశ జనాభా గణన) నుంచి small c census (ఒక నిర్దిష్ట సామాజిక సమూహంలోని ప్రతి ఒక్క సభ్యుడి వివరాలను సేకరించే క్రమబద్ధమైన సర్వే)కు వెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఇటువంటి నిర్దిష్ట సామాజిక సమూహాల గణనలు మనకు చాలా ఉన్నాయి. ఎకనామిక్ సెన్సస్, అగ్రికల్చరల్ సెన్సస్, లైవ్‌స్టాక్ సెన్సస్, ఆల్ ఇండియా సర్వే ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్, లిస్ట్ ఆఫ్ డైరెక్టర్స్ ఆఫ్ రిజిస్టర్డ్ కంపెనీస్ మొదలైనవి స్మాల్ సి సెన్సస్‌గా పరిగణితమవుతున్నాయి. వీటితో పాటు పెద్ద ఎత్తున నిర్వహించే కుటుంబ వినియోగ వ్యయాల సర్వే, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (ఉపాధి కల్పన పరిస్థితులు, నిరుద్యోగితను అంచనా వేయడానికి జాతీయ గణాంక కార్యాలయం నిర్వహించే సర్వేలలో కూడా విధిగా కులంపై ప్రశ్న (కులం వివరాల సేకరణ)ను చేర్చాలి. ఈ వివరాలకు అదనంగా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల సర్వే, పంచాయతీ వార్డు స్థాయి నుంచి పార్లమెంటు దాకా ప్రజలు ఎన్నుకునే ప్రతినిధుల సర్వే, రాజ్యాంగ పదవులు నిర్వహిస్తున్న వారి విషయమై జరిపే సర్వేల ఫలితాలను కూడా పైన పేర్కొన్న వివిధ సేకరణల వివరాలకు అదనంగా చేర్చాలి. కుల గణన అనేది ఇంత విస్తృత, సమ్మిళిత విధానంలో జరిగినప్పుడు మాత్రమే వర్తమాన భారతదేశంలో ఆస్తులు, అవకాశాలు ఏ విధంగా పంపిణీ అవుతున్నాయనే విషయమై ఒక కచ్చితమైన అవగాహనకు రావడం సుసాధ్యమవుతుంది. అటువంటి నిర్దుష్టమైన అవగాహన ఉన్నప్పుడే సామాజిక, ఆర్థిక అసమానతలను సమర్థంగా పరిష్కరించడం సులభమవుతుంది. సమకాలీన భారతదేశంలో సామాజిక అసమానతలను బహిర్గతం చేసి వాటికి ఆలంబనగా ఉన్న వ్యవస్థలను కూల్చివేసేందుకు పైన పేర్కొన్న విధంగా విస్తృత, సమ్మిళిత విధానంలో కుల గణన నిర్వహణ బృహత్తర ముందడుగు అవుతుంది.

(వ్యాసకర్త ‘స్వరాజ్ ఇండియా’ అధ్యక్షుడు)

మృత్యు రహదారులు

మంచి రహదారులు తయారయ్యాక వాహనాల వేగం పెరిగి, ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి చేరుకోవడానికి సమయం తక్కువ అయ్యింది. అయితే అదే వేగం కారణంగా ప్రమాదాలు ఎక్కువ అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రతి ఏటా సుమారు 13లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. కోట్లాది మంది గాయాలతో, వైకల్యాలతో బాధపడుతున్నారు.

మంచి రోడ్లు ఉన్నాయని చాలామంది నిర్లక్ష్యంగా నడుపుతున్నారు: హద్దుమీరి వేగం పెంచడం, ఫోన్ మాట్లాడుతూనో, మత్తులోనో, అలసటలోనో వాహనం నడపడం... ఇవన్నీ ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్‌లు మొదలైన వాటి విషయంలో సరైన అవగాహన లేకపోవటం కూడా పెద్ద సమస్యగా మారింది.

దేశం ఏదైనా ప్రమాదాలకు కారణాలు మాత్రం అవే: వేగం, నిర్లక్ష్య పూరితమైన డ్రైవింగ్, వాహన సంరక్షణ సరిగా చేయకపోవటం, ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకపోవడం... మొదలైనవి. ఇది గుర్తించిన అనేక దేశాలు పలు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రపంచంలో రోడ్డు భద్రతలో స్వీడన్ అగ్రగామి దేశం. 1997లో వారు ‘విజన్ జీరో’ అనే ప్రత్యేక విధానాన్ని ప్రారంభించారు. దీని ప్రధాన ఉద్దేశ్యం “రోడ్డు ప్రమాదంలో ఒక్క ప్రాణం కూడా కోల్పోవడం అంగీకారయోగ్యం కాదు”. ఈ విధానం ప్రకారం అక్కడి రహదారి వ్యవస్థను సురక్షితంగా రూపొందించారు. రోడ్డు నిర్మాణంలో రెండు దిశల మధ్య బారియర్లు ఏర్పాటు చేశారు. ప్రమాదకర కూడళ్ల వద్ద వృత్తాకార మార్గాలను ఏర్పాటు చేశారు. పాదచారుల కోసం ప్రత్యేక జోన్లు, ఫుట్‌పాత్‌లు సృష్టించారు. వాహన భద్రతా సాంకేతికతలో భాగంగా ఆటోమేటిక్ బ్రేక్ సిస్టమ్‌లు, సీట్ బెల్ట్ అలామ్‌లు, ఎయిర్ బ్యాగ్‌లు తప్పనిసరి చేశారు. వేగ నియంత్రణ కోసం ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో వేగ పరిమితి తగ్గించారు. కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేశారు. రోడ్డు భద్రతపై విద్యా కార్యక్రమాలు నిర్వహించి, డ్రైవింగ్‌లో క్రమశిక్షణ పెంచారు. జపాన్‌లోనూ చట్టాలను కఠినంగా అమలు చేస్తారు. వేగ నియంత్రణ కెమెరాలు, ఆటో బ్రేక్ వ్యవస్థలు, లేన్ డిసిప్లిన్ సిస్టమ్స్ అన్ని వాహనాల్లోను ఉంటాయి. మత్తులో డ్రైవింగ్ చేస్తే తీవ్ర శిక్షలు విధిస్తారు. డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి కఠినమైన శిక్షణ, పరీక్షలు తప్పనిసరి. పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు రోడ్డు భద్రతా పాఠాలు బోధిస్తారు. అందుకే అక్కడ ప్రమాదాలు చాలా తక్కువ. యూకేలో ‘థింక్ రోడ్ సేఫ్టీ’ అనే ప్రచారం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచారు. వేగ పరిమితులను కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సైన్‌బోర్డులు, లైటింగ్, పాదచారి మార్గాలను మెరుగుపరుస్తున్నారు.



ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో రోడ్లను పునర్ రూపకల్పన చేశారు. ఈ దేశాలు ప్రమాదాలపై డేటా సేకరించి విశ్లేషిస్తాయి. చర్యలు తీసుకుంటాయి.

భారతదేశంలో రహదారులూ ఎక్కువే, ప్రమాదాలు కూడా ఎక్కువే. దీనికి పరిష్కారంగా మోటార్ వెహికల్ అమెండ్‌మెంట్ ఆక్ట్ ద్వారా కఠిన చట్టాలు తీసుకొచ్చారు. పాఠశాలల్లో, కళాశాలల్లో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత వేగంగా వైద్య సహాయం అందించడం చాలా ముఖ్యం. యూరప్ దేశాల్లో ‘గోల్డెన్ అవర్’ సూత్రాన్ని కచ్చితంగా పాటిస్తారు. ప్రమాదం జరిగిన గంటలో చికిత్స అందిస్తారు. భారతదేశంలో ‘108 అంబులెన్స్ సర్వీస్’ ఈ దిశగా ఒక మంచి ఉదాహరణ. అమెరికా, యూకే వంటి దేశాల్లో బాధితులకు బీమా పరిహారం వెంటనే అందుతుంది. భారతదేశంలో కూడా ‘రోడ్ యాక్సిడెంట్ రిలీఫ్ ఫండ్’ వంటి పథకాలు ప్రారంభమయ్యాయి. జపాన్, ఆస్ట్రేలియా దేశాల్లో ప్రమాద బాధితుల కోసం ప్రత్యేక పునరావాస కేంద్రాలు ఉన్నాయి. మానసిక కౌన్సెలింగ్, వైద్య సేవల ద్వారా బాధితులు తిరిగి సాధారణ జీవితంలోకి వస్తున్నారు. యూకేలోని ‘బ్రేక్’, ఆస్ట్రేలియాలోని ‘అరైవ్, అలైవ్’ వంటి సంస్థలు ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహనను పెంచి, బాధితులకు సహాయం చేస్తున్నాయి.

రోడ్లు కేవలం వేగం కోసం గాక, భద్రత కోసం ఉండాలి. ప్రభుత్వం రహదారి నిర్మాణంతో పాటు– భద్రతా విధానాలు, కఠిన చట్టాలు, డ్రైవర్ ట్రైనింగ్, అత్యవసర సేవలను బలోపేతం చేయాలి. ప్రజలూ తమ బాధ్యతను గుర్తించి ట్రాఫిక్ నియమాలను గౌరవించాలి. మన ప్రాణం మాత్రమే కాదు, ఇతరుల ప్రాణం కూడా మన చేతిలోనే ఉందని గుర్తుపెట్టుకోవాలి.

భవిష్యత్తులో సాంకేతికత పెద్ద పాత్ర పోషించనున్నది. ఆటోమేటిక్ బ్రేక్‌లు, సెన్సార్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థలు ప్రమాదాలను తగ్గిస్తాయి. కానీ వీటితో పాటు సహనం, క్రమశిక్షణ, కరుణ వంటి మానవ విలువలు కూడా అవసరం. రోడ్డు భద్రత అంటే కేవలం చట్టం లేదా సాంకేతికత కాదు, అది ప్రతి మనిషి బాధ్యత. అభివృద్ధి అంటే ప్రాణాలు కోల్పోవడం కాదు, వాటిని కాపాడుతూ ముందుకు సాగడం. ప్రతి కొత్త రహదారి భద్రత, అవగాహన, బాధ్యత అనే విలువలతో నిర్మాణం కావాలి. ప్రపంచంలోని మంచి పద్ధతులను నేర్చుకొని మన దేశంలో అమలు చేస్తే, వేగం – అభివృద్ధి – భద్రత మధ్య సమతుల్యం సాధ్యమవుతుంది.

● పి. వేణుగోపాల్‌రెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు

గేమ్ ఛేంజర్!

‘ప్రత్యర్థి తనకన్నా బలవంతుడైనప్పటికీ ఆశ్చర్యానికి గురి చేసి తేరుకునే లోపే విజయాన్ని సాధించడం, వారి బలహీనతలను సొమ్ము చేసుకొని శాశ్వతంగా ఓడించడం’ – ఇది గెరిల్లా వ్యూహం. యుద్ధాల్లో వాడతారు. కార్పొరేట్ వార్‌లోనూ ఉంటుంది. కానీ పెట్టుబడుల ఆకర్షణ కోసం బలమైన రాష్ట్రాల మీద ఈ వ్యూహాన్ని మొదటిసారిగా చూస్తున్నాం. దాన్ని ఉపయోగించి నారా లోకేశ్ విజయాన్ని కూడా సాధించారు. దేశ చరిత్రలోనే అత్యధిక ఎఫ్‌డిఐగా గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకువచ్చారు. గూగుల్ రాకతో దేశమంతా ఒక్కసారిగా ఏపీ వైపు చూసింది. పెట్టుబడుల ఆకర్షణలో ప్రత్యర్థులు, పెద్ద రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ఆశ్చర్యానికి లోనయ్యాయి. లోకేశ్ అంతటితో ఆగకుండా ‘ఆంధ్రా ఫుడ్ మాత్రమే కాదు... పెట్టుబడులు కూడా మంట పుట్టిస్తున్నాయి’ అని ట్వీట్ చేసి పుండు మీద కారం చల్లారు. దీంతో జాతీయ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. పోటీ రాష్ట్రాలపై ఆంధ్రా పైచేయి సాధించిందని దేశమంతా భావించింది.



పారిశ్రామిక పాలసీలు, రాయితీలు అన్ని రాష్ట్రాలు ప్రకటిస్తాయి. కానీ వాటి ద్వారా పరిశ్రమలను ఆకర్షించి గ్రౌండ్ చేయించడంలోనే అసలైన విజయం ఉంది. విజనరీ లీడర్ చంద్రబాబు ‘ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ను ప్రవేశపెట్టి ఉమ్మడి రాష్ట్రంలో, విభజిత ఆంధ్రలో అనేక రకాల పెట్టుబడులు సాధించారు. ఆయన వారసుడిగా నారా లోకేశ్ ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ చేస్తున్నారు. 14 నెలల్లో ఆర్సెల్ మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీని అనకాపల్లికి తీసుకొచ్చారు. 13 నెలల్లో గూగుల్ డేటా సెంటర్‌ను తీసుకువచ్చారు. కేవలం 46 రోజుల్లో ప్రీమియం ఎనర్జీస్ సంస్థకు భూములతో సహా అన్ని అనుమతులు ఇచ్చారు. మీరు వేగంగా బిజినెస్ చేయాలనుకుంటే మా రాష్ట్రానికి రమ్మంటూ లోకేశ్ ఆహ్వానిస్తున్నారు.

నాలుగేళ్లు ఇంజనీరింగ్ చదివిన తర్వాత ఇంజనీర్ కాలేకపోతే ఎలా అని లోకేశ్ ప్రశ్నిస్తున్నారు. విద్యాశాఖా మంత్రిగా కరిక్యులమ్‌లో పూర్తి స్థాయి ప్రక్షాళనకు ఆదేశాలిచ్చారు. ప్రపంచ మేటి వర్శిటీల భాగస్వామ్యంతో అక్వా, క్వాంటమ్, సోలార్, స్పోర్ట్స్ ఇలా అనేక రంగాల వారీగా బ్యాచిలర్ డిగ్రీ నుండి పీహెచ్‌డీ వరకు కోర్సులు అందించేలా వర్సిటీలను తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఇరవై లక్షల మందికి ఖచ్చితంగా ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతున్నారు. గత 16 నెలల్లో రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించారు. వీటి ద్వారా దాదాపు 8 లక్షలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయి. ఇప్పటికే లక్షా 80 వేల ఉద్యోగాలు కల్పించారు. ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో 9.8 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులపై ఒప్పందాలు జరుగుతాయి. దీని ద్వారా 7 లక్షలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయి.

పాలకుడిగానే గాక పార్టీ నాయకుడిగా కూడా లోకేశ్ ప్రత్యర్థి జగన్‌రెడ్డిని ఇరుకున పెడుతున్నారు. మీకు తెలిసిన కంపెనీలతో పెట్టుబడులు పెట్టించండి మీకే క్రెడిట్ ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చారు. పక్క రాష్ట్రాల నేతలు జాతీయ స్థాయిలో ఆ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్కటై పోరాడుతుంటే వైసీపీ మాత్రం ఢిల్లీలో రాష్ట్రం పరువు తీస్తుందంటూ దుయ్యబడుతున్నారు. ఏ ఇతర పార్టీ నేతలు కూడా చేయనంతగా లోకేశ్ టీడీపీ కేడర్‌కు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

○ అనగాని సత్యప్రసాద్
రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖామంత్రి

ఏడాదిలోనే తిరుమలకు పూర్వవైభవం!

అశేష భక్తజనానికి తిరుమల ఎంతో పవిత్రం. ఆ పవిత్రతను ఉద్దేశపూర్వకంగానే పాడు చేశారు గత పాలకులు. వారి అయిదేళ్ల పాలనో కోనేటి రాయడి దివ్యసన్నిధిని పక్కా వ్యాపార కేంద్రంగా, స్వార్థ రాజకీయాలకు కూడలిగా మార్చారు. కోట్లాది భక్తుల కొంగు బంగారమైన శ్రీనివాసుడి దివ్య సన్నిధిలో ఎన్నో ఘోరాలు జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్యాత్మిక కేంద్రంగా కాకుండా వ్యాపార కేంద్రంగా తయారు అయిందని వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది పీఠాధిపతులు ఆరోపించారు. వ్యాపార, ఆర్థిక, రాజకీయ, కేసుల అవసరాలను తీర్చుకునేందుకు తిరుమల తిరుపతిని వాడుకుని ఎన్నో మహాపాతకాలకు పాల్పడ్డారు గత పాలకులు. డెయిరీల నుంచి నెయ్యి సేకరణను ఆపివేసి ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన లడ్డూ పవిత్రతను మసకబార్చారు. స్వామి పట్ల తరగని భక్తి ప్రపత్తులతో భక్తులు సమర్పించిన కానుకల సొమ్మును భోంచేశారు.

తిరుమల తిరుపతికి మళ్ళీ పూర్వవైభవం కల్పించేలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏర్పడిన టీటీడీ పాలక మండలి ఏడాదిలోనే అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నది. టీటీడీలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అన్యమతస్తులను గుర్తించి తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నాం. ఏఐ టెక్నాలజీ ద్వారా 23 గంటల్లోపు సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం అయ్యేలా చర్యలు ఏర్పాటయ్యాయి. తిరుమల కొండపై రాజకీయాలు మాట్లాడినా, ప్రసారం చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయం జరిగింది. నిత్యాన్నదాన ప్రసాదం నాణ్యత పెంచి, మెనూలో కొత్తగా వడ పెట్టాలని నిశ్చయించాం. తిరుపతి స్థానికులకు నెలలో ఒకసారి శ్రీవారి దర్శనం కల్పించేలా నిర్ణయం తీసుకున్నాం. వివిధ రాష్ట్రాల టూరిజం శాఖలకు కేటాయించిన టికెట్లలో భారీ అవినీతి జరిగి అందుకు ఆధారాలు ఉన్నందున వారికి ఇచ్చే టికెట్స్ రద్దు చేశాం. తిరుమలలో వివిధ వ్యక్తులు, వ్యవస్థల పేర్లు తొలగించి స్వామి వారి పేరు వచ్చేలా వివిధ కాటేజీలు, గెస్ట్ హౌస్‌లకు బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. స్విమ్స్ హాస్పిటల్ అభివృద్ధికి రూ.71కోట్లు కేటాయించాం. తిరుపతిలో శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ ప్రాజెక్టుకు తిరిగి గరుడ వారధిగా పేరు మార్చాం.

సీఎం ఆదేశం మేరకు టూరిజం శాఖకు సంబంధించిన దేవలోక్, ముంతాజ్ హోటల్స్, ఎమ్ఆర్‌కెఆర్ ప్రాపర్టీస్ & టూరిజం హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీకి కేటాయించిన 50 ఎకరాల భూమిని టీటీడీకి బదలాయించడం జరిగింది. తిరుమల కొండపైన భక్తులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి తేవడానికి బ్రాండెడ్ హోటల్స్, క్యాంటీన్




మినిమం లీజ్‌కి ఇవ్వాలని నిర్ణయం జరిగింది. పోటు కార్మికులకు జీఎస్టీ కట్ లేకుండా వారి వేతనం పెంచాలని; స్విమ్స్‌లో హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని; 650 మంది కాంట్రాక్ట్ లెక్చరర్, డ్రైవర్ పోస్టుల రెగ్యులరైజేషన్ చేయాలని నిర్ణయించాం. రెవెన్యూ శాఖ, విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి తిరుమలలో లైసెన్స్ లేని షాపులను, హ్యాకర్లను తొలగించాం. టీటీడీ గుడిలో పని చేసే ఉద్యోగులకు నేమ్ బ్యాగ్లెస్ ఏర్పాటు, బ్రేక్ దర్శనం టైమింగ్స్‌లో మార్పు తెచ్చాం.

శ్రీవారి ట్రస్ట్ ద్వారా 5000 టెంపుల్స్ నిర్మాణానికి, వెనుకబడిన ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి నిధులను 10 లక్షల నుండి 20 లక్షలకి పెంచాం. టీటీడీకి 100 ఎలక్ట్రిక్ బస్సులను అందించాలని కేంద్ర మంత్రి కుమారస్వామిగారిని కోరగా వారు సానుకూలంగా స్పందించారు. దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ ఆలయంలో నిత్యాన్న ప్రసాదం, లడ్డు క్వాలిటీ పెంచాం. ఏఎస్ఐ సహాయంతో అలిపిరి పాదాల మండపాన్ని పునర్నిర్మించనున్నాం. ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశాం.

తిరుమల కొండపైన వృక్ష సంపద పెంపు, రూ.25కోట్లతో కాణిపాకం అభివృద్ధి పనులు, తలకోనలో రూ.19కోట్లతో టెంపుల్ అభివృద్ధి జరిగాయి. గతం కన్నా బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదగా PAC 5 ప్రారంభించి అదనంగా ఐదు వేల మంది భక్తులకి వసతి సౌకర్యం కల్పించాం. అలిపిరి – శ్రీవారి మెట్టు నడక మార్గంలో భక్తులకు భద్రత, మౌలిక సదుపాయాలు కల్పించాం. శ్రీవారి భక్తులు సైబర్ మోసాలకి గురికాకుండా సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటు చేశాం. పదకవితా పితామహుడు అన్నమయ్య జన్మించిన తాళ్ళపాకలో ప్రణాళిక ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించాం. సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 320 ఆలయాలలో మైక్ సెట్స్ ఉచితంగా పంపిణీ చేశాం. తిరుమలలోను ఒంటిమిట్టలోను ఔషధ వనం, పవిత్ర వనం ఏర్పాటుకు ఆమోదం పొందాం. ఈ విధంగా తిరుమల తిరుపతిని సంపూర్ణంగా సంస్కరించడానికి, పవిత్రతను కాపాడటానికి, భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే టీటీడీ పాలక మండలి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నది.

■ నన్నూరి నర్సిరెడ్డి
టీటీడీ బోర్డు సభ్యులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com



పేకాట పోలీసులపై సస్పెన్షన్
● పట్టుబడిన వెంటనే ప్రాథమిక విచారణ.. బదిలీ
● సమగ్ర విచారణ అనంతరం ముగ్గురిపై సస్పెన్షన్ వేటు
● సత్తెనపల్లి కానిస్టేబుల్‌పై పల్నాడు ఎస్పీకి నివేదిక
● గాడి తప్పితే సహించేది లేదంటూ హెచ్చరిక
8

ఆ నలుగురికే.. పని

● సచివాలయాల్లో వారిపైనే భారం
● మిగిలిన ఉద్యోగులకు నామమాత్రం
● అస్తవ్యస్తంగా సచివాలయాల నిర్వహణ
● మా ఇష్టం.. ఎప్పుడైనా వస్తామన్నట్లుగా తీరు
● హేతుబద్ధీకరణ ప్రహసనం.. విధుల్లో గందరగోళం



మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో శ్యామలానగర్ సచివాలయంలో పరిస్థితి

ఆంధ్రజ్యోతి పరిశీలన

గుంటూరు,పెదనందిపాడు, తాడికొండ, పొన్నూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థ ప్రక్షాళన ప్రక్రియ అంతకంతకూ జఠిలంగా మారుతోంది. ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియలో భాగం గా ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణ ప్రక్రియ కొంద రికి వరంగానూ, మరికొందరికి శాపంగానూ మారింది. ఆ నలుగురిపైనే పనిభారం అన్నట్లు ప్రక్రియ సాగింది. అదనపు సిబ్బందిగా ఉన్నారని గుర్తించిన మిగిలిన ఉద్యోగులకు నిర్దిష్టమైన విధులు లేకపోవడంతో వారు ఖాళీగా ఉండాల్సి వస్తోంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో గ్రామ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, శానిటరీ సూపర్‌వైజర్ బాధ్యతలు నిర్వహించేవారికే పని ఉంటోంది. వార్డు సచివాలయాల్లో అడ్మిన్ సెక్రటరి, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెస్ అసిస్టెంట్, వార్డు ఎమినిటీస్ సెక్రటరి, శానిటరీ అసిస్టెంట్లకే నిర్దిష్టమైన విధులు ఉన్నాయి. మిగిలినవారి విధుల విషయంలో ఒకింత గందరగోళం నెలకొని ఉంది. పంచాయతీ కార్యదర్శులు, వార్డు అడ్మిన్ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాత్రం బిజీ అయిపోయారు. రేషనలైజేషన్ పేరుతో వీరిలో కొందరిని మాతృశాఖ సహా పలు ఇతర శాఖలకు పంపించారు. ఆ కారణంగా ఆయా సచివాలయాల విధులు కూడా వీరిపై పడుతున్నాయి. సచివాలయాల్లో స్థానిక సంస్థలైన పంచాయతీ, మున్సి పాలిటీల అనుబంధ విధుల్లో ఉండే వారికి మాత్రమే పనులు ఉంటున్నాయి. జిల్లాలోని 568 గ్రామ, వార్డు సచివాల యాల్లో 40 శాతం మందికి మాత్ర మే పని ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన అధ్యయనంలో అదే వెల్ల డైంది. జిల్లాలో 4,979 మంది గ్రామ, వార్డు సచి వాలయ ఉద్యోగులు ఉండగా, వారిలో 2 వేల మందికి మాత్రమే చేతినిండా పని ఉన్నట్లు తేలింది. మిగిలిన వారందరికీ ప్రత్యేక సందర్భాల్లో మినహా మిగిలిన సందర్భాల్లో పని ఉండడం లేదు. రేషనలైజేషన్ పేరుతో వీరిలో (మిగతా 6వ పేజీలో)




తాడికొండ -3 సచివాలయంలో ఉదయం 11.47 గంటలు అయినా ఉద్యోగుల రాని పరిస్థితి

అక్రమ అంతస్తుల.. క్రమబద్ధీకరణ

బీపీఎస్ పునరుద్ధరణ

● ఆగస్టు 31 ముందు నిర్మించిన భవనాలకు వర్తింపు
● ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం
● బిల్డర్లకు ఊరట.. పురాలకు కాసుల వర్షం

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. బిల్డింగ్ పెనలైజేషన్ స్కీం (బీపీఎస్)ను పునరుద్ధరిస్తూ జీవో ఎంఎస్ నం బరు 225ను బుధవారం జారీ చేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన బీపీఎస్‌ను వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో నిలిపి వేసింది. ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గతంలో లేఅవుట్లు(ఎల్ఆర్ఎస్), ఇప్పుడు భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. లైసెన్స్ ఇంజనీర్లు, బిల్డర్స్, నగర ప్రజలు తమ అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ కు మార్గం సుగమమైంది. బీపీఎస్ మునిసిపాలిటీలకు కాసుల వర్షం కురిపించ నుంది. రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరనుంది.



ప్లాన్‌లు అతిక్రమించి నిర్మిస్తున్న భవనాలు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీకి ముందు నిర్మాణం పూర్తయిన.. 1985 జనవరి ఒకటో తేదీ నుంచి నిర్మించిన భవనాలకు మాత్రమే బీపీఎస్ వర్తిస్తుంది. అంతకు ముందు నిర్మించిన భవనాలకు ఈ పథకం వర్తించదు. 1997కు ముందు నిర్మించిన భవనా లకు జరిమానా 25 శాతం తగ్గిస్తారు. భవనా లకు సంబంధించిన అన్ని రకాల డాక్యుమెం టేషన్, ఫొటోలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. గుంటూరు నగరపాలక సంస్థలో సుమారుగా పది వేలకు పైగా భవనాలు బీపీఎస్ కింద దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. తద్వారా గుంటూరు నగరంలో రూ.60కోట్ల నుంచి రూ.70 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు వెల్లడించారు.

120 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసి పాలిటీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వేలాది భవనాలను క్రమబద్ధీకరించనున్నారు. అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు నోటిఫికేషన్ వెలుబడిన తేదీ నుంచి 120 రోజుల్లోగా తమ దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 'బీపీఎస్. జీవోవీ. ఇన్' వెబ్‌సైట్‌ను ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చింది. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, సీఆర్డీఏ పరిధిలోని భవనాలకు మాత్రమే బీపీఎస్ (మిగతా 8వ పేజీలో)

మురికి వాడలకు 50 శాతం రాయితీ

మురికి వాడల్లో నిబంధనలు అతిక్రమించిన నిర్మించిన భవనాలకు బీపీఎస్ అపరాధ రుసుం 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయా ప్రాంతాల వారీగా ఉన్న మార్కెట్ విలువల ఆధారంగా అపరాధ రుసుం విధించబడుతుంది. భవనంలో ఎక్కడి వరకు అయితే.. అక్రమ నిర్మాణమో.. దాని వరకు మాత్రమే పెనాల్టీలు విధిస్తారు. మిగతా ప్రాంతాల్లో యథావిధిగానే ఫీజులు కొనసాగుతాయి.

హాస్టల్‌లో.. ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్లు

● ఓ విద్యార్థిని బ్యాగులో మంగళసూత్రం, మెట్టెలు
● విషయం బయటికి పొక్కకుండా అంతర్గత విచారణతో సరి
● నివ్వెరపోయిన అధికారులు.. ఆందోళనలో తల్లిదండ్రులు

గుంటూరు(విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరం నడిమధ్య.. ఉన్నతాధికారుల నివాసాల సమీపంలో.. సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థినుల వసతిగృహాల్లో తరచుగా వివాదాస్పద సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఓ వసతిగృహంలో తాజాగా ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్లు వెలుగుచూడటం కలకలం రేకెత్తిస్తోన్నది. నెల క్రితం ఇదే హాస్టల్లో ఓ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన మరువకముందే తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన విద్యార్థులను, అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నది. సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన హాస్టల్‌లో వాష్‌రూమ్, మరుగుదొడ్ల శుభ్రం చేయడానికి ఇటీవల బయట నుంచి పారిశుధ్య సిబ్బందిని పిలిపించారు. వారు శుభ్రం చేస్తున్న సమయంలో కొన్ని చోట్ల ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్లు బయటపడ్డాయి. వెంటనే ఈ విషయం అప్పుడు విధుల్లో ఉన్న హెచ్‌డబ్ల్యూ దృష్టికి పారిశుధ్య సిబ్బంది తీసుకువెళ్లారు. దీంతో హాస్టల్ సిబ్బంది విద్యార్థుల బ్యాగులను తనిఖీ చేశారు. ఓ విద్యార్థిని బ్యాగులో మంగళసూత్రం, కాళ్ల మెట్టెలు బయటపడ్డాయి. వెంటనే విషయాన్ని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే ఈ విషయం బయటికి పొక్కకుండా అంతర్గతంగా విచారణతో సరిపెట్టారు. విద్యార్థినుల భద్రత, ఇతర విషయాలను పరివేక్షించడానికి ఇద్దరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఉన్నా తరచూ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడంపై తల్లిదండ్రులు ఆందోళనకు గురౌతున్నారు. గతంలో ఇదే హాస్టల్‌లో ఒక ఇంజనీరింగ్ విద్యార్థిని గర్భం దాల్చగా అప్పట్లో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిని పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినట్లు తాజా సంఘటనలతో తెలుస్తుంది. దీంతో విద్యార్థినుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

హాస్టల్స్‌ని సందర్శిస్తాం: కలెక్టర్

విద్యార్థినుల హాస్టల్‌లో కొన్ని రోజులుగా జరుగుతున్న సంఘటనలను బుధవారం రాత్రి 'ఆంధ్రజ్యోతి' కలెక్టర్ తమీమ్ అన్సారియా దృష్టికి తీసుకువెళ్ళింది. దీంతో స్పందించిన కలెక్టర్ హాస్టళ్లను సందర్శించి, గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



8

స్ఫూర్తినిస్తున్న వెంగళాయపాలెం చెరువు
పునరుద్ధరణ

● రూ. 1.20 కోట్లతో 15 రోజుల్లో అద్భుత నిర్మాణం ● సుస్థిరమైన విధానాలతో చెరువు నిర్వహణ



కొండవీటి వాగుపై ఎత్తిపోతల

ఉండవల్లిలో.. పంపింగ్ స్టేషన్-2

● ఒకేసారి 15 వేల క్యూసెక్కుల మళ్లింపు
● కొండవీటి వాగు ముంపు సమస్య పరిష్కారం
● రూ.595.01 కోట్లతో 8400 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మాణం

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొండవీటి వాగు ద్వారా వచ్చే వరద నీటిని ప్రకాశం బ్యారేజ్‌లోకి పంపింగ్ చేసేందుకు ఇప్పటికే నిర్మించిన పంపుహౌస్‌కి అదనంగా మరో పంపింగ్ స్టేషన్‌ని నిర్మించేందుకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సిద్ధమైంది. ఇందుకు అవసరమైన నిధులను ఏపీసీఆర్డీఏ సమకూర్చేందుకు అంగీకారం తెలిపింది. ఉండవల్లి వద్ద ఈ పంపింగ్ స్టేషన్-2ని నిర్మిస్తారు. ఇందుకోసం రూ.595.01 కోట్లను ఖర్చు చేయనున్నారు. అలానే 15 ఏళ్ల పాటు సంబంధిత ఏజెన్సీ ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్‌ని చూసుకోవాల్సి ఉంటుంది. ఈ పంపింగ్ కేంద్రం నిర్మాణం పూర్తి అయితే కొండవీటి వాగు ద్వారా ఒకేసారి 15 వేల క్యూసెక్కులకు పైగా వరద వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ నీటిని బ్యారేజ్‌లోకి పంపింగ్ చేసి అక్కడి నుంచి సముద్రంలోకి విడిచి పెడతారు. ఏటా వర్షాకాలంలో కొండవీటి వాగు అమరావతి రాజధానిలోని కొన్ని ప్రాంతాలను ముంపునకు గురి చేస్తోన్నది. ఉండవల్లి, పెనుమాక, వెంకటపాలెం, నీరుకొండ తదితర ప్రాంతాలు ముంపుని ఎదుర్కోవాల్సి వస్తోన్నది. ఈ సమస్యకి పరిష్కారంగా 2014-19 మధ్యనే ఉండవల్లిలో ఒక పంపింగ్ కేంద్రాన్ని నిర్మించారు. అయితే ఇటీవల కాలంలో కొండవీటి వాగుకు వరద ప్రవాహం పెరగడం, రాబోయే కొన్నేళ్లకు ఎంత పెరగొచ్చనే అంచనా వేసి కొత్త పంపింగ్ కేంద్రాన్ని నిర్మించేందుకు ఏడీసీఎల్ నిర్ణయించింది. ఏపీసీఆర్డీఏకి ప్రపంచ బ్యాంకు నుంచి నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుండటంతో వాటిని ఏడీసీఎల్‌కి విడుదల చేయనున్నది.

నేడు ఆచార్య రత్నశీలామణికి సన్మానం

ఏఎన్‌యూ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షురాలు ఆచార్య రత్నశీలామణి సన్మాన కార్యక్రమం గురువారం ఏఎన్‌యూలో జరగనుంది. వర్సిటీ ఏఎన్‌యూ ఉద్యోగులు, పరిశోధకులు సంయుక్తంగా ఆమెను సత్కరించనున్నారు. వర్సిటీ ఆడిటోరియంలో జరగనున్న ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం హాజరుకానున్నారు.

43,348 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 45,295 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,348 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,691 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర	వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	17500	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14300	334	10500	17000
273	10500	14200	నెంబరు. 5	10000	14600
341	10000	17000	273	----	----
4884	----	----	341	10000	17200
సూపర్ 10	----	----	4884	11000	14700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16000	తేజ	10000	15500
షార్క్-1	----	----	బ్యాడిగి	10000	17500
బ్యాడిగి	10500	17000	దేవనూరు డీలక్స్	10500	16300
దేవనూరు డీలక్స్	10500	16400	తాలుకాయలు	5000	8800

తేమ శాతం సడలింపునకు సీసీఐని కోరుతాం

● మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత

సత్తెనపల్లి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 30 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 62 జిన్నింగ్ మిల్లులను గుర్తించి వీటి ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు. పట్టణంలోని అమరావతి మేజరు కాలువ పక్కన గల లక్ష్మీ కాటన్ ట్రేడ్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2025 - 26 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగులో ఉందన్నారు. ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి అంచనా వేశామని తెలిపారు. డిసెంబరు నాటికి రాష్ట్రంలోని అన్ని చోట్ల పత్తి కొనుగోళ్లు వేగంగా జరుగుతాయన్నారు. ప్రభుత్వం క్వింటాల్ పత్తి మద్దతు ధర రూ.8,110 ప్రకటించిందని, తేమ శాతం ఎనిమిది ఉంటే మద్దతు ధర లభిస్తుందన్నారు. ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉంటే మద్దతు ధర తగ్గుతుందన్నారు. బ్యాగుల్లో పత్తిని తేవద్దని రైతులకు సూచించారు. మొంథా తుఫాన్ వల్ల పత్తిలో తేమ శాతం పెరిగే అవకాశం ఉందని సంబంధిత శాఖ మంత్రికి తెలియజేశామన్నారు. మంత్రి ద్వారా సీఎంకు, సీఎం నుంచి సీసీఐ అధికారులకు విషయాన్ని వివరించి సడలింపులు ఇవ్వాలని కోరతామన్నారు. పత్తి కొన్న వారంలోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని విజయ సునీత తెలిపారు. ముందుగా ఆమె కొనుగోలు కేంద్రంలోని పత్తిలో తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం మండలంలోని నందిగామ వద్ద పత్తి పంటను పరిశీలించారు. ఆర్ఎస్‌కే కపాస్ కిసాన్ యాప్, సీఎం యాప్‌లలో రైతుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. జేడీ కె.శ్రీనివాసరావు, డీడీ దివాకర్, సత్తెనపల్లి ఏఎంసీ కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి, ఏవో బి.సుబ్బారెడ్డి, ఏఈవో వై ఏసోబు తదితరులు ఉన్నారు.


పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ ఎం.విజయ సునీత

ఓబీసీ గణన చేపట్టాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

● సీఎస్‌కు ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతల విజ్ఞప్తి

గుంటూరు, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓబీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతి కుమార్‌లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు విజ్ఞప్తి చేశారు. సచివాలయం లో బుధవారం సీఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఓబీసీ కుల గణన నిర్వహించాలని హైకోర్టులో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం పిల్ దాఖలు చేయడం జరిగిందని తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నాలుగు వారాల గడువు అడిగిందని చెప్పారు. ప్రభుత్వం పారదర్శకంగా కమిషన్ వేసి ఓబీసీ జనగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని విన్నవించారు. విద్య, ఉపాధి, రాజకీయాల్లో వెనుకబడిన తరగతులకు దామాషా రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరారు. దీనిపై సీఎస్ సానుకూలంగా స్పందించినట్లు కేసన పేర్కొన్నారు.


సీఎస్‌కు వినతి పత్రం అందజేస్తున్న కేసన, క్రాంతికుమార్

ఆ నలుగురికే పని

(5వ పేజీ తరువాయి)

కొందరిని మాతృశాఖ సహా పలు ఇతర శాఖలకు పంపించారు. ఈ కారణంగా ఆయా సచివాలయాల విధులు కూడా వీరిపై పడుతున్నాయి. ఉదాహరణకు వార్డు సచివాలయ విధుల్లో ఉండే 2వేల మందిలో 300 మందిని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, ఏపీసీఆర్‌డీఏ, టాటా ఇన్నోవేషన్ హబ్ వంటి పలుచోట్ల వినియోగించుకుంటున్నట్లు తెలుస్తోంది. రేషనలైజేషన్ ప్రక్రియలో పరిధిని 2వేల కుటుంబాల నుంచి 5వేల కుటుంబాలకు పెంచారు. ఆ కారణంగా వారిలో 60 శాతం మంది ఖాళీగా ఉండాల్సి వస్తుంది. సచివాలయ సిబ్బందిలో కొంతమందికి ప్రభుత్వం సచివాలయాల విధులతోపాటు, మాతృశాఖల విధులను కూడా కేటాయించింది. ఇలా రెండు చోట్ల పనిచేయాల్సి వచ్చినవారు ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇలా రెండు చోట్ల విధుల్లో ఉండే ఉద్యోగుల్లో పలువురు అక్కడ ఉన్నామని చెప్పి ఇక్కడ, ఇక్కడ ఉన్నామని చెప్పి అక్కడ విధులకు గైర్హాజరవుతున్నారు.

సమస్యల వలయం..

జిల్లాలో సచివాలయ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు ఆంధ్రజ్యోతి పరిశీలనలో తేలింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడంలేదని అందరికీ తెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. సిబ్బంది అందుబాటులో ఉండక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది ఎవరిష్టం వచ్చినట్లు వారు వస్తున్నారు. పోతున్నారు. తాడికొండ-3 సచివాలయంలో సోమవారం ఉదయం 11.47 గంటలకు కేవలం ఇద్దరు ఉద్యోగులు మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన ఉద్యోగులు వివిధ సర్వేలు చేస్తున్నారని తెలిపారు. పెదనందిపాడు, మండలంలోని సచివాలయాల్లో సిబ్బంది సర్వేల పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎప్పుడు సచివాలయానికి వెళ్లినా సిబ్బంది అందుబాటులో ఉండటంలేదని పలువురు చెప్పారు. పలుచోట్ల ఉదయం 11 గంటలకు కూడా సచివాలయాల తాళాలు తీయని పరిస్థితి. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సమస్యలపై అర్జీలు పెట్టుకునేందుకు సచివాలయాలకు వస్తే సంబంధిత శాఖల సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పలువురు నిరాశతో వెనుతిరిగారు.

న్యూమోనియా మరణాలు నియంత్రించాలి

● జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలోపు పిల్లల్లో సంభవించే న్యూమోనియా మరణాలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శాన్స్ పథకం సత్ఫలితాలు సాధించేందుకు వైద్య సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి కోరారు. వరల్డ్ న్యూమోనియా డే పురస్కరించుకొని బుధవారం ఆసుపత్రి శిశు వైద్య విభాగంలోని డాక్టర్ బ్రహ్మానందం మెమోరియల్ సెమినార్ హాల్‌లో జరిగిన "సోషల్ ఎవేర్‌నెస్ అండ్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యూమోనియా సక్సెస్‌ఫుల్లీ" (శాన్స్) అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో నవంబరు 12 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు శాన్స్ కార్యక్రమం జరుగతుందన్నారు. జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, డాక్టర్ బి.దేవాకుమార్, డాక్టర్ అరుణ కుమారి, ఉషారాణి, డాక్టర్ పొదిలి ప్రసాద్, రాజా కరణం, ఎలిజబెత్, సునీత, రమేష్, వీరేశ్వరరావు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యితో జగన్, అనుయాయుల దోపిడీ: పిల్లి మాణిక్యరావు

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ తయారీలో నెయ్యి కల్తీ చేసి జగన్, అతడి అనుయాయులు వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తిరుపతి లడ్డూ విషయంలోనూ వైసీపీ అవినీతికి పాల్పడిందని చెప్పారు. తిరుపతి లడ్డూ విషయంలో చాలా మంది అరెస్ట్ అయ్యారని, ఆనాడు ఈవోగా పనిచేసిన ధర్మారెడ్డి 'కల్తీ జరిగింది నిజమే, పైవాళ్ళు చెప్తేనే చేశామ'ని ఒప్పుకున్నాడని అన్నారు. దొరికిపోయామని తెలిసిపోయాక జగన్ ఆవుల మీదకు నెపం నెట్టేశాడని, ఆవు మంచి గడ్డి తినకపోతే పాలు కల్తీ జరుగుతాయని చెప్తున్నాడని అన్నారు. అలాంటి వ్యాఖ్యలు కేవలం గడ్డి తినేవాళ్లే చేస్తారని మాణిక్యరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టాబత్తిన శ్రీనివాసరావు (చిట్టిబాబు), కంచర్ల శివరామయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిల్లి మాణిక్యరావు, చిట్టిబాబు

పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర, పక్కన డేగల ప్రభాకర్

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు పార్టీలో సమచిత స్థానం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పునరుద్ఘాటించారు. గుంటూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన పొన్నూరు నియోజకవర్గంలోని మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఎన్నికల పరిశీలకుడు కసుకుర్తి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఎగురవేసి అనంతరం కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి బలమని.. వారే నిజమైన సైనికులన్నారు. అందరూ క్రమ శిక్షణతో పని చేస్తూ.. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు చాలా కష్టపడినట్లు తెలిపారు. అలుపెరగని పోరాటాలు చేసామని గుర్తుచేశారు. ప్రజల పక్షాన పోరాడినందుకే గత వైసీపీ ప్రభుత్వం కేసులు పెట్టిందని, అయినా వాటి గురించి పట్టించుకోకుండా ప్రజా సమస్యలపై పోరాటాలు చేశామన్నారు. కార్యకర్తలు నిత్యం ఇదే జోరు కొనసాగిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తగా నిర్మించే మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేస్తున్నారని వైసీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. అసలు దేవుడి దగ్గరే దోపిడీ చేసిన నాయకులు ఎవరైనా ఉన్నారంటే అది వైసీపీ నాయకులేనని ఎద్దేవా చేశారు. పదవులు పొందిన ప్రతీ ఒక్కరూ ప్రతీ కార్యకర్తకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని దిశా నిర్దేశం చేశారు. మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

అమానుషం..

వినుకొండటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తనను చూసి ఉమ్మేశాడంటూ.. ఓ యువకుడిపై కొందరు యువకులు అమానుషంగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 10న వెల్లటూరు రోడ్డు సమీపంలో ఓబయ్య కాలనీలో నివాసం ఉంటున్న రాంబాబు ఇంటి బయట ఉమ్మేయగా.. రోడ్డుపై వెళ్తున్న మరియబాబు నన్ను చూసి ఉమ్ముతావా అంటూ ఘర్షణకు దిగాడు. తన బంధువులతో కలిసి రాంబాబును ఇష్టం వచ్చినట్లు కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గుంటూరు జీజీహెచ్‌లో అతను చికిత్స పొందు తున్నాడు. పట్టణ సీఐ ప్రభాకర్ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
(పూర్వపు) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్)
రిజిస్టర్డ్ కార్యాలయం : డి.నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' గా పిలువబడేది, గౌరవ ఎన్‌సిఎల్‌టి, చెన్నై, తేది : 9-11-2022, సి.పి. నెం. 69-76 ఆఫ్ 2022 నాటి ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పోరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద తన **జోనల్ ఆఫీస్ చిరునామా :** శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, జోనల్ ఆఫీస్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034. **మరియు బ్రాంచి ఆఫీస్ నరసరావుపేట** వద్ద నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. (ఇక నుండి మమ్మల్ని కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు) ఇందుమూలంగా ఈ క్రింది నోటీసు జారీచేస్తున్నాము.
ఋణగ్రహీతలు / సహ ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసీ చట్టం 2002 లోని సెక్షన్ 13 (2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.
చివరిగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ ఋణగ్రహీతలు మరియు /లేదా వారి హామీదారుల (వర్తించినచోట) కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేది నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును.
సదరు చట్టంలోని సెక్షన్ 13 (13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు, వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీత బదిలీ చేయరాదని గమనించగలరు.
ప్రదేశం : గుంటూరు — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



లబ్ధిదారులకు గృహ రుణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, చిట్టిబాబు

పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా సొంతిల్లు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారానికి పునాదులు వేశామని, ఇది కేవలం శంకుస్థాపనలు మాత్రమే కాదని, పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే మహత్కార్యమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా బుధవారం ఆయన శారదాకాలనీ, పాత గుంటూరులోని పలు గృహ నిర్మాణా లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా కేవలం 17 నెలల కాలంలో 3 లక్షలకు పైగా గృహ నిర్మాణాలకు చేపట్టడం చరిత్రాత్మకమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు చిట్టబత్తిన చిట్టిబాబు, గోళ్ల ప్రభాకర్, మహంకాళి నరసింహ రావు, వంగర ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి శంకుస్థాపన

రాష్ట్రంలో మసీదుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నసీర్ అన్నారు. లాలాపేట పాత బస్టాండ్ సెంటర్లో ఇక్బాల్ మసీదు పునర్నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్బాల్ మసీదు నిర్మాణా నికి వ్యక్తిగతంగానూ, ప్రభుత్వపరంగానూ తన వంతు సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని హామీ ఇచ్చారు.

● రైలుపేటలో పురాతన చరిత్ర కలిగిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది.

జిల్లాలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు : డీఆర్వో

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ద్వారా అదనంగా 264 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి టీ సేవాకుమార్, బీఎస్పీ - చిరతనగండ్ల వాసు, బీజేపీ - వైవీ సుబ్బారావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ - బీ.సునీల్‌కుమార్, టీడీపీ ప్రతినిధులు కంచర్ల శివరామయ్య, నాయుడు ఓంకార్, జనసేన పార్టీ - సీహెచ్ త్రినాధ్ పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. డీఆర్వో మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1200 మంది ఓటర్ల కంటే అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం రేషనలైజేషన్ చేసి అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారన్నారు. వీటిపై మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు తీసుకొని తుది ప్రతిపాదనలను సిద్ధం చేశామన్నారు. సమావేశంలో ఈఆర్వోలు డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు చల్లా ఓబులేసు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి, తహసీల్దార్లు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో, పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు

మూడు బొమ్మల సెంటర్ వరకు అనధికార పార్కింగ్ నిషేధం

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని ట్రావెలర్స్ బంగ్లా నుంచి నగరంపాలెం 3 బొమ్మల సెంటర్ వరకు ప్రధాన రహదారి వెంట అనధికారికంగా పార్కింగ్ నిషేధమని, పార్కింగ్ చేసిన వాహనాలను 24 గంటల్లోగా (గురువారం) స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే ట్రాఫిక్ పోలీసులు, జీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది సమన్వయంతో వాటిని జేసీబీలతో తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ నగరంపాలెం మెయిన్ రోడ్డులో పార్క్ చేసిన ట్రావెల్స్ బస్సుల తొలగింపుని నేరుగా పర్యవేక్షించారు. పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, డిప్యూటీ సిటి ప్లానర్ సూరజ్, ట్రాఫిక్ సీఐ సింగయ్య, డీఈఈ కళ్యాణరావు పాల్గొన్నారు.



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

జోహ్రాన్ విజయం మార్పునకు నాంది

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(కార్పొరేషన్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఆర్థిక రాజధాని న్యూ యార్క్‌లో డెమోక్రటిక్ సోషలిస్ట్‌గా విజయ బావుటా ఎగిరేసి ప్రపంచంలో మార్పునకు నాంది పలికి ప్రత్యామ్నాయ మార్గాన్ని జోహ్రాన్ మమ్దాని చూపెట్టారని శాసనమండలి మాజీ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గుంటూరులోని జనచైతన్య వేదిక ఆధ్వ ర్యంలో బుధవారం నిర్వహించిన న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దాని విజయంపై విశ్లేషణ కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ జోహ్రాన్ మమ్దాని విజయం ఆర్థిక అసమానతలపై, జీవన వ్యయ సంక్షోభంపై విజయంగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ హనుమంత రెడ్డి, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, విశ్రాంత అడిషనల్ ఎస్పీ చలపతిరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయ రెడ్డి, రేట్ పేయర్స్ అసోసియే షన్ నేత వల్లూరి సదాశివరావు, బత్తుల కోటేశ్వరరావు, సదాశివన్, ఆలా అనంత రామయ్య, కొల్లి రంగారెడ్డి, నరేంద్ర, విఠల్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా గురువారం కొరిటపాడు మెయిన్ రోడ్డు, రామన్నపేట, చంద్ర మౌళీనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్-1 డిప్యూటీ ఈఈ షేక్ ముస్తాక్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

న్యూమోనియా రహిత సమాజ స్థాపనే లక్ష్యం

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



న్యూమోనియా వ్యాధిపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): న్యూమోనియా వ్యాధి రహిత సమాజా న్ని నిర్మించడమే లక్ష్యమని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. న్యూమోనియా వ్యాధి పై అవగాహన పోస్టర్లను బుధవారం కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ప్రతి సంవత్సరం నవంబరు 12వ తేదీన ప్రపంచ న్యూమోనియా దినోత్సవం నిర్వహించుకుం టున్నామని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, పీహెచ్‌వోలు బృందంగా ఇంటింటికి వెళ్లి 5 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి వారికి న్యూమోనియా లక్షణాలు పరీక్షించి, ఒకవేళ ఉంటే వైద్యాధికారికి రిఫర్ చేస్తారన్నారు. న్యూమోనియా లేని సమాజాన్ని ఏర్పర చుకుందాం.. అని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయలక్ష్మి మా ట్లాడుతూ దేశంలో 5 సంవత్సరాల లోపు పిల్లల మరణాలు న్యూమోనియా వల్ల ప్రతీ ఏటా అధికంగా జరుగుతున్నాయన్నారు. పిల్లల మరణాలను నిరోధించడానికి సాన్స్ ప్రో గ్రాం ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్నామని వివరించారు. క్షేత్ర స్థాయిలో విరివిగా న్యూమోనియా పై అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ లావణ్యవేణి

కళాశాల హాస్టల్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

● సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ లావణ్య వేణి

● పరివర్తన భవన్ హాస్టల్లో ఆకస్మిక తనిఖీలు

గుంటూరు(విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ కళాశాల హాస్టల్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామ ని దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ లావణ్యవేణి సూచిం చారు. బుధవారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని పరివర్తన భవన్‌లో ఉన్న కళాశాల విద్యార్థి నుల హాస్టల్‌ను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను, వసతులను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న మెస్ చార్జీలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ లావణ్య వేణి తెలిపారు. కార్యక్రమాలు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య, ఏఎస్‌డబ్ల్యూ శైలజ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవతో ఎనలేని ఆత్మసంతృప్తి

గుంటూరు మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఆత్మసంతృప్తి పొందవచ్చని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధ వారం అహల్యా ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో కళాభారతి అంధుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఉమా శంకర్, రాజకుమారి స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. భోజన అనంతరం అంధ విద్యార్థులతో మాట్లాడి వారి ప్రతిభను తెలుసుకొని, వారికి అవసరమైన పుస్తకాలు, పండ్లు, తినుబండారాలు అందజేశారు. ఇలాంటి చిన్న సేవలు సమాజంలో పరోపకార భావనను పెంచుతాయన్నారు.



అంధ విద్యార్థులతో డాక్టర్ ఉమాశంకర్ దంపతులు

ఆర్వీఆర్ జేసీలో కార్తీక దీపోత్సవం

గుంటూరు(విద్య), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ తది తరులు మాట్లాడుతూ కార్తీక మాసం భారతీయ సంస్కృతికి ప్రతిబింబమని, ఆధ్యాత్మికత మనసుకు ప్రశాంతతను అందించి, జీవితానికి వెలుగు ప్రసాదిస్తుందన్నారు. కళాశాల 'ఉమెన్స్ వెల్ఫేర్ కమిటీ' ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వాతావరణంలో 'కార్తీక శోభ' కార్యక్రమం సందడిగా నిర్వహించడం హర్షణీయమని ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సం దర్భంగా విద్యార్థినులు భక్తి భావంతో, సృజనాత్మక ప్రతిభతో కార్తీక మాసానికి సంబం ధించిన సంప్రదాయ చిహ్నాలు, దీపాల అలంకరణలు, దేవతా చిత్రాలతో అద్భుతమైన రంగోలీలు రూపొందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.



జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ కొల్లా శ్రీనివాస్

ధాన్యం, పత్తి కొనుగోలు సజావుగా జరగాలి : కలెక్టర్

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల నుంచి ధాన్యం, పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. 2025-26 ఖరీఫ్ సీజన్ రైతు సేవ కేంద్రాల ద్వారా పౌర సరఫరాల సంస్థ ధాన్యం, సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ తన కార్యాలయంలో సమీక్షించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తేమ శాతంపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో రైతు సేవ కేంద్రం టెక్నికల్ అసిస్టెంట్ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. తెనాలి, కొల్లిపర మండలాల్లో ఈ నెల 28 నుంచి వరి కోతలు ప్రారంభమవుతాయని, ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనే సంచులు ముందస్తుగానే రైతు సేవ కేంద్రాలలో ఏర్పాటు చేయాలని రైస్ మిల్లర్లకు సూచించారు. జీపీఎస్ అమర్చిన వాహనాలు మాత్రమే ధాన్యం రవాణా కోసం ఉపయోగించాలని తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలుపై ప్రచార కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. పత్తి కొనుగోలులో రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెటింగ్ అధికారులను కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. ప్రత్తిపాడులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఇప్పటికే ప్రారంభించడం జరిగిందన్నారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కె.తులసి, జిల్లా అధికారి కోమలి పద్మ, వ్యవసాయ శాఖ జేడీ అయితా నాగేశ్వరరావు, తెనాలి రవాణా అధికారి శ్రీహరి పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

● కుటుంబం ఊరెళ్లగా మారుతాళాలతో చోరీ

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అద్దెకున్న ఇంట్లో యజమాని ఊరికి వెళ్లడాన్ని అవకాశంగా తీసుకొని మారుతాళాలతో చోరీకి పాల్పడిన దొంగ గట్టి రాజశేఖర్ కుమార్ అలియాస్ రాజకుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పది లక్షల ఖరీదైన బంగారు ఆభర ణాలు, లాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు అరండల్‌పేట పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పి అరవింద్ నిందితుడిని మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. శారదా కాలనీ రెండో లైనుకు చెందిన పల్లా శ్రీనివాసరావు అక్టోబరు 30న కుటుంబస భ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి చెన్నై వెళ్లారు. తిరిగి ఈనెల 10న ఇంటికి వచ్చి చూడగా బీరువాలో రూ.15 వేల నగదు 100 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో చోరీకి పాల్పడింది అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న గట్టి రాజశేఖర్ కుమార్‌గా గుర్తించారు. ఒంగోలులోని జకరయ్య హాస్పిటల్ సమీపంలోని కేశవస్వామి పేటకు చెందిన రాజశేఖర్ కుమార్ రెండు నెలల క్రితం గుంటూరు వచ్చి శారదాకాలనీ రెండో లైన్లో శ్రీనివాసరావు ఇంట్లో గది అద్దెకు తీసుకొని భార్యతో కలసి ఉంటున్నాడు. శ్రీనివాసరావు ఇంట్లో లేని సమయంలో ఇంటి తాళం చెవిని దొంగలించి దాని ఆధారంగా నకిలీ తాళం చెవి తయారు చేయించాడు. అక్టోబరు 30న శ్రీనివాసరావు కుటుంబంతో సహా ఊరు వెళ్ళడాన్ని ఆసరాగా చేసుకుని మారుతాళాలతో చోరీకి పాల్పడ్డాడు. అదేవిధంగా నిందితుడు నాయుడుపేటలో చిలక మౌనిక అనే యువతికి చెందిన ల్యాప్‌టాప్‌ను కూడా గత నెల 26న అపహరించాడు. ఈ రెండు చోరీ కేసులపై వెస్ట్ డీఎస్పీ అరవింద్ పర్యవేక్షణలో అరండల్ పేట సీఐ ఆరోగ్య రాజు సిబ్బంది రాజశేఖర్ కుమార్‌ను అరెస్టు చేసి అతడి నుంచి పది లక్షల ఖరీదైన బంగారం, రూ.70 వేల విలువైన ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పి అరవింద్ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, పక్కన సీఐ ఆరోగ్యరాజు, నిందితుడు రాశేఖర్‌కుమార్ (ముసుగు ధరించిన వ్యక్తి)

రైల్వేస్టేషన్, ఆర్‌టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో సంభవించిన పేలుడు ఘటన దృష్ట్యా, జిల్లా పోలీస్ వ్యవస్థను అప్రమత్తం చేస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బుధవారం పోలీసులు రైల్వేస్టేషన్, ఆర్‌టీసీ బస్టాండ్లలో తనిఖీలు నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ.హనుమంతు ఆధ్వర్యంలో, జిల్లా భద్రత విభాగం ఆధ్వర్యంలో గుంటూరు రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్లలో పోలీస్ సిబ్బంది, ప్రత్యేక జాగిలాల బృందాలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరంగా కొనసాగుతాయని, రైల్వేస్టేషన్, బస్టాండ్లలో ఇప్పటికే పటిష్ట నిఘా ఏర్పాటుచేసి, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణతో పాటు పోలీస్ సిబ్బంది గస్తీ కొనసాగిస్తున్నారని ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు తెలిపారు.



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

విడాకుల కోసం వచ్చిన మహిళను మోసం చేసిన న్యాయవాది

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భర్తతో వచ్చిన మనస్పర్థలు కారణంగా విడిపోయేందుకు విడాకులు కోసం వచ్చిన మహిళను పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన న్యాయవాదిపై నగరంపాలెం పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు రాజమండ్రి ప్రాంతానికి చెందిన దంపతులు కొద్ది సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి నివాసం ఉంటున్నారు. అయితే 2020లో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఇరువురు వేరువేరుగా ఉంటున్నారు ఈ క్రమంలో భర్త నుంచి విడాకులు కావాలంటూ ఆమె న్యాయవాది సయ్యద్ హర్షద్ అహ్మద్‌ను సంప్రదించింది. విడాకులు రాగానే పెళ్లి చేసుకుంటానని న్యాయవాది నమ్మించాడు. ఇరువురు సహజీవనం చేశారు. 2023లో బాధితురాలికి తన భర్తతో విడాకులు వచ్చాయి. తన పెళ్లి విషయం గురించి బాధితురాలు న్యాయవాదిని నిలదీసింది. దీంతో నిన్ను పెళ్లి చేసుకుంటానని చెప్పలేదంటూ బుకాయించాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు అత్యాచారం, చీటింగ్ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్య



సృజన్ (ఫైల్)

శ్రీకాకుళం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎం పురం కొండపై ఉన్న ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థి ప్రత్తిపాటి సృజన్ (20) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎచ్చెర్ల పోలీసులు, తోటి విద్యార్థులు వివరాల ప్రకారం. గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం నాలుగో లైన్‌కు చెందిన సృజన్ 2021-22 విద్యా సంవత్సరంలో శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరాడు. ప్రస్తుతం ఇంజనీరింగ్ ఈఈఈ బ్రాంచ్‌లో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజులుగా క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విద్యార్థులకు షిఫ్ట్‌ల వారీగా మిడ్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. తోటి విద్యార్థులంతా మిడ్ పరీక్షలు రాసేందుకు వెళ్లగా.. సృజన్ మాత్రం బాలుర హాస్టల్‌లో తాను ఉంటున్న నాలుగో అంతస్థు నుంచి మొదటి అంతస్థుకు దిగి తన స్నేహితుని గదిలో ఫ్యాన్‌కు తాడు బిగించి ఉరివేసుకున్నాడు. సృజన్‌ను క్యాంపస్‌కు చెందిన అంబులెన్స్‌లో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఎస్ఐ వి.సం దీప్‌కుమార్, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సృజన్ తండ్రి కృష్ణప్రసాద్ ఆటో డ్రైవర్ కాగా, తల్లి జ్యోతి గృహిణి. సృజన్‌కు సోదరి ఉంది.



కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఆస్తి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

● ఎమ్మెల్యే కార్యాలయంలో 'కార్యకర్తలతో ముఖాముఖి'

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీకి కార్యకర్తలే ఆస్తి అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఆమె 'కార్యకర్తలతో ముఖాముఖి' కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన టీడీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలు ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీకి కంచుకోటని, ఆ కోట బలంగా నిలవడానికి కారణం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలేనని అన్నారు. కార్యకర్తలతో నిరంతరం సంబంధం కొనసాగిస్తూ, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం పార్టీ బలపర్చే మార్గం అని తాను నమ్ముతున్నానని చెప్పారు. అందుకే ప్రతి బుధవారం 'కార్యకర్తలతో ముఖాముఖి' కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తూ ఉన్నామన్నారు. గత వారంలో కార్యకర్తలు సూచించిన సమస్యలను, సలహాలను సమీక్షించి చాలా అంశాలను ఇప్పటికే పరిష్కరించినట్లు తెలిపారు. ఈ వారం కూడా కార్యకర్తల నుంచి వచ్చిన కొత్త సూచనలను త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. గురువారం తెలుగుదేశం పార్టీ కమిటీల ప్రమాణ స్వీకారం జరగనున్న సందర్భంగా, డివిజన్ ప్రెసిడెంట్లు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కూటమి పాలనలో పేదల సొంతింటి కల సాకారం

కూటమి ప్రభుత్వంలో లక్షలాది మంది పేదల సొంతింటి కల సాకారమయిందని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఆమె ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద ఎంపికైన లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియో జకవర్గంలో 560 మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కష్టపడే జనసైనికులకు పార్టీలో గుర్తింపు

● జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం

గుంటూరు మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జనసేన పటిష్టత కోసం కష్టించి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కండేయబాబు తెలిపారు. రాష్ట్ర లేబర్ బోర్డ్ డైరెక్టర్‌గా ఎన్నికైన జన సేన నగర ఉపాధ్యక్షుడు చింతా రేణుక రాజుని అరండల్‌పేటలోని రంగనాయక స్వామి దేవస్థానంలో బుధవారం జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు అడపా మాణిక్యాలరావు, అధికార ప్రతినిధి ఆళ్ల హరి, నగర ప్రధాన కార్యదర్శి ఆనంద్ సాగర్, రేణుకరాజుకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వడ్రాణం మార్కండేయబాబు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి రేణుక రాజు పార్టీ అభ్యున్నతికి కృషి చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పుల్లంశెట్టి ఉదయ్, మామిడి రామా రావు, దాసరి వెంకటేశ్వర్లు, పసుపులేటి నరసింహరావు, బాలకృష్ణ, కౌండిన్య, మధులాల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలపై అసత్య ప్రచారాలు

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్

గుంటూరు(తూర్పు), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానంలో ప్రభుత్వం నిర్మి స్తున్న మెడికల్ కళాశాలలపై వైసీపీ విషం చిమ్ముతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ మండిపడ్డారు. స్థానిక అమరావతి రోడ్డులో బుధవారం ఆయన కార్యా లయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021లో 17 వైద్య కళా శాలల నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేశారని గుర్తుచేసుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఆ నిధులను పక్కదారిని పట్టించారని ఆరోపించారు. 17 కళా శాలలు కేటాయిస్తే, దానిలో 6 మాత్రమే అరకొర పనులు పూర్తి చేసి, మిగతా 11 కళాశా లలు ప్రారంభమే కాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆ కళాశాలలను పూర్తి చేసేందుకు కూట మి ప్రభుత్వం పీపీపీ ద్వారా పనులను ప్రారంభించిందని అన్నారు. దీనిని జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలను చేస్తుందని మండిపడ్డారు. ముఖ్యంగా వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై విషప్రచారాలు చేస్తున్నారని, దీనిని ప్రజలు, విద్యార్థులు నమ్మవద్దని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, తోట శ్రీనివాస్, దారా అంబేద్కర్, సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ తేమ ఉన్నా..పత్తిని కొనుగోలు చేయాలి

● కేంద్ర మంత్రికి జిన్నింగ్ మిల్లు అసోసియేషన్ విజ్ఞప్తి



మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేసిన ఇక్కుర్తి, మన్నవ

గుంటూరు సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితి, అధిక తుఫాన్ ప్రభావం దృష్ట్యా తేమ శాతం ఎక్కువగా ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేసేలా సీసీఐకి ఆదేశాలు ఇవ్వాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పత్తి మిల్లుల యజమానులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరులో ఏపీ కాటన్ టీఎంసీ కన్సార్టియం అధ్యక్షుడు ఇక్కుర్తి శివ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మన్నవ హరినాథ్ బాబు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. తుఫాన్ వల్ల పత్తి పంట పూర్తిగా దెబ్బతిందని, ఈ పరిస్థితిలో కూడా సీసీఐ అధికారులు పత్తి తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉంటే మాత్రమే కొనుగోలు చేస్తామని చెబుతున్నారని వివరించారు. అసోసియేషన్ నేతల విజ్ఞప్తిపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దు

● నగరంలో వైసీపీ నేతల నిరసన ప్రదర్శన

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయటాన్ని నిరసిస్తూ వైసీపీ నేతలు నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. పశ్చిమ నియోజకవర్గంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. పశ్చిమ నియోజకవర్గంలో పట్టాభిపురం స్వామిథియేటర్ సెంటర్ నుంచి కంకరగుంట ఓవర్ బ్రిడ్జి మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీటీ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పలువురు నాయకులున్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇన్‌చార్జ్ షేక్ నూరిఫాతిమా నేతృత్వంలో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఎం జియావుద్దీన్ తదితర నాయకులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మార్కె ట్‌యార్డు మాజీ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, నేతలు మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మహమూద్ పలువురు నాయకులున్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గుంటూరు(తూర్పు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వతేది వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు లైబ్రేరి యన్ బి.శంకుతల ఒక ప్రకటనలో తెలిపారు. కవి సమ్మేళనాలు, రచయితల సందేశాలు, విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాస రచన పోటీలు, క్విజ్, వకృత్వ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. వారం పాటు జరిగే కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయా లని కోరారు.

స్ఫూర్తినిస్తున్న పునరుద్ధరణ


వెంగళాయపాలెం చెరువు గట్టున పునరుద్ధరించిన బావి


చెరువు గట్టున పిల్లల ఆటస్థలం


అన్ని వయస్సుల వారికి ఆరోగ్యాన్ని పంచేందుకు నిర్మించిన వాకింగ్ ట్రాక్

- ● అద్భుతంగా వెంగళాయపాలెం చెరువు సుందరీకరణ
- ● రూ.1.20 కోట్ల నిధులతో 15 రోజుల్లో పూర్తి
- ● సుస్థిరమైన విధానాలతో చెరువు నిర్వహణ
- ● పర్యాటక ప్రదేశంగా చేసేందుకు పుష్కల అవకాశాలు


అభివృద్ధి చేసిన వెంగళాయపాలెం చెరువు

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 150 ఏళ్ల చరిత్ర కలిగిన వెంగళాయపాలెం చెరువును పునరుద్ధరించిన విధానం జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా స్ఫూర్తిని నింపుతోంది. ఒప్పటికే నిండి ఒక పాడుబడిన చెరువుగా మారిపోయిన ఈ జల ప్రదాయినిని కేవలం 15 రోజుల వ్యవధి లోనే సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయడం, అందులో నీటిని నింపడం, పూడుకుపోయిన బావి లోతు పెంచడం ద్వారా ఇప్పుడు ఈ చెరువు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందుకు అయిన ఖర్చు కూడా రూ. 1.20 కోట్లు మాత్రమే. అన్నింటి కంటే ముఖ్యం దీని భవిష్యత్తులో పాడుబడకుండా నిర్వహించేందుకు ఆదాయం వచ్చే వనరులను కూడా ఏర్పాటు చేయడం. ఈ చెరువు ద్వారా పంట పొలాలకు సాగునీరు, పశువులకు తాగునీరు అందించొచ్చు. అలానే బోర్‌వెల్స్, బావులు రీఛార్జ్ కావడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

● 150 ఏళ్ల క్రితం నిర్మాణం

గుంటూరు నగరానికి ఏడు, ఎనిమిది కిలోమీటర్ల దూరంలోనే ఉన్న వెంగళాయపాలెంలో ప్రజలు వ్యవసాయం, పశువుల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ వరి, పత్తి, మిర్చి, పొగాకు, కూరగాయలు, ఆకుకూరలు పండుతాయి. 21 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువును 150 ఏళ్ల క్రితం నిర్మించారు. దీనిని వ్యవసాయ, పశువుల అవసరాలకు వినియోగించేవారు. అయితే 1990ల్లో గ్రామస్తులు చెరువు గట్టున ఒక బావిని నిర్మించి స్థానిక అవసరాలకు వినియోగిస్తున్నారు. నిర్వహణ లోపం, భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో చెరువుగట్టు దెబ్బతిన్నాయి. అలానే దీనికి వచ్చే వాగునీరు నిలిచిపోయింది. దీంతో ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఇక్కడ ఉండే పక్షులు కూడా వలస వెళ్లిపోయాయి. చెరువులో నీరు అడుగంటడం వల్ల పశువుల సంఖ్యను కూడా గ్రామస్తులు తగ్గించుకున్నారు. బావి కూడా పూడుకుపోయింది. ఈ నీటి వనరుని ఎలాగైనా పునరుద్ధరించాలన్న సంకల్పంతో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గ్రామ కమిటీ సంకల్పించింది. కొండవాగు నుంచి ఏర్పాటైన ఫీడర్ చానల్స్‌లో పూడిక తొలగించడంతో ఇప్పుడు చెరువులోకి స్వచ్ఛమైన నీరు వచ్చి చేరుతోంది. ఒక వేళ అదనంగా చెరువులోకి నీరు వచ్చినా ఆ నీటిని మళ్లించేందుకు 7.20 మీటర్ల పొడవునా కాలువను నిర్మించారు. చెరువు గట్టును బలోపేతం చేశారు. కొండరాళ్లతో రివిట్‌మెంట్ చేశారు. అలానే చెరువును రెండు భాగాలుగా విభజిస్తూ మధ్యలో ఒక గట్టును నిర్మించారు. ఒకదానిని పశువులకు తాగునీటి కోసం, మరొకటి పొలాలకు నీరు పెట్టేందుకు వినియోగించాలని నిర్ణయించారు. నాగార్జునసాగర్ ఫీడర్ ఛానల్ నుంచి కూడా నీరు వచ్చే ఏర్పాటును అధికారులు చేశారు. ఈ చెరువులో 1.20 లక్షల క్యూబిక్‌మీటర్ల నీటిని ఒడిసి పట్టుకోవచ్చు.

● 15 శాతం పెరగనున్న రైతు ఆదాయం

చెరువుపై ఆధారపడి 102 ఎకరాల్లో వరి సాగు చేయొచ్చు. భూమిలో తేమ శాతం పెరగడం వలన 1066 ఎకరాల్లో రెండు పంటలను ఈ రబీ సీజన్ నుంచే పండించొచ్చు. దీని వల్ల రైతు ఆదాయం 15 శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. 70 అడుగుల్లోనే భూగర్భ జలం అందుబాటులోకి తీసుకురావడం వల్ల రైతులు కొత్తగా 58 బోర్‌వెల్స్ నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పునీటి శాతం తగ్గడం వల్ల ఐదు పబ్లిక్ బోర్‌వెల్స్ నిర్మాణాన్ని ప్రతిపాదించారు. ఈ చెరువు వల్ల 103 ఎకరాల్లో మాగాణి, 102 ఎకరాల్లో వరి, 120 ఎకరాల్లో పశుగ్రాసం, 1066 ఎకరాల్లో మెట్ట, 262 ఎకరాల్లో ప్రత్తి, 20 ఎకరాల్లో శనగ పంటకు నీరు అందుతుంది. పూల మొక్కలు మళ్లీ జీవం పోసుకొంటున్నాయి. అలానే వలస పక్షులు వెనక్కు వస్తాయని భావిస్తున్నారు.

● ప్రతి ఏటా రూ.4.12 లక్షల ఆదాయం

ప్రజలను ఈ చెరువుతో భాగస్వామ్యం చేసి నిత్యం సందడిగా ఉండేలా చేసేందుకు వాకింగ్ ట్రాక్, నక్షత్రవనం, పిల్లల ఆటస్థలం, సైన్స్ పార్కు, ఓపెన్ ఎయిర్ జిమ్, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం (సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం) ఏర్పాటు చేశారు. చెరువు నిర్వహణ కోసం ఐదు ఎకరాల్లో 212 కొబ్బరి చెట్లను నాటారు. ఇవి ఆరో సంవత్సరం నుంచి ఫలసాయాన్ని ఇస్తాయి. దీని వల్ల ఏటా రూ. 4.12 లక్షల ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. చేపల వల్ల కూడా ఆదాయం పెరుగుతుంది. బోటింగ్, ఇతర ఆహ్లాదం పంచేవి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నిర్ణయించారు. దీంతో ఇదొక పర్యాటక ప్రాంతంగా మారుతుంది.

వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లతో ఆహ్లాద వాతావరణం

● పంజాబ్ ప్రభుత్వం సెక్రటరీ పరిమిందర్ సింగ్ పాల్


వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించిన పంజాబ్ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ పరిమిందర్ సింగ్ పాల్, ఇతర అధికారులు, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు విస్తరిస్తున్న నగరాల్లో చెత్త డంపింగ్ యార్డ్‌లు లేకుండా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లు దోహదపడతాయని పంజాబ్ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరి పరిమిందర్ సింగ్ పాల్ అన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్టడీ టూర్‌లో భాగంగా బుధవారం పంజాబ్ నుంచి స్పెషల్ సెక్రటరి పర్మీందర్ పాల్ సింగ్, పగ్వారా కార్పొరేషన్ కమిషనర్ అక్షిత గుప్తా, పీఎంఐడీసీ సీనియర్ మేనేజర్ సిమర్జీత్ కౌర్, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత ప్లాంట్ సామర్థ్యం, పనితీరు, అవసరమైన వ్యర్థాలు, ఏపీ మున్సిపాలిటీల నుంచి ఎంత చెత్త వస్తుంది, ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది, ఉత్పత్తి అయిన విద్యుత్ వినియోగం, విక్రయాలు, వ్యర్థాల నుండి వచ్చే బూడిద నిర్వహణ, పర్యావరణ అంశాలు, ప్లాంట్ ఏర్పాటుకు పెట్టుబడి తదితర వివరాలను జిందాల్ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ, జిందాల్ ప్లాంట్ నిర్వహణలో వ్యర్థాల తరలింపునకు గుంటూరు నగరపాలక సంస్థ నోడల్ కార్పొరేషన్‌గా ఉండి, ప్రతి రోజు షుమారు 4 వందల టన్నుల వ్యర్థాలను పంపుతున్నామన్నారు. .అనంతరం పంజాబ్ అధికారుల బృందం జిందాల్ ప్లాంట్‌లోని టిప్పింగ్ ఫ్లోర్, గ్రాప్ కంట్రోల్ రూమ్, బాయిలర్స్, ఫ్లూ గ్యాస్ క్లీనింగ్ సిస్టం, సిబ్బంది, డీసీఎస్ కంట్రోల్ రూమ్‌లు, వాటి పనితీరును అడిగి తెలుసుకొని, ప్లాంట్ కెపాసిటీ, ప్రస్తుతం వస్తున్న వ్యర్థాలు, పంపుతున్న మునిసిపాలిటీలు, రోజువారీ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి సమగ్ర వివరాల డాక్యుమెంట్ అందించాలని కోరారు. పర్యటనలో జీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ పి.శాంతి కళ, జిందాల్ ప్లాంట్ ఏపీ ప్రెసిడెంట్ ఎంవీ చారి బృందం పాల్గొన్నారు.

రాజధానిలో కొత్తగా భూకేటాయింపులకు అనుమతి

గుంటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు, వివిధ సంస్థలు స్థాపించేందుకు భూకేటాయింపులు చేయాలని అందిన దరఖాస్తులను పరిశీలించి మంత్రుల బృందం చేసిన సిఫార్సుల మేరకు మునిసిపల్ పరిపాలన (సీఆర్‌డీఏ) శాఖ అనుమతులు మంజూరుచేసింది. ఈ నెల 8న మంత్రుల బృందం సమావేశమై చర్చించి ప్రభుత్వానికి సిఫార్సులు చేసింది. వాటి ఆధారంగా కొత్తగా 11 సంస్థలకు 49.50 ఎకరాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బాసిల్-వుడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ (ఐనవోలు, మందడం సర్వే నంబర్లలో) ఏర్పాటుకు 4 ఎకరాలు ఎకరం రూ.50లక్షలకు, శాంక్టామరియా ఇంటర్నే షనల్ స్కూల్ స్థాపించేందుకు 8 ఎకరాలు తుళ్లూరులో ఎకరం రూ.50లక్షలకు, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటుకు 15 ఎకరాలు నవులూరులో 60 సంవత్సరాల లీజుకు చదరపు భూమి రూ.1కి, ఎకరానికి రూ.4.1కోట్ల ప్రీమియం, కాగ్ రెసిడెన్షియల్‌ని 5 ఎకరాల్లో ఐనవోలులో నిర్మించేందుకు 4.1 ఎకరాల ఫ్రీహోల్డ్ భూమి, ఎన్‌టీపీసీని రాయపూడిలో 1.50 ఎకరాల్లో ఏర్పాటు చేసేందుకు 60 ఏళ్ల పాటు చదరపు మీటరు రూ.1కి లీజుకు, రూ.4.1కోట్ల ప్రీమియం ఎకరానికి, జ్యుడీషియల్ అకాడమిని పిచ్చుకలపాలెంలో 4.83 ఎకరాల్లో ఏర్పాటుకు 60 ఏళ్లపాటు చదరపు మీటరు రూ.1కి లీజుకు, కాస్మోస్ 2-ప్లానిటోరియం(ఐఐఏ) ని ఐదు ఎకరాల్లో అనంతవరంలో ఏర్పాటుకు 60 ఏళ్ల పాటు చదరపు మీటరు రూ.1కి లీజుకు కేటాయించారు. ఉద్దండ్రాయునిపాలెంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు 0.40 ఎకరాలు, పంజాబ్ నేషనల్ బ్యాంకు 0.40 ఎకరాలు, ఐడీబీఐ బ్యాంకు లిమిటెడ్ 0.40 ఎకరాలను ఏర్పాటుకు 60 ఏళ్ల పాటు చదరపు మీటర్ రూ.1కి లీజుకు, ఎకరానికి రూ.4.1 కోట్ల ప్రీమియం, నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ)ని 5 ఎకరాల్లో తుళ్లూరులో ఏర్పాటుకు 60 ఏళ్ల పాటు చదరపుమీటరు రూ.1కి లీజుకు, ప్రీమియం రూ.4.1 కోట్లను ఎకరానికి కేటాయించింది. గతంలో భూ కేటాయిం పులు చేసిన కొన్ని సంస్థలకు సవరణలు చేసింది. హైదరా బాద్ ఎడ్యుకేషనల్ అకాడమి(ఇండస్ ఇంటర్నేషనల్ స్కూ ల్స్)కి తుళ్లూరులో 8 ఎకరాలు ఎకరం రూ.50లక్షలకు, బీపీసీఎల్ ఆఫీసు నిడమర్రులో 1.34 ఎకరాలు, ఐఆర్‌సీటీసీకి వెలగపూడిలో 2 ఎకరాలు, ఏపీహెచ్ఆర్‌డీఐకి శాఖమూరులో 10 ఎకరాలు 60 ఏళ్ల పాటు లీజుకు చదరపు మీటర్ రూ.1కి, ఎకరానికి రూ.4.1 కోట్ల ప్రీమియం, ఎక్స్‌ఎల్ఆర్ఐకి ఐనవోలులో 61.79 ఎకరాలు ఎకరం రూ.50 లక్షలకు. హడ్కోకి 9.17 ఎకరాలను ఎకరం రూ.4 కోట్లకు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

● సిబ్బంది నివాసాల కోసం

ఇదే విధంగా బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థలు అధికారులు, సిబ్బంది నివాసాల కోసం ఐనవోలులో ఏపీసీవోబీ 2.60 ఎకరాలు, ఎస్‌బీఐ 2.05 ఎకరాలు, ఆర్‌బీఐ 4.04 ఎకరాలు, బ్యాంక్ ఆఫ్ బరోడ 1.15 ఎకరాలు, కెనరా బ్యాంకు 0.80 ఎకరాలు, బ్యాంకు ఆఫ్ ఇండియా 0.82 ఎకరాలు, బీపీసీఎల్ 1.10 ఎకరాలు, ఎన్ఐఏసీఎల్ 0.50 ఎకరాల భూమిని 60 ఏళ్ల పాటు చదరపు మీటర్ రూ. 1కి, ఎకరానికి రూ.4.1 కోట్ల ప్రీమియంతో మంజూరు చేసింది. అమరావతి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అకాడమికి నెక్కల్లులో 3 ఎకరాల భూమిని ఎకరం రూ.50 లక్షలకు, ఎఫ్‌సీఐకి నేలపాడులో 0.50 ఎకరాలు, ఐనవోలులో 0.60 ఎకరాల భూమిని ఎకరం రూ.4 కోట్లకు, కాంధారి హోటల్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు తుళ్లూరులో ఎకరం రూ.1.50 కోట్లకు, కిన్నెర గ్రూపు ఆఫ్ హోటల్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు మందడంలో ఎకరం రూ.1.50 కోట్లకు, ఏపీ పబ్లిక్ లైబ్రరీస్ డిపార్టుమెంట్‌కి 6.19 ఎకరాల భూమిని 60 ఏళ్ల పాటు చదరపు మీటర్ రూ.1కి, గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్స్‌కి శాకమూరులో నాలుగు ఎకరాలు ఎకరం రూ.50 లక్షలకు కేటాయింపులు చేసింది.

మొబైల్ యాప్‌తోనే..

● కపాస్ కిసాన్ యాప్‌తో సీసీఐ కొనుగోళ్లు



పిడుగురాళ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొన్ని నిబంధనలతో రైతులు ఇకపై సీసీఐ కేంద్రాలకు నేరుగా పత్తిని తీసుకెళ్లి అమ్మే వీలు లేకుండా పోయింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు ముందుగా స్లాట్‌ను బుక్ చేసుకొని అధికారులు చెప్పిన తేదీ, సమయానికి పత్తిని తీసుకెళ్లి విక్రయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు కాస్త చైతన్యవంతులై మొబైల్ యాప్‌ను ఉపయోగించుకోవడం నేర్చుకోవాలి.

● ఇలా స్లాట్ బుక్ చేసుకోవాలి

ప్రతి రైతు తమ మొబైల్‌లోని గూగుల్ ప్లే స్టోర్ ద్వారా కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మొబైల్ నెంబరుకొచ్చిన ఓటిపి ద్వారా లాగిన్ అవ్వాలి. ఆ తరువాత ఎక్కడెక్కడ సీసీఐ కొనుగోలు కేంద్రాలున్నాయో చూసుకోవాలి. అనంతరం తమకు దగ్గరలోని కేంద్రంలో పత్తిని అమ్మేందుకు స్లాట్ బుక్ చేసుకోవాలి. స్లాట్ బుక్ చేసుకున్న రైతులు తమకు కేటాయించిన తేదీ, సమయంలో సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుకెళ్లి విక్రయించుకోవాల్సి ఉంటుంది.

● జిల్లాలో 11 సీసీఐ కేంద్రాల ఏర్పాటు

పల్నాడు జిల్లాలో మొత్తం 11 సీసీఐ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గురజాల నియోజకవర్గం పరిధిలో పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, గురజాల, నరసరావుపేట పరిధిలో మూడు, క్రోసూరు, చిలకలూరిపేట పరిధిలో రెండు, మాచర్లలో ఒకటి, మరో ప్రాంతంలో ఒక సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

● మద్దతు ధర రూ.8,110

కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్‌కు పత్తికి క్వింటాల్‌కు ధర రూ.8,110గా నిర్ణయించింది. పత్తిలో తేమ 8 శాతం ఉంటే రూ.8,110, 9శాతం ఉంటే రూ.8,028.90, 10శాతం ఉంటే రూ.7,947.80, 11శాతం ఉంటే రూ.7,866.70, 12శాతం ఉంటే రూ. 7,758.60 చొప్పున మద్దతు ధరను ప్రకటించారు. తేమ శాతం 8 నుంచి 12 శాతంలోపే ఉండాలని పేర్కొన్నారు.

పేకాట పోలీసులపై సస్పెన్షన్ వేటు

- ● పట్టుబడిన వెంటనే ప్రాథమిక విచారణ... బదిలీ
- ● సమగ్ర విచారణ అనంతరం ముగ్గురిపై సస్పెన్షన్ వేటు
- ● సత్తెనపల్లి కానిస్టేబుల్‌పై పల్నాడు ఎస్పీకి నివేదిక
- ● గాడి తప్పితే సహించేది లేదంటూ హెచ్చరిక

గుంటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేకాటాడుతూ పట్టుబడిన పోలీసులపై సస్పెన్షన్ వేటుపడింది. ఇటీవల పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని హోటల్లో మద్యం సేవిస్తూ, పేకాడుతూ పట్టుబడిన ముగ్గురు పోలీసులను సస్పెండ్ చేస్తూ ఎస్పీ వకుల్‌జిందాల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గాడితప్పి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదంటూ ఎస్పీ హెచ్చరించారు. మూడు రోజుల క్రితం పెదకాకాని సమీపంలోని జాతీయ రహదారి పక్కన హోటల్లో పేకాట శిబిరం నడుస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ఆ హోటల్‌పై దాడి చేయగా నలుగురు పోలీసులు, ముగ్గురు ప్రైవేటువ్యక్తులు చిక్కారు. అందులో పెదకాకాని ఏఎస్సై కె.వెంకటరావు, ఈస్ట్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రాధాకృష్ణ, తుళ్ళూరు హెడ్ కానిస్టేబుల్ ఆర్ రాజేంద్రప్రసాద్, పల్నాడు జిల్లాకు చెందిన వీరబాబు, మరో ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు ఉన్నారు. వెంటనే టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంబంధిత సీఐకు ఫోన్ చేశారు. అయితే ఆ సమయంలో ఆయన ఎస్పీ వద్ద సమావేశంలో ఉండడంతో ఫోను మాట్లాడలేక పోయారు. దీంతో సిబ్బంది మరో సీఐకు ఫోన్ చేయగా ఆయన వారు మద్యం సేవిస్తున్నట్లుగా భావించి వదిలేయాలని సూచించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని వదిలేసి వెనక్కి వచ్చేశారు. కొద్దిసేపటి తర్వాత ఎస్పీ సమావేశం నుంచి బయటికి వచ్చిన సంబంధిత సీఐ తన ఫోన్‌లో మిస్డ్‌కాల్ చూసి టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ఫోన్ చేశారు. హోటల్లో మద్యంసేవిస్తూ, పేకాడుతూ పట్టుబడిన విషయం ఆయనకు చెప్పగా వెంటనే వారిని పెదకాకాని పోలీస్‌స్టేషన్లో అప్పగించాలని సూచించారు. అయితే అప్పటికే మరో సిఐ సూచన మేరకు వదిలేసి వచ్చేశామని చెప్పడంతో ఆయన విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ప్రాథమిక విచారణ జరిపి క్రమశిక్షణా చర్యల్లో భాగంగా అదే రోజు వారిని బదిలీ చేశారు. గుంటూరు జిల్లా పరిధిలో ఉన్న ముగ్గురు పోలీసులపై బదిలీ వేటువేసి సమగ్ర విచారణకు ఆదేశించారు. విచారణలో వారు పేకాట ఆడుతూ పట్టుబడిన విషయం వాస్తవమేనని తేలింది. సంబంధిత ఏఎస్ఐ గతంలోనూ పేకాట ఆడిస్తున్నట్లు ఆరోపణలు ఉండడంతో ఈ వ్యవహారంపై ఎస్పీ వకుల్ జిందాల్ సీరియస్‌గా స్పందించారు. పెదకాకాని ఏఎస్ఐ కె.వెంకట్రావు, ఈస్ట్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ రాధాకృష్ణ, తుళ్లూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆర్ రాజేంద్రప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఈ ఘటనలో పట్టుబడిన పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన కానిస్టేబుల్ వీరబాబుపై చర్యలకు సిఫారసు చేస్తూ పల్నాడు ఎస్పీకి నివేదిక పంపారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, సిబ్బంది చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనడం లేదా వాటికి సహకరించడం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అలాంటి వారికి శాకాపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● ఇటీవలే ఎస్సై సహా నలుగురిపై వేటు

ఇదే తరహాలో ఇటీవల జిల్లాలో గాడితప్పిన ఖాకీలపై ఎస్పీ వసూల్ జిందాల్ కన్నెర్ర చేశారు. జిల్లావ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో ప్రైవేటు పంచాయతీలు సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ స్టేషన్లో జరుగుతున్న అక్రమాలపై దృష్టి సారించారు. తొలుత ఆరోపణలు ఎదుర్కొన్న నగరంపాలెం, పెదకాకాని పోలీస్ స్టేషన్లలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణకు ఆదేశించారు. విచారణ నివేదికల ఆధారంగా ఈ నెల 6న నగరంపాలెం ఎస్సై సలాం, హెడ్ కానిస్టేబుల్ రమేశ్, అలాగే ఉద్యోగం నుంచి డిస్మిస్ అయి పోలీసుగా చలామణి అవుతున్న గఫార్, పోలీసు శాఖతో సంబంధం లేని ప్రైవేటు డ్రైవర్ డానియేల్, పెదకాకాని స్టేషన్ కానిస్టేబుల్ బి.సురేశ్ కుమార్, హోంగార్డు హరీశ్‌పై కొరడా ఝుళిపించి ఖాకీలకు హెచ్చరికలు పంపారు.

కిట్స్ అధినేత కోయ సుబ్బారావుకు డాక్టరేట్


కోయ సుబ్బారావు

గుంటూరు (విద్య), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావుకు మలేసియా, అమెరికాకు చెందిన మాస్ట్రో గ్లోబల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా స్థానిక చంద్రమౌళి నగర్‌లోని గొట్టిపాటి కల్యాణ మండపంలో కోయ సుబ్బారావును ఇంజనీరింగ్ కళాశాలల ప్రతినిధులు బుధవారం సత్కరించారు. కోయ సుబ్బారావు మూడు దశాబ్దాలుగా సాంకేతిక విద్యారంగంలో ఉంటూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధి లక్ష్యంగా సంస్థలను నిర్వహిస్తున్నారని వక్తలు హర్షం వ్యక్తం చేశారు.అత్యవసర సమయాల్లో పలు సామాజిక సేవా కార్యక్రమాలు ఆయన చేపట్టారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు వెల్లడించారు. ఈ సందర్భంగా కోయ సుబ్బారావును ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాల కృష్ణ, మలినేని గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ మలినేని పెరుమాళ్, జేకేసీ షటిల్ ఫ్రెండ్స్, జీఎస్ఆర్ స్కూల్ అధినేత జి.సాంబశివరావు, కిట్స్ కళాశాల డైరెక్టర డాక్టర్ కె.హరిబాబు, అధ్యాపకులు తదితరులు సత్కరించారు.

ఎంఎస్ఎంఈలకు యూనియన్ బ్యాంకు చేయూత

● రూ. 20 కోట్ల రుణ పత్రాలు అందజేత



సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులకు రూ. 20 కోట్ల రుణపత్రాలు అందజేస్తున్న యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ జవహర్, డిప్యూటీ రీజినల్ హెడ్ అస్వర్త నాయక్ తదితరులు

గుంటూరు సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి కోసం యూనియన్ బ్యాంకు చేయూతనందిస్తుందని రీజనల్ హెడ్ ఎస్.జవహర్ అన్నారు. గుంటూరులోని యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంఎస్ఎంఈ పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ, అర్హులైన వ్యాపారులకు రూ.20 కోట్ల రుణ పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమల యజమానులతో యూనియన్ బ్యాంకు అనుబంధాన్ని బలోపేతం చేయడంతో పాటు, కేంద్రీకృత ఆర్థిక పథకాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ అస్వర్త నాయక్, ఎంఎస్ఎంఈ పాయింట్ హెడ్స్ సత్యజిత్ కబి, హరే రామ్ షా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అంతస్తుల క్రమబద్ధీకరణ

(5వ పేజీ తరువాయి)

వర్తిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న భవనాలకు వర్తించదు. దరఖాస్తుతో పాటు ఈసీ, భవనం ఫొటోలు, ఇండెంటి బాండ్ తదితర పత్రాలు జత పరచాల్సి ఉంది. రూ.10 వేల ఫీజు చెల్లించాల్సి ఉంది. భవనాలకు బిల్డప్ ఏరియా ప్లస్ మార్కెట్ వ్యాల్యూ ప్రకారం అపరాధ రుసం విధిస్తారు.

జరిమానాలు ఇలా..

నిషేధిత స్థలాల్లో నిర్మించిన భవనాలకు బీసీఎస్ వర్తించదు. 50 చదరపు మీటర్లలోపు ఉన్న రెండు అంతస్తుల భవనాలను క్రమబద్ధీకరణ నుంచి ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. భవననిర్మాణ అనుమతి రుసుం, అభివృద్ధి చార్జీలు విధిస్తారు. ప్లాన్ తీసుకుని అంతకు మించి నిర్మించిన ఫ్లోర్లకు జరిమానా విధిస్తారు. అపార్ట్‌మెంట్లలో ప్లాన్‌లేకుండా నిర్మించిన ఫ్లోర్లకు 600 అడుగుల వరకు చదరపు అడుగుకు రూ.120, 601నుంచి 1,200 అడుగుల వరకు రూ.150, 1,201నుంచి 2వేల అడుగుల వరకు రూ.180, ఆ పైబడిన నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.200 జరిమానా చెల్లించాల్సి ఉంది. ప్లాన్ అతిక్రమించి నిర్మించిన భవనాలకు 600 చదరపు అడుగుల వరకు రూ.20వేలు, 601 నుంచి 1200 అడుగుల వరకు రూ.40 వేలు, 1201 నుంచి 2వేల అడుగుల వరకు రూ.60 వేలు, 2వేల అడుగులకు ఆ పైబడిన నిర్మాణానికి రూ.80 వేలు జరిమానా చెల్లించాలి.

హృద్రోగికి అరుదైన చికిత్స

● ప్రభుత్వ సమగ్రాస్పత్రి కార్డియాలజిస్టుల ఘనత




కేసు వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ శ్రీకాంత్, ఇన్‌సెట్‌లో కోలుకున్న యేసయ్య

గుంటూరు మెడికల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి కార్డియాలజీ వైద్యులు అరుదైన గుండె చికిత్స నిర్వహించారు. బైపాస్ సర్జరీ చేసేందుకు వీలులేని హైరిస్క్ రోగికి, వినూత్నంగా డీకే క్రష్ టెక్నిక్‌లో రెండు స్టెంట్లను విజయవంతంగా అమర్చారు. ఈ చికిత్స అనంతరం రోగి గుండెకు రక్త సరఫరా మెరుగుపడింది. బుధవారం సూపరింటెండెంట్ చాంబర్‌లో విలేకరులకు ఈ కేసు వివరాలను కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్ శ్రీకాంత్ వెల్లడించారు. ప్రకాశం జిల్లా గోగులపల్లికి చెందిన యేసయ్య గత నెల 19న తీవ్రమైన గుండె నొప్పితో వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేరారు. గుండెకు 90 శాతం రక్తం పంపింగ్ చేసే బృద్ధమనిలోని ఎడమ రక్తనాళంలో పూడికలు ఉన్నట్లు గుర్తించాం. అతడి ఆరోగ్య రీత్యా ఆపరేషన్ చేసేందుకు వైద్యులు సంశయించారు. రోగి కూడా ప్రాణభయంతో శస్త్ర చికిత్స వద్దని కోరాడు. ఈ నేపథ్యంలో నవంబరు మూడో తేదీన యేసయ్యకు యాంజియోప్లాస్టీ చేసి స్టెంట్లు అమర్చారు. బైఫర్కేషన్ ఆపరేషన్లలో సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించేందుకు వైద్యులు డబుల్ కిస్ క్రష్ టెక్నిక్‌ను వినియోగించారు. గుండె రక్తనాళం బైఫర్‌కేషన్ (రెండుగా విడిపోయే చోట) పూడికలను పరిష్కరించేందుకు ఈ టెక్నిక్‌ను ఉపయోగిస్తారు. మొదట ఒక స్టెంట్‌ను అమర్చిన తర్వాత బెలూన్‌ను స్టెంట్‌లో పెట్టి దాన్ని గాలితో నింపి రక్తనాళాల గోడలకు సరిపోయేలా నొక్కుతారు. రక్తనాళం వంపు తిరిగిన భాగంలో స్టెంట్ సరిగ్గా అమర్చేందుకు బెలూన్‌తో ఈ విధంగా కిస్సింగ్ చేస్తారు. తర్వాత మరోక స్టెంట్‌ను అమర్చి ఇదే రీతిలో మరోసారి కిస్సింగ్ చేశారు. దీనినే డబుల్ కిస్సింగ్ క్రష్ టెక్నిక్‌గా పిలుస్తారని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ప్రస్తుతం యేసయ్య ఆరోగ్యపరంగా కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రైవేటు వైద్యశాలల్లో ఈ వైద్యచికిత్సకు రూ.7 లక్షల ఖర్చు అవుతుందని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. సమావేశంలో కార్డియాలజిస్టులు రాజేంద్ర బేతం, బుచ్చిబాబు, పాటిబండ్ల శివాజీ, శివశంకర్ పాల్గొన్నారు. అరుదైన వైద్యచికిత్స చేసిన కార్డియాలజీ వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అభినందించారు.

నవ్య

కుటుంబ కదంబం

గురువారం
13 నవంబరు 2025



అభిరుచి

పరిసరాలే ప్రేరణగా

తనలో దాగిన చిత్రకారిణిని నిద్ర లేపి, తనదైన శైలిలో చిత్తరువులను సృష్టిస్తున్నారు ఏలూరుకు చెందిన ఊరకరణం అంబిక. గ్రామీణ వాతావరణం, పల్లె ప్రజల జీవన విధానాల నుంచి స్ఫూర్తి పొందుతూ, వాటినే కళాఖండాలుగా మలుస్తూ, దేశ విదేశాల్లో విద్యార్థులకు చిత్రకళను బోధిస్తున్న అంబిక 'నవ్య'తో పంచుకున్న కబుర్లు.

ఆర్టిస్ట్ అనగానే ఊహ తెలిసినప్పటి నుంచి బొమ్మలు గీసే అలవాటు ఉండి ఉంటుందని అందరూ అనుకుంటారు. కానీ నేను అందుకు భిన్నం. నాకు చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడం అలవాటు లేదు. దాంతో ఎనిమిదో తరగతి ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా బొమ్మలు గీయడం కోసం కజిన్ల మీద ఆధారపడేదాన్ని. ఓ సందర్భంలో వాళ్లు అందుబాటులో లేకపోవడంతో ఆ పనికి స్వయంగా పూనుకున్నాను. అలా వేసిన మొదటి బొమ్మ స్కూల్లో నాకు మంచి పేరు తెచ్చిపెట్టడంతో బొమ్మలు గీయగలననే ఆత్మవిశ్వాసం పెరిగింది. నాలో అంతర్లీనంగా ఆ కళ దాగి ఉందనే విషయాన్ని కూడా నేనప్పుడే గ్రహించాను. ఆ తర్వాత చూసి బొమ్మలు గీస్తూ సాధన చేయడం మొదలుపెట్టాను. అది చూసి నాన్న కూడా బాగా ప్రోత్సహించారు. రంగుల పెన్సిళ్లు, డ్రాయింగ్ పుస్తకాలు ఇచ్చి నా అభిరుచికి మద్దతు పలికారు. నిజానికి చిత్రకళనే కెరీర్‌గా మలుచుకోవాలనే ఆలోచన ఉన్నా, సరైన గైడెన్స్ లేకపోవడంతో చదువు మీదే దృష్టి పెట్టాను. అలా తిరుపతిలో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేశాను. ఓ పక్క చదువు కొనసాగుతున్నా, చిత్రకళను నిర్లక్ష్యం చేయకుండా, సాధన చేస్తూనే ఉన్నాను. చదువు పూర్తయ్యాక పెళ్లైపోయింది. దాంతో మా వారి ఉద్యోగరీత్యా హైదరాబాద్, బెంగుళూరు వెళ్లాను. తర్వాత డాటా అనలిస్ట్‌గా కెరీర్ మొదలుపెడదామని అనుకుంటున్న సమయంలో పాప పుట్టింది. దాంతో మా వారు చిత్రకళనే కెరీర్‌గా ఎందుకు మలుచుకోకూడదు? అని ప్రశ్నించారు. అలాగే చిత్రకళకు సంబంధించిన కోర్సు పూర్తి చేయమని కూడా ప్రోత్సహించారు. దాంతో నాలో ఉత్సాహం పెరిగింది. అప్పటివరకూ గీసిన బొమ్మలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించడం కోసం సిద్ధపడ్డాను.

గ్రామీణ వాతావరణమే స్ఫూర్తిగా...

బెంగుళూరులో సాటి చిత్రకారులతో కలిసి ఎగ్జిబిషన్స్‌లో బొమ్మలు ప్రదర్శించినప్పుడు, వాటికి మంచి స్పందన వచ్చింది. కొందరు సీనియర్ ఆర్టిస్టులు నేను వేసిన బొమ్మల్లో కొన్ని సవరణలు చేయడంతో నాలో మరింత ఆసక్తి పెరిగింది. ఆ తర్వాత, కర్నాటక చిత్రకళా పరిషత్‌లో చిత్రకళలో ఏడాది పాటు డిప్లొమా కోర్సు చేసి, కళకు మరింత మెరుగులు దిద్దుకున్నాను. అలా అప్పటి నుంచి నాదైన శైలిని సృష్టించుకోవడం మొదలుపెట్టాను. అందుకోసం నా చుట్టూరా ఉన్న ప్రకృతినీ, గ్రామీణ వాతావరణాన్ని, గ్రామీణుల జీవనవిధానాన్ని పరిశీలిస్తూ, ఫొటోలు తీసుకుంటూ, వాటినే నాదైన శైలిలో చిత్తరువులుగా మలచడం మొదలుపెట్టాను. అలా గీసిన బొమ్మలతో బెంగుళూరు, హైదరాబాద్,

> "నేను ఏలూరులో పుట్టి పెరిగాను. ప్రస్తుతం మేం విజయవాడలో స్థిరపడ్డాం. మావారు చందర్‌రావు ఐటి బ్యాంకింగ్ ఉద్యోగానికి స్వస్తి చెప్పి, ఏలూరులో కోకో, ఆయిల్‌పామ్, గంధం మొక్కలను పెంచడంతో పాటు సేంద్రియ వ్యవసాయం మొదలుపెట్టారు. మాకక్కడ ఫామ్‌హౌస్ ఉంది. కాబట్టి ఏలూరు, విజయవాడ మధ్య తిరుగుతూ ఉంటాం. నాకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద పాప సౌజన్య, ఒడిసాలో అగ్రికల్చర్‌లో మాస్టర్స్ చేస్తోంది. చిన్న పాప, సాహితి బెంగుళూరులో మెడిసిన్ చదువుతోంది. చిత్రకళ పట్ల ఆసక్తి ఉన్నా, బొమ్మలు గీయలేమోననే సందిగ్ధంలో ఉండిపోయేవాళ్లకు నేనిచ్చే సలహా ఒక్కటే! మొదట బెరుకును వదిలించుకుని, ఒకడుగు ముందుకేయాలి. తర్వాత సాటి కళాకారుల మార్గదర్శకత్వంలో బేసిక్స్ నేర్చుకుని, సాధన చేయడం కొనసాగిస్తే, కచ్చితంగా కళాకారులుగా ఎదగగలుగుతారు."



పాలకొల్లులో 10 ఎగ్జిబిషన్లు పెట్టాను. 2023లో బెంగుళూరులో వంద మంది మహిళా ఆర్టిస్టులతో ఒక చిత్రకళా పోటీ ఏర్పాటు చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆ సెల్ఫ్ పోర్ట్రెయిట్ కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతిని గెలుచుకున్నాను. అలాగే కళారత్న, చిత్రకళ అవార్డులు కూడా అందుకున్నాను. బెంగుళూరులో ఉన్న 15 ఏళ్లలో చిత్రకళకు మెరుగులు దిద్దుకోవడంతో పాటు దాన్నే కెరీర్‌గా మలుచుకోగలిగాను.

దేశవిదేశాల విద్యార్థులకు బోధిస్తూ...

ప్రస్తుతం విజయవాడలో స్థిరపడ్డాను. ఇక్కడ స్టూడియో ఏర్పాటు చేసుకుని ఓ పక్క బొమ్మలు గీస్తూనే, మరో పక్క చిత్రకళను బోధిస్తున్నాను. బొమ్మలు గీయడం కోసం అన్ని రకాల మీడియమ్స్‌నూ ప్రయత్నించాను. చివరకు నాకు తగిన మీడియం అక్రిలిక్ అనే విషయాన్ని గ్రహించాను. ప్రస్తుతం నా బొమ్మలన్నిటినీ ప్రధానంగా అక్రిలిక్స్‌తోనే రూపొందిస్తూ ఉంటాను. చార్కోల్‌తో కూడా బొమ్మలు గీయగలుగుతాను. గత పదిహేనేళ్లుగా విద్యార్థులకు కూడా చిత్రకళను నేర్పిస్తున్నాను. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండు మార్గాల్లోనూ బోధిస్తున్నాను. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఫిన్‌ల్యాండ్, సింగపూర్‌లో స్థిరపడిన భారతీయులతో పాటు మన దేశంలో ఢిల్లీ, లడక్‌కు చెందిన విద్యార్థులు నా దగ్గర చిత్రకళను నేర్చుకుంటున్నారు. వీళ్లలో 6 నుంచి 60 ఏళ్ల వయసు వాళ్లున్నారు. ప్రస్తుతం 200 మంది విద్యార్థులకు నేను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పాఠాలు నేర్పిస్తున్నాను.

● గోగుమళ్ల కవిత

కౌన్సెలింగ్

హెయిర్ డై వేసుకోవచ్చా?

డాక్టర్! నేను చాలా కాలంగా హెయిర్ డై వాడుతున్నాను. అయితే రంగు వేసుకున్న ప్రతి సారీ, ముఖం మీద దద్దుర్లు వస్తున్నాయి. దీన్ని హెయిర్‌డై రియాక్షన్‌గా భావించాలా? ఈ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలి?

- ఓ సోదరి, హైదరాబాద్

తలకు వేసుకునే రంగు విషయంలో మనకెన్నో అనుమానాలుంటాయి. హెయిర్ డైను ఎంచుకునేటప్పుడు, ఏ రంగు సురక్షితం, ఏ రంగు ఎక్కువ కాలం మన్నుతుంది? దేంతో దుష్ప్రభావాలు తక్కువగా ఉంటాయి? లాంటి అంశాలను మనం పరిగణనలోకి తీసుకుంటూ ఉంటాం. అయితే ఎన్ని జాగ్రత్తలు పాటించినా పదే పదే ఉపయోగించే హెయిర్ డైలతో కొన్ని దుష్ప్రభావాలను ఎదుర్కోక తప్పదు. కాలక్రమేణా హెయిర్ డైలలో అనేక మార్పులు కూడా చోటు చేసుకుంటున్నాయి. అయినప్పటికీ వీటిలో ఉండే ఫార్మల్‌డిహైడ్ వల్ల ముఖం మీద దద్దుర్లు, తలలో పుండ్లు లాంటి రియాక్షన్లు కనిపిస్తూ ఉంటాయి. తరచూ హెయిర్ డైలను వాడే వారిలో ఈ సమస్య ఎక్కువ. అయితే ఈ దుష్ప్రభావాలకు గురి కాకుండా ఉండాలనుకుంటే, కొత్తగా అందుబాటులోకొస్తున్న వృక్షాధారిత హెయిర్ డైలను ఎంచుకోవడం మంచిది. రసాయనాలతో తయారయ్యే హెయిర్ డైలతో పోలిస్తే, వృక్షాధారిత హెయిర్ డైలు సురక్షితమైనవి. వీటితో దుష్ప్రభావాలకు తావు కూడా ఉండదు.

- డాక్టర్ స్వప్నప్రియ,
డెర్మటాలజిస్ట్,
కాస్మో స్క్యూర్, హైదరాబాద్



స్టీల్ సింక్ తళ తళ

చాలామంది వంటింట్లో స్టీల్ సింక్‌ను ఏర్పాటు చేసుకోవడానికే ఇష్టపడుతుంటారు. రోజూ సరైన విధానంలో శుభ్రం చేయకపోతే స్టీల్ సింక్ మొత్తం మరకలతో నిండిపోతుంది. అలాకాకుండా స్టీల్ సింక్ ఎప్పుడూ తళ తళలాడుతూ ఉండాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం...



- ఒక పళ్లెంలో రెండు చెంచాల ఉప్పు వేసి సగానికి కోసిన నిమ్మచెక్కతో అద్దాలి. దీంతో స్టీల్ సింక్‌ను రుద్దితే మరకలు, మురికి వెంటనే వదిలిపోతాయి. సింక్ చక్కగా మెరుస్తుంది.
- తరచూ సింక్‌లో గోరువెచ్చని నీటిని పోస్తూ ఉండాలి. దీనివల్ల డ్రెయిన్‌లో చిక్కుకున్న వ్యర్థాలన్నీ తొలగిపోతాయి. సింక్ నుంచి దుర్వాసన రాదు. తరువాత లిక్విడ్ డిటర్జెంట్‌లో అద్దిన స్క్రబ్బర్‌తో తోమితే సింక్ మీద పేరుకున్న జిడ్డు త్వరగా వదులుతుంది. ఆపైన సింక్ తళ తళలాడుతుంది.
- చిన్న గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా, నాలుగు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పాత టూత్‌బ్రష్ సహాయంతో సింక్ మొత్తానికి పట్టించాలి. పావు గంట తరువాత స్క్రబ్బర్‌తో తోమితే మరకలు పూర్తిగా వదిలి సింక్ శుభ్రంగా కనిపిస్తుంది.
- సింక్‌లో మెత్తటి ఉప్పు, ముగ్గు, బ్లీచింగ్ పౌడర్, బేకింగ్ సోడాలలో ఒకటి చల్లి పాత టూత్‌బ్రష్‌తో రుద్దినా మరకలు తొలగిపోతాయి.

ఇంటిని అందంగా మార్చేద్దాం

సామాన్లను క్రమపద్ధతిలో సర్దుకుని కొంత సృజనాత్మకత జోడిస్తే చిన్న ఇంటిని కూడా అందంగా ఆకర్షణీయంగా కనిపించేలా చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎంత చిన్న ఇంటినైనా అపురూపంగా తీర్చిదిద్దే చిట్కాల గురించి తెలుసుకుందాం...

- వస్తువులను గోడవారగా, గది మూలల్లో నేలపై పెట్టకూడదు. పుస్తకాలు, బొమ్మలు, బట్టలు, గాజు లేదా పింగాణి సామాగ్రిని అరల్లో చక్కగా సర్దుకోవాలి. ఇంట్లో అరలు ఎక్కువగా లేకపోతే స్టాకింగ్ బోర్డులు, ప్లాస్టిక్ ఫోల్డబుల్ అల్మారాలను ఏర్పాటు చేసుకోవాలి.



- ఇంట్లోకి గాలి, వెలుతురు ప్రసరించేలా చూసుకోవాలి. దీని వల్ల ఇల్లు విశాలంగా కనిపిస్తుంది. విద్యుత్ బల్బులు అమర్చడానికి వీలులేనిచోట నేలపై స్కాన్ ల్యాంప్స్ ఏర్పాటు చేసుకుంటే ఇల్లు ప్రకాశవంతంగా ఉంటుంది. ఇంటి పై కప్పు ఎత్తుగా ఉంటే లాకెట్ దీపాలు వేలాడదీసుకోవచ్చు. టేబుల్ ల్యాంప్‌లు పెట్టుకున్నా ఇల్లు అందంగా మెరుస్తుంటుంది. వంటగది, హాల్, పిల్లలు చదువుకునేచోట, వాకిట్లో ఎక్కువ వెలుతురు వచ్చే లైట్లను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది.
- బయటి గోడలకు సున్నానికి బదులు అందమైన ముదురు రంగులు వేయిస్తే ఇల్లు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అలాగే లోపలి గోడలకు ఒకే రంగును కాకుండా రెండు లేదా మూడు రంగులు ఉండేలా చూసుకుంటే ఇంటి అందం పెరుగుతుంది. ఇంట్లో ఉండే ఫర్నిచర్‌కు నప్పేలా గోడ రంగులు ఎంచుకోవాలి.
- కిటికీలకు చెక్క తలుపులకు బదులు అద్దాలు అమర్చుకుంటే ఇల్లు విశాలంగా కనిపిస్తుంది. అలాగే కిటికీలకు ఎదురుగా ఇంట్లో అద్దాలు పెట్టుకున్నా చూడడానికి బాగుంటుంది.

పోషకాల గని కొబ్బరి పువ్వు

కొబ్బరి నీళ్లలో కంటే కొబ్బరి పువ్వులోనే అధిక పోషకాలుంటాయనీ, దాన్ని తినడం ఆరోగ్యకరమనీ నిపుణులు చెబుతున్నారు.

- కొబ్బరి పువ్వులో పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. కేలరీలు చాలా స్వల్ప



పరిమాణంలో ఉంటాయి. కాబట్టి దాన్ని తినడం వల్ల ఆకలి అదుపులో ఉంటుంది. శరీరం బరువు పెరగదు. అదనపు కొవ్వులు కరిగి శరీరం సరైన ఆకృతిని సంతరించుకుంటుంది.

- కొబ్బరి పువ్వులో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు ఖనిజాలు, అమైనో ఆమ్లాలు, శరీరానికి కావాల్సిన ఇతర పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. వీటి వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీవక్రియల పనితీరు మెరుగుపడుతుంది. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి తగ్గుతుంది.
- కొబ్బరి పువ్వులో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. కాబట్టి మధుమేహం ఉన్నవారు కూడా నిర్భయంగా తినవచ్చు. దానిలో ఉండే ఫ్రీ రాడికల్స్ శరీరాన్ని కేన్సర్ కారకాల నుంచి రక్షిస్తాయి. మహిళలకు నెలసరి సమస్యల నుంచి ఉపశమనాన్ని కల్గిస్తాయి.
- కొబ్బరి పువ్వు తినడం వల్ల చర్మం, శిరోజాలకు కావాల్సినంత తేమ లభిస్తుంది. శిరోజాలు నల్లగా మెరుస్తుంటాయి. మొటిమలు, మచ్చలు, ముడుతలు తొలగిపోయి చర్మం బిగుతుగా, కాంతివంతంగా మారుతుంది.
- దీనిలోని యాంటీ మైక్రోబయల్, యాంటీ వైరల్, యాంటీ పెరాసిటిక్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అనారోగ్యాన్ని దరిచేర్చనివ్వవు.

చెరువులు, కుంటల్లో పరుచుకొన్న గుర్రపుడెక్క అందాలు... వాటి నుంచి విచ్చుకొనే పూలు... చూడ్డానికి ఇంపుగా ఉంటాయి. మనసును ఆహ్లాదంలో తేలియాడిస్తాయి. 'కానీ అవి అంతకంతకూ పెరిగి... జీవ వైవిధ్యాన్ని దెబ్బతీసి... చెరువులు, సరస్సులకు ముప్పుగా పరిణమిస్తాయ'ని అంటారు సుస్మిత కృష్ణన్. అందుకే ఆ వ్యర్థంతో కాగితం తయారు చేసి... జటిలమైన సమస్యకు చక్కని పరిష్కారం చూపారు ఈ 25 ఏళ్ల పర్యావరణ శాస్త్రవేత్త. ఏమిటా పరిష్కారం..? ఆమె మాటల్లోనే...

వినూత్నం



కలుపు మొక్కతో కాగితం

"ఎందుకో తెలియదు... చిన్నప్పటి నుంచి నాకు పర్యావరణం, దానిపై ఆధారపడ్డ జీవజాతుల గురించి ఆసక్తి ఎక్కువ. అందుకే నా చదువు కూడా అదే దారిలో సాగింది. తమిళనాడులోని తిరుచిరాపల్లి మాది. స్థానిక 'భారతీదాసన్ విశ్వవిద్యాలయం'లో లైఫ్ సైన్సెస్‌లో మాస్టర్స్ చేశాను. ఆ సమయంలోనే జీవజాతులు, పర్యావరణ వ్యవస్థల మధ్యనున్న సంక్లిష్టమైన సంబంధాన్ని గమనించాను. తరువాత 2019లో బెంగళూరు 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్'లో ఇంటర్న్‌షిప్‌లో భాగంగా కీటకాల తెగుళ్లు, వాటివల్ల కలిగే ఆర్థిక నష్టాలపై అధ్యయనం చేశాను. గుర్రపుడెక్క మొక్కలు ఎంతలా చెరువంతటినీ ఆక్రమించుకొంటున్నాయో, అవి ఎంత జటిలమైన సమస్యగా మారుతున్నాయో అప్పుడే అర్థమైంది. దీనికి సరైన పరిష్కారం ఏమిటనే ఆలోచన నాలో మొదలైంది.

భిన్నాభిప్రాయాలు ఉన్నా...

రెండేళ్ల కిందట అలప్పుళ 'ఎస్‌డీ కాలేజీ' ప్రొఫెసర్ డాక్టర్ నాగేంద్ర ప్రభు నేతృత్వంలోని బృందంతో కలిసి నీటి మీద పెరిగే పూల మొక్కలపై విస్తృత స్థాయిలో అధ్యయనం చేశాను. ఇది నాకు లోతైన అవగాహన కలిగించింది. సమస్య పరిష్కారం దిశగా తొలి అడుగు వేయడానికి దోహదపడింది. అయితే కొందరు పరిశోధకులు ఈ మొక్కలు చెరువుల్లోని కలుషిత నీటిని శుభ్రం చేయడానికి ఉపకరిస్తాయని చెబుతారు. అది నిజమే కావచ్చు. కానీ వాటి వల్ల ప్రయోజనం కంటే జరిగే నష్టమే ఎక్కువనేది పర్యావరణ శాస్త్రవేత్తల పలు పరిశోధనలు చెబుతున్నాయి. అవి నీటి ప్రవాహానికి అడ్డుపడతాయి. ఆక్సిజన్ స్థాయిలను తగ్గించి, పర్యావరణ వ్యవస్థకు ముప్పుగా పరిణమిస్తాయి. వీటిని తొలగించినా... అత్యంత వేగంగా, అంటే వారం నుంచి రెండు వారాల్లోపు రెట్టింపు అవుతాయి. అంతెందుకు... మా తిరుచిరాపల్లిలోని నీటి వనరుల్లోనే ఇరవై కిలోమీటర్ల మేర ఈ మొక్కలు పరుచుకున్నాయి. ప్రతి వానాకాలానికి ముందు వాటిని తొలగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. బుల్డోజర్ల సాయంతో రోజుల తరబడి కష్టపడితే రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ తొలగించడం సాధ్యంకావడంలేదు. ఇరవై లారీలకు మించిన వ్యర్థం, భారీ వ్యయం మిగులుతున్నాయి.

పరిశోధనతో కొత్త ఉత్సాహం...

అసోమ్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో నీటిపై పెరిగే కలుపు మొక్కలతో కొన్ని తెగలవారు బుట్టలు, బ్యాగ్‌ల లాంటివి తయారు చేస్తారు. అయితే వాటి తయారీ సులువు కాదు. చాలా సమయం పడుతుంది. అంత కష్టపడినా కొనేవారు తక్కువ. వీటన్నిటికీ పరిష్కారం కనుగొనే క్రమంలో మరింత అధ్యయనం అవసరమని భావించాను. అదే సమయంలో జర్మనీలోని ప్రతిష్ఠాత్మక 'ఇంటర్నేషనల్ సస్టెయినబిలిటీ అకాడమీ (ఐఎస్ఏ) ఫెలోషిప్ దక్కింది. పర్యావరణ పరంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి ప్రయత్నించే యువతకు ఈ ఫెలోషిప్ ఇస్తారు. దీని కోసం ప్రపంచ వ్యాప్తంగా ఎంపిక చేసిన పన్నెండు మందిలో భారత్ నుంచి నేనొక్కదాన్నే ఉన్నాను. అక్కడి 'హాంబర్గ్ విశ్వవిద్యాలయం'లో కాగితం తయారీకి ఉపయోగించే వివిధ గుజ్జులపై పరిశోధన చేశాం. ఈ క్రమంలోనే నీటిలో పెరిగే కలుపు మొక్కల గుజ్జుపై చేసిన పరిశోధన ఆశ్చర్యకర ఫలితాలను ఇచ్చింది. కాగితం తయారీ ప్రక్రియలో సాధారణంగా వాడే చెట్ల గుజ్జుకు అరవై శాతం సోడా కలపాలి. అదే దీనికైతే ఆరు శాతం సరిపోతోంది. నాణ్యత కూడా ఎంతో మెరుగ్గా ఉంది.



> పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొంతమంది మహిళలకు వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాను. మరికొన్ని కళాశాలలు, ఇతర సంస్థలు ముందుకు వస్తున్నాయి. దీంతోపాటు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పేపర్ ప్లేట్లు, కప్‌లు కూడా చేయాలని ప్రయత్నిస్తున్నాను. దానివల్ల ఉత్పత్తిదారులకు అదనపు ఆదాయం లభిస్తుంది. ఒక పరిశ్రమ స్థాయికి వీటి ఉత్పత్తిని తీసుకువెళ్లాలనేదే నా లక్ష్యం.

జర్మనీ వెళ్లి వచ్చాక...

జర్మనీలో పరిశోధన నాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. తిరిగి రాగానే కార్యక్షేత్రంలోకి దిగాను. గుర్రపుడెక్క మొక్కలతో సాధారణ కాగితానికి సరైన ప్రత్యామ్నాయ ఉత్పత్తి అందివ్వాలని అనుకున్నా. పేపర్ పరిశ్రమలను సంప్రతించి, వారికి దీని గురించి వివరించాను. నా పరిశోధనా పత్రాలు, సంబంధిత డేటానూ వారి ముందు పెట్టాను. కానీ వాళ్లకు నాపై నమ్మకం కలగలేదు. కొత్త విధానాన్ని చేపట్టడానికి సంకోచించారు. నా ప్రతిపాదనను తిరస్కరించారు. దాంతో నేనే ఉత్పత్తి ప్రారంభించాలని నిర్ణయించుకున్నాను.

వర్క్‌షాప్‌లతో అవగాహన...

సాధ్యమైనంతమందికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో వర్క్‌షాప్‌లు నిర్వహించాను. ముఖ్యంగా స్థానిక మహిళలకు అవగాహన కల్పించి, తయారీ ప్రక్రియను నేర్పించాను. కొన్ని కాలేజీ యాజమాన్యాలు ఆసక్తి కనబరిచాయి. తమ విద్యార్థులకు శిక్షణ ఇప్పించాయి. ఈ ప్రక్రియ చాలా సులువు. మొక్కల కాండాలను కోసి, ఎండబెట్టి, ఆల్కలైన్ సొల్యూషన్‌లో ఉడకబెడితే పీచు విడిపడుతుంది. పలు దశల తరువాత ఇది కాగితంగా మారుతుంది. తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో, నాణ్యమైన పేపర్ ఉత్పత్తి చేయవచ్చు. పైగా పర్యావరణహితం. ఇప్పుడు చాలామంది ఔత్సాహికులు ఈ తరహా కాగితం తయారు చేస్తున్నారు. గ్రీటింగ్ కార్డులకు, కాలేజీలో జరిగే కార్యక్రమాలకు ఆ పేపర్‌నే ఉపయోగిస్తున్నారు. ఇలాంటి మార్పునే నేను కోరుకున్నది."

ఇవి తింటే డార్క్ సర్కిల్స్ మాయం

పోషకాహారం లోపం, తగినంత నిద్ర లేకపోవడం, విపరీతమైన అలసటలాంటి కారణాల వల్ల కళ్ల కింద నల్లని వలయాలు(డార్క్ సర్కిల్స్) ఏర్పడుతుంటాయి. వీటిని తొలగించుకోవడానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకుందాం...

- కీర, పుచ్చకాయలలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. వీటిని తరచూ తినడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడడంతోపాటు చర్మానికి తగినంత తేమ అందుతుంది. దీంతో కళ్ల కింద వాపు, నల్ల మచ్చలు తగ్గుతాయి.
- టమాటాలో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది కళ్ల కింద నల్లని వలయాలను తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. రోజూ ఆహారంలో టామాటాలను చేర్చుకోవడం వల్ల సమస్య తీరుతుంది.
- బొప్పాయి పండులో పపైన్ అనే ఎంజైమ్‌తో పాటు ఎ, సి విటమిన్లు ఉంటాయి. ఇవి చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. పండిన బొప్పాయి పండును తినడం వల్ల కళ్ల కింద చర్మం కాంతివంతంగా మారుతుంది.
- బీట్‌రూట్‌లో చర్మాన్ని రక్షించే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మం పొరల్లో పేరుకున్న వ్యర్థాలను తొలగిస్తాయి. వారానికి రెండుసార్లు బీట్‌రూట్‌ను ఆహారంలో చేర్చుకుంటే మొటిమలు, నల్ల మచ్చలతోపాటు కళ్ల కింద ఏర్పడే డార్క్ సర్కిల్స్ మాయమవుతాయి.
- పాలకూర, తోటకూరల్లో కె విటమిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మానికి రక్త ప్రసరణ అందేలా చేస్తుంది. రోజూ ఈ ఆకుకూరలను తింటూ ఉంటే కళ్ల కింద చర్మం బిగుతుగా ఛాయగా మెరుస్తుంది.
- చర్మం తేమతో నిండి ఉంటే కళ్ల కింద నల్లని వలయాలు రావు. కాబట్టి రోజుకి కనీసం నాలుగు గ్లాసుల మంచినీరు తాగడం అలవాటు చేసుకోవాలి.
- బాదం, పల్లీలు, బ్రోకలీ, పొద్దు తిరుగుడు గింజలు, గుమ్మడి గింజల్లో ఇ విటమిన్ అధికంగా ఉంటుంది. రోజూ వీటిని తగుమాత్రంలో తీసుకోవడం వల్ల మంచి ప్రయోజనం కనిపిస్తుంది.
- రోజుకు ఒక నారింజ పండు తినడం వల్ల కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దీంతో డార్క్ సర్కిల్స్ వాటంతట అవే మాయమవుతాయి.



రికార్డు కనిష్ఠానికి ధరల సూచీ



- గతనెలలో 0.25 శాతానికి తగ్గుదల
- దోహదపడిన జీఎస్‌టీ రేట్ల తగ్గింపు
- వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశం

న్యూఢిల్లీ: ఈ అక్టోబరులో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం రికార్డు కనిష్ఠ స్థాయి 0.25 శాతానికి తగ్గింది. ద్రవ్యోల్బణానికి 2014 జనవరి నుంచి 2012 బేస్ ఇయర్ సిరీస్ అమలులోకి వచ్చినప్పటి నుంచి నమోదైన అత్యల్ప స్థాయి ఇదే. కేంద్ర ప్రభుత్వం ఈ సెప్టెంబరు 22 నుంచి దాదాపు 380 ఉత్పత్తులు, వస్తువులపై జీఎస్‌టీని తగ్గించడంతో పాటు గతనెలలో కూరగాయలు, పండ్లు, కోడిగుడ్ల ధరలు తగ్గుముఖం పట్టడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. ఈ సెప్టెంబరులో ద్రవ్యోల్బణం 1.44 శాతంగా నమోదు కాగా.. 2024 అక్టోబరులో 6.21 శాతంగా ఉంది.

ఏపీలో 0.25 శాతం.. తెలంగాణలో మైనస్ 1.16 శాతం: జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో ఆహార ధరల ద్రవ్యోల్బణం మైనస్ 5.02 శాతానికి జారుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం మైనస్ 0.25 శాతానికి తగ్గగా.. పట్టణ ప్రాంతాల్లో 0.88 శాతంగా నమోదైంది. రాష్ట్రాలవారీగా చూస్తే, కేరళలో అత్యధికంగా 8.56 శాతంగా నమోదైంది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, ఆంధ్రప్రదేశ్‌లో 0.25 శాతంగా, తెలంగాణలో మైనస్ 1.16 శాతంగా నమోదైంది.

రుణగ్రహీతలకు రిలీఫ్!?: రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి (+/- 2%) కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి లక్ష్యాన్ని నిర్దేశించింది. గడిచిన కొన్ని నెలలుగా నియంత్రిత లక్ష్యంలోపే నమోదవుతూ వస్తున్న ద్రవ్యోల్బణం.. గతనెలలో రికార్డు కనిష్ఠానికి దిగివచ్చింది. దీంతో వచ్చేనెల 3-5 తేదీల్లో జరగనున్న ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే లక్ష్యంతో ఆర్‌బీఐ కీలక రెపోరేటును మరో 0.25% తగ్గించే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రెపోరేట్లపై నిర్ణయానికి రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలే కీలకం. రెపో రేటు తగ్గితే తదనుగుణంగా బ్యాంకులు రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తాయి. ఫలితంగా రుణాలు మరింత చవకగా లభించడంతోపాటు ఇప్పటికే రుణం తీసుకున్నవారికి ఈఎంఐల భారం సైతం తగ్గుతుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,510 ▼	1,15,050 ▼	1,73,000 ▲
విజయవాడ	1,27,500 ▼	1,20,000 ▲	1,60,000 ▲
విశాఖపట్నం	1,27,880 ▼	1,15,350 ▲	1,73,000 ▲
రాజమండ్రి	1,25,510 ▼	1,15,050 ▼	1,59,000 ▲
ప్రొద్దుటూరు	1,24,100 ▼	1,14,170 ▼	1,60,000 ▲
ముంబై	1,23,910 ▼	1,13,500 ▼	1,56,705 ▲

జీఆర్‌టీలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ మేళా



చెన్నై (ఆంధ్రజ్యోతి): 'జీఆర్‌టీ జువెలర్స్' గోల్డ్ ఎక్స్ఛేంజ్ మేళాను ప్రకటించింది. వినియోగదారులు తమ పాత బంగారాన్ని తీసుకువచ్చి, మార్పిడి విలువపై గ్రాముకు రూ.150 అదనంగా పొందవచ్చని జీఆర్‌టీ జువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్లు జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. గోల్డ్ ఎక్స్ఛేంజ్ మేళా ద్వారా వినియోగదారులకు తమ పాత బంగారాన్ని వివాహాలు, వేడుకల కోసం రూపొందించిన అద్భుతమైన కొత్త డిజైన్లతో మార్పిడి చేసుకునే అపూర్వ అవకాశాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. వినియోగదారుల కోసం జీఆర్‌టీ ఎలెవెన్ ఫ్లెక్సీ ప్లాన్‌ను కూడా అందిస్తున్నామన్నారు. ఇది నెలవారీ ఆభరణాల కొనుగోలు ప్రణాళిక. 18 శాతం వరకు వేస్టేజీ చార్జీల మినహాయింపు లేదా విలువ ఆధారంగా అనువైన ఎంపికలతో, వినియోగదారులు బంగారం ధరల హెచ్చుతగ్గుల ప్రభావం లేకుండా స్వేచ్ఛగా పెట్టుబడి పెట్టే సౌలభ్యాన్ని ఈ ప్రణాళిక అందిస్తుందని వివరించారు.

సిమెంట్ రంగంలో రూ.1.2 లక్షల కోట్ల పెట్టుబడులు

2028 నాటికి మరో 16-17 కోట్ల టన్నుల సామర్థ్యం జోడింపు



న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ పరిశ్రమ మంచి జోరు మీదుంది. గత మూడేళ్లుగా గిరాకీ ఏటా సగటున 9.5% చొప్పున పెరుగుతోంది. పెరుగుతున్న గిరాకీని తట్టుకునేందుకు కంపెనీలు ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు సిద్ధమయ్యాయి. వచ్చే మూడేళ్లలో కంపెనీలు ఇందు కోసం ఎంతలేదన్నా రూ.1.2 లక్షల కోట్ల వరకు ఖర్చు చేస్తాయని రేటింగ్ సంస్థ క్రిసిల్ అంచనా. గత మూడేళ్లతో పోలిస్తే ఇది 50% ఎక్కువ. ఈ విస్తరణ, నూతన ప్రాజెక్టులతో వచ్చే మూడేళ్లలో (2026-28) అదనంగా మరో 16 నుంచి 17 కోట్ల టన్నుల గ్రైండింగ్ సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కూడా అంచనా వేసింది. గత మూడేళ్లలో నమోదైన 9.5 కోట్ల అదనపు ఉత్పత్తి సామర్థ్యంతో పోలిస్తే ఇది 75% ఎక్కువ. దీంతో ప్రస్తుతం 66.8 కోట్ల టన్నులుగా ఉన్న కంపెనీల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2028 మార్చి నాటికి 82.8 లేదా 83.8 కోట్ల టన్నులకు పెరుగుతుందని పేర్కొంది. అయితే కొత్తగా అందుబాటులోకి వచ్చే ఉత్పత్తి సామర్థ్యంలో 65% ఇప్పటికే ఉత్పత్తిలో ఉన్న ప్లాంట్ల సామర్థ్య విస్తరణ ద్వారా వస్తుందని, ఈ కారణంగా పెట్టుబడి వ్యయాలు మరీ అంత భారీగా ఉండకపోవచ్చని క్రిసిల్ పేర్కొంది. ఈ కొత్త పెట్టుబడుల్లో 10 నుంచి 15% పెట్టుబడులను సిమెంట్ కంపెనీలు సొంత ఇంధన అవసరాల కోసం ఏర్పాటు చేసే హరిత ఇంధన ప్రాజెక్టులు, ఉత్పత్తి ఖర్చులు తగ్గించే ప్రాజెక్టులపై ఖర్చు చేయబోతున్నాయి. దీంతో కంపెనీల అప్పుల భారం సైతం స్థిరంగా ఉండి, వాటి లాభాలకూ పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని క్రిసిల్ తెలిపింది.

కలిసొచ్చే అంశాలు

వచ్చే మూడేళ్లలో దేశీయ సిమెంట్ పరిశ్రమకు పలు సానుకూల అంశాలు కలిసి రానున్నాయి. మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణ రంగాలపై పెరుగుతున్న పెట్టుబడులు ఇందుకు ప్రధానంగా కలిసి రానున్నాయి. దీంతో అదానీల నిర్వహణలోని అంబుజా సిమెంట్, ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలు పెద్ద ఎత్తున విస్తరణ చేపట్టాయి. ఇందుకోసం కొత్త ప్లాంట్ల ఏర్పాటు, సామర్థ్య విస్తరణతో పాటు ఆయా రాష్ట్రాల్లో బలంగా ఉన్న చిన్న చిన్న సిమెంట్ కంపెనీలను కొనేస్తున్నాయి. దీంతో ఈ ఏడాది మార్చి నాటికి ఉన్న 66.8 కోట్ల టన్నుల స్థాపిత సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యంలో 85 శాతం 17 కంపెనీల చేతుల్లో కేంద్రీకృతమైంది. గత పదేళ్లుగా సిమెంట్ రంగంలో ఉత్పత్తి సామర్థ్య వినియోగం సగటున 65% మాత్రమే. అయితే పెరుగుతున్న డిమాండ్‌తో ఇది గత ఆర్థిక సంవత్సరం 70 శాతానికి చేరిందని క్రిసిల్ తెలిపింది.

సైబర్ దాడుల నుంచి రక్షణకు టాటా ఏఐజీ 'సైబర్ ఎడ్జ్'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పెరిగిపోతున్న సైబర్ దాడుల నుంచి కంపెనీలకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు టాటా ఏఐజీ 'సైబర్ ఎడ్జ్' పేరుతో కొత్త బీమా పాలసీ తీసుకొచ్చింది. సైబర్ దాడులతో ఏర్పడే ఆర్థిక నష్టాలతో పాటు, పేరు ప్రతిష్ఠలకు ఏర్పడే నష్టాల నుంచీ కంపెనీలను ఈ పాలసీ కాపాడుతుందని టాటా ఏఐజీ కంపెనీ (ఫైనాన్సియల్ లైన్స్) నేషనల్ హెడ్ నజ్మ్ బిల్‌గ్రామి చెప్పారు. ఇప్పటి వరకు దేశంలోని 1,700 నుంచి 1,800 కంపెనీలు ఈ పాలసీ తీసుకున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం కార్పొరేట్ సైబర్ ఇన్సూరెన్స్ మార్కెట్ విలువ రూ.900 కోట్లకు చేరిందని, ఏటా 25% చొప్పున సగటు వృద్ధి నమోదు చేస్తోందని చెప్పారు. సైబర్ దాడుల విషయంలో ఏపీ, తెలంగాణ కంపెనీలు దేశంలో రెండో స్థానంలో ఉన్నా, సైబర్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకోవడంలో బాగా వెనకబడి ఉన్నట్టు చెప్పారు. దీంతో 2028 నాటికి ఈ రెండు రాష్ట్రాల్లో రెండు రెట్ల వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

26,000 చేరువలో నిఫ్టీ

రూ.4 లక్షల కోట్లకు పైగా సంపద వృద్ధి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 780.69 పాయింట్ల వరకు ఎగబాకి 84,652.01 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 595.19 పాయింట్ల లాభంతో 84,466.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 239.6 పాయింట్ల వరకు పెరిగి 25,934.55కు చేరినప్పటికీ, మళ్లీ కాస్త తగ్గి 180.85 పాయింట్ల లాభంతో 25,875.80 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.4 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.473.69 లక్షల కోట్లకు (5.34 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్ల ర్యాలీ నేపథ్యంలో దేశీయంగానూ మదుపరులు ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్ రంగాల షేర్లలో భారీగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ స్పష్టమైన మెజారిటీతో గెలుపొందవచ్చన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలు మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయని వారన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 లాభపడగా.. ఏషియన్ పెయింట్స్ షేరు 4.46 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

- విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.1,750.03 కోట్ల నికర అమ్మకాలు జరుపగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) నికరంగా రూ.5,127.12 కోట్ల కొనుగోళ్లు జరిపారు.
- ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 12 పైసల నష్టంతో రూ.88.62 వద్ద ముగిసింది.
- ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర రూ.2,000 పెరిగి రూ.1,27,900కు చేరగా.. కిలో వెండి రూ.5,540 ఎగబాకి రూ.1,61,300 ధర పలికింది. .

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	595	విజయవాడ	600
వరంగల్	597	గోదావరి	605
చిత్తూరు	633	విశాఖపట్నం	590
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	111
కరీంనగర్	107	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	112
కర్నూలు	107	నెల్లూరు	117
విశాఖపట్నం	108	అనంతపురం	117
గోదావరి	109		

గ్రో బంపర్ లిస్టింగ్

ఆన్‌లైన్ స్టాక్ బ్రోకింగ్ సేవల ప్లాట్‌ఫామ్ 'గ్రో' మాతృ సంస్థ బిలియన్‌బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు భారీ స్పందన లభించింది. ఐపీఓ ధర రూ.100తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 14% లాభంతో రూ.114 వద్ద నమోదైంది. ట్రేడింగ్ ముగిసేసరికి 30.94% లాభంతో రూ.130.94 వద్ద ముగిసింది.

ఆర్డీ ఇంజనీరింగ్ రూ.15 కోట్ల సమీకరణ

హైదరాబాద్‌కు చెందిన ఆర్డీ ఇంజనీరింగ్ రెండో విడత ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా రూ.15 కోట్లు సమీకరించింది. డెల్టా ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఎల్ఎల్‌పీ, సెంచురీ ఫ్లోర్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ పెట్టుబడులు పెట్టినట్టు ఆర్డీ ఇంజనీరింగ్ బుధవారం వెల్లడించింది. ఈ జూలైలో కంపెనీ తొలి విడత ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా రూ.17.43 కోట్లు సేకరించింది.

లుపిన్ వైజాగ్ ప్లాంటులో అంకాలజీ బ్లాక్ ప్రారంభం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ వద్ద ఉన్న తమ అనుబంధ సంస్థ ప్లాంటులో ప్రత్యేక అంకాలజీ (కేన్సర్) బ్లాక్ ప్రారంభించినట్టు ఫార్మా దిగ్గజం లుపిన్ ప్రకటించింది. ఈ బ్లాకులో కేన్సర్ చికిత్సలో ఉపయోగించే తుది ఔషధాల తయారీకి అవసరమైన ప్రత్యేక ఏపీఐ ముడి పదార్థాలను కాంట్రాక్టు డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ పద్ధతిలో తయారు చేస్తారు. ఈ బ్లాకులోని ప్రాసెస్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌ను క్వాలిటీ కంట్రోల్ లేబొరేటరీతో అనుసంధానం చేసినట్టు లుపిన్ మాన్యుఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్ (ఎల్ఎంఎస్) సీఈఓ అబ్దెల్‌అజీజ్ టౌమీ తెలిపారు.

స్పోర్ట్స్

ప్రణయ్, లక్ష్య శుభారంభం

జపాన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్


ప్రణయ్

కుమమొటో (జపాన్): భారత స్టార్ షట్లర్లు హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ జపాన్ ఓపెన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఏడో సీడ్ లక్ష్య 21-12, 21-16తో స్థానిక షట్లర్ కొకి వతనబెపై, ప్రణయ్ 16-21, 21-13, 23-21తో జున్ హావో లియోంగ్ (మలేసియా)పై గెలిచారు. లక్ష్య, ప్రణయ్ మినహా తొలిరోజు బరిలోకి దిగిన మిగతా భారత షట్లర్లంతా విఫలమయ్యారు. సింగిల్స్‌లో కిరణ్ జార్జ్, ఆయుష్ శెట్టి, తరుణ్ మన్నేపల్లి, మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్వికా శివాని/రోహన్ కపూర్ ఇంటిబాట పట్టారు.

మిక్స్‌డ్ ఫైనల్‌కు దీప్షిక జోడీ

ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్



ఢాకా: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. బుధవారం జరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత జోడీ దీప్షిక/అభిషేక్ వర్మ ఫైనల్‌కు దూసుకెళ్లి స్వర్ణానికి అడుగుదూరంలో నిలిచింది. సెమీఫైనల్లో దీప్షిక ద్వయం 156-153తో కజకిస్థాన్‌ను చిత్తుచేసింది. టైటిల్‌పోరులో ఆతిథ్య బంగ్లాదేశ్‌తో భారత జంట అమీతుమీ తేల్చుకోనుంది. ఇక, రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన అన్షికా కుమారి/యశ్‌దీప్ భోగె జోడీ కాంస్య పతక పోరులో నిలిచింది. క్వార్టర్స్‌లో 5-1తో బంగ్లాను మట్టికరిపించిన అన్షిక జంట సెమీస్‌లో మాత్రం 0-6తో చైనీస్ తైపీ ద్వయం చేతిలో ఓటమిపాలైంది. దీంతో కాంస్యం కోసం టాప్‌సీడ్ కొరియాతో భారత్ తలపడనుంది.

టైబ్రేక్‌కు అర్జున్, హరి

చెస్ ప్రపంచకప్

- ప్రజ్ఞానంద కూడా..
- కార్తీక్ అవుట్

పనాజి: ఫిడే చెస్ వరల్డ్‌కప్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, పెంటేల హరికృష్ణ నాలుగో రౌండ్‌ను డ్రా చేసుకొన్నారు. దీంతో గురువారం జరిగే టైబ్రేక్‌లో ఫలితం తేలనుంది. బుధవారం జరిగిన నాలుగో రౌండ్ రెండో గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 36 ఎత్తుల అనంతరం పీటర్ లెకో (హంగేరీ)తో డ్రాకు అంగీకరించాడు. దీంతో ఇద్దరూ 1-1తో సమంగా నిలిచారు. గ్రాండిలస్ (స్వీడన్)తో రెండో గేమ్‌ను హరికృష్ణ 38 ఎత్తుల్లో డ్రా చేసుకొన్నాడు. డేనియల్ దుబోవ్‌తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నాడు. కాగా, కార్తీక్ వెంకట్రామన్ 0.5-1.5తో లి క్వాంగ్ లియమ్ (వియత్నాం) చేతిలో, ప్రణవ్ 0.5-1.5తో నోడిబెక్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడారు.

'హజారే'లో ఆడండి!

రోహిత్, కోహ్లీకి స్పష్టంజేసిన బోర్డు



న్యూఢిల్లీ: జాతీయ జట్టులో కొనసాగాలంటే దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆడాల్సిందేనని సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి బీసీసీఐ స్పష్టం చేసినట్టు తెలిసింది. డిసెంబరు 24 నుంచి జరిగే ఈ టోర్నీలో ఆడేదీ లేనిదీ వీరిద్దరూ ఇంకా బోర్డుకు సమాచారం అందించలేదు. అయితే తాను ఆడతానని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ)కు రోహిత్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. కానీ, ఎంసీఏ వాటిని తోసిపుచ్చింది. రోహిత్ నుంచి తమకెలాంటి సమాచారమూ లేదని తెలిపింది. కాగా, దక్షిణాఫ్రికాతో ఈ నెల 30 నుంచి జరిగే మూడు వన్డేల సిరీస్‌ను దృష్టిలో ఉంచుకొని రోహిత్ రోజూ ప్రాక్టీస్ చేస్తున్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడే విషయమై కోహ్లీ కూడా మౌనంగా ఉన్నాడు. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీ వన్డేలు మాత్రమే ఆడుతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆస్ట్రేలియా టూర్‌లో మూడు వన్డేల సిరీస్‌లో వీరిద్దరూ బరిలోకి దిగారు.

టాప్‌లోనే రోహిత్

దుబాయ్: ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా టూర్‌లో అదరగొట్టిన రోహిత్ కెరీర్‌లో తొలిసారి నెం:1 ర్యాంక్‌ను కైవసం చేసుకొన్న సంగతి విదితమే. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకుల జాబితాలో రోహిత్ 781 పాయింట్లతో టాప్‌లోనే ఉన్నాడు. కాగా, కోహ్లీ ఒక స్థానం మెరుగుపర్చుకొని ఐదో ర్యాంక్‌కు ఎగబాకగా.. శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో నిలకడగా ఉన్నాడు. ఇబ్రహీం జద్రాన్ (అఫ్ఘానిస్థాన్), డారెల్ మిచెల్ (న్యూజిలాండ్) రెండు, మూడు ర్యాంకుల్లో నిలిచారు.

హసన్ అజేయ శతకం

- బంగ్లా 338/1
- ఐర్లాండ్ 286 ఆలౌట్

సిల్హట్: హసన్ జాయ్ (169 బ్యాటింగ్) శతకంతో చెలరేగడంతో.. ఐర్లాండ్‌తో తొలి టెస్ట్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఆటకు రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 338/1 స్కోరు చేసింది. బుధవారం ఆట ఆఖరుకు హసన్‌తోపాటు మోమినుల్ హక్ (80 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఐర్లాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 286 పరుగులకు ఆలౌటైంది.

అనుకున్నట్టే.. జురెల్

టెస్ట్ జట్టునుంచి నితీశ్ అవుట్

'ఈడెన్' మ్యాచ్‌కు ముందు టీమిండియాలో మార్పు


జురెల్

కోల్‌కతా: ఫామ్‌లో ఉన్న వికెట్ కీపర్-బ్యాటర్ ధ్రువ్ జురెల్‌కు భారత జట్టులో చోటు దక్కింది. దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్‌కు అతడికి జట్టులో చోటు లభించగా.. పేలవ ప్రదర్శన కనబరుస్తున్న ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిపై వేటుపడింది. గురువారం నుంచి భారత్-దక్షిణాఫ్రికా 'ఎ' జట్ల మధ్య జరిగే వన్డే సిరీస్ కోసం నితీశ్‌ను టెస్టు జట్టు నుంచి విడుదల చేసినట్టు సహాయ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే బుధవారమిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపాడు. తాజాగా బెంగళూరులో దక్షిణాఫ్రికా-ఎతో జరిగిన రెండు అనధికార టెస్ట్‌ల్లో ధ్రువ్ రెండు సెంచరీలతో అదరగొట్టాడు. మరోవైపు ఇంగ్లండ్ టూర్‌లో గాయంతో జట్టుకు దూరమైన రిషభ్ పంత్ మళ్లీ జట్టులోకి రావడంతో.. జురెల్‌ను స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఎంపిక చేశారు. జడేజా, సుందర్, అక్షర్ పటేల్ రూపంలో స్పిన్ ఆల్‌రౌండర్లు అందుబాటులో ఉండడంతో అదనపు బ్యాటర్‌తో ఆడే అవకాశం ఉంటుందని డస్కాటే చెప్పాడు. అంటే, తుది జట్టులో కుల్దీప్‌కు చోటు దక్కడం కష్టమే. కాగా, నితీశ్‌ను భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దాలనుకొంటున్నట్టు పేర్కొన్నాడు. 'వెస్టిండీస్‌తో టెస్ట్‌లు, వన్డే సిరీస్‌ల్లో నితీశ్ ఆడాడు. భవిష్యత్ అవసరాల కోసం అతడు మరింతగా రాటుదేలాల్సి ఉంది. ఈ సిరీస్ నెగ్గడం ఎంతో కీలకం కావడంతో.. అందుకు తగ్గట్టుగా జట్టు కూర్పు ఉంటుంద'ని డస్కాటే తెలిపాడు. అయితే, అవసరమైతే నితీశ్‌ను గువాహటిలో జరిగే రెండో టెస్ట్‌కు పిలిచే అవకాశం ఉందని ఓ అధికారి వెల్లడించాడు. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అయిన నితీశ్ ఆశించిన రీతిలో రాణించడం లేదు. విండీస్‌తో తొలి టెస్ట్‌లో నాలుగు ఓవర్లు మాత్రమే బౌల్ చేసి ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయాడు. ఓ ఇన్నింగ్స్‌లో 43 పరుగులు మాత్రమే చేశాడు.



స్పిన్ బలంతోనే..?

స్వదేశంలో స్పిన్ బౌలింగ్ టీమిండియా ప్రధాన బలం. ఈడెన్ గార్డెన్స్‌లో కూడా ఇదే ఫార్ములాను భారత మేనేజ్‌మెంట్ అమలు చేసే అవకాశం ఉంది. సఫారీల బ్యాటర్లు కూడా ఉపఖండంలో స్పిన్‌ను ఎదుర్కోవడంలో అనేక సందర్భాల్లో తడబడ్డారు.

బవుమాకు ఫిట్‌నెస్ డ్రిల్

బుధవారం ఉదయం దక్షిణాఫ్రికా జట్టు తీవ్రంగా ప్రాక్టీస్ చేసింది. గాయం నుంచి కోలుకొని మళ్లీ జట్టులోకి వచ్చిన కెప్టెన్ టెంబా బవుమా.. కోచ్, ఫిజియో సమక్షంలో ఫిట్‌నెస్ నిరూపించుకొన్నాడు. 20 నిమిషాలపాటు ఫిట్‌నెస్ టెస్ట్‌లో పాల్గొన్న బవుమా ఆ తర్వాత నెట్స్‌లో సాధన చేశాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కండర గాయం కావడంతో బవుమా జట్టుకు దూరమయ్యాడు. గతవారం భారత్-ఎతో జరిగిన రెండో అనధికార టెస్ట్‌తో మళ్లీ ఎంట్రీ ఇచ్చాడు.

చరిత్ర సృష్టించాలనుకొంటున్నాం

గత 15 ఏళ్లలో భారత్‌తో దక్షిణాఫ్రికా ఒక్క టెస్ట్ కూడా నెగ్గలేదు. కానీ, ఈసారి ఆ దాహాన్ని తీర్చుకోవాలనే పట్టుదలతో ఉన్నామని సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ అన్నాడు. పిచ్‌ను చూస్తే మ్యాచ్ ఆఖరి రోజు వరకు సాగే అవకాశం ఉందని చెప్పాడు. దక్షిణాఫ్రికా కోచ్ షుక్రి కాన్రాడ్ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. కేశవ్ మహారాజ్, ముత్తుసామి, సైమన్ హార్మర్‌లతో కూడిన స్పిన్ త్రయం.. టీమిండియాకు దీటుగా ఉందన్నాడు.

అంజుమ్, కౌర్‌కు నిరాశ

కైరో (ఈజిప్టు): ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బుధవారం భారత షూటర్లకు నిరాశ ఎదురైంది. యువ షూటర్ ఆషి చౌక్సీ, ఒలింపియన్లు అంజుమ్ మోద్గిల్, సిఫ్ట్ కౌర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో కనీసం ఫైనల్స్ కూడా చేరలేకపోయారు. క్వాలిఫికేషన్స్‌లో ఆషి 15వ, అంజుమ్ 17వ, సిఫ్ట్ కౌర్ 48వ స్థానాలకు పరిమితమయ్యారు. ఇక, గురువారం జరిగే పోటీల్లో మను భాకర్, ఇషా సింగ్, రాహీ సర్నోబాత్ 25 మీటర్ల పిస్టల్ విభాగంలో తలపడనున్నారు. ప్రస్తుతం టోర్నీలో భారత్ 3 స్వర్ణాలు, 5 రజతాలు, 3 కాంస్యాలతో రెండో స్థానంలో కొనసాగుతోంది. 8 స్వర్ణాలు సహా మొత్తం 15 పతకాలతో చైనా అగ్రస్థానంలో ఉంది.

భారత్ చేతిలో ఆసీస్ చిత్తు

- అంధ మహిళల టీ20 వరల్డ్‌కప్

న్యూఢిల్లీ: అంధుల టీ20 వరల్డ్‌కప్‌లో భారత మహిళల జట్టు 209 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 292/4 స్కోరు చేసింది. కెప్టెన్ దీపిక (91), ఫులా సరీన్ (54 నాటౌట్) రాణించారు. ఛేదనలో ఆస్ట్రేలియా 19.3 ఓవర్లలో 83 పరుగులకు ఆలౌటైంది. మరో మ్యాచ్‌లో నేపాల్ 9 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలిచింది.

ఇక్కడ ఆడలేం.. టూర్ రద్దు చేయండి

- పాక్‌లో భద్రతపై ఆందోళనలో లంక క్రికెటర్లు
- సందిగ్ధంలో వన్డే సిరీస్

రావల్పిండి: ప్రస్తుతం పాకిస్థాన్ పర్యటనలో ఉన్న శ్రీలంక క్రికెట్ జట్టు క్రికెటర్లు తమ భద్రతపై ఆందోళనగా ఉన్నారు. ఇస్లామాబాద్‌లోని సెషన్స్ కోర్టు వద్ద మంగళవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మృతి చెందగా, అనేక మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడ ఉండడం అంత క్షేమకరం కాదని తమ దేశ ఆటగాళ్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు శ్రీలంక క్రికెట్ బోర్డు (ఎస్ఎల్‌సీ) వర్గాలు తెలిపాయి. లంక జట్టులోని ఎనిమిది మంది ఆటగాళ్లు గురువారం స్వదేశం వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని కూడా సమాచారం. ఆతిథ్య పాక్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా లంక ఇప్పటికే తొలి మ్యాచ్ ఆడేసింది. రెండోది గురువారం, ఆఖరిదైన మూడోది శనివారం జరగనుంది. ఈ మూడు మ్యాచ్‌లకు వేదిక రావల్పిండి. అయితే, దాడి జరిగిన ఇస్లామాబాద్ నగరం, రావల్పిండికి అత్యంత సమీపంలోనే ఉండడం గమనార్హం. తమ భద్రత విషయమై కలవరపడుతూ లంక జట్టులోని కొందరు ఆటగాళ్లు.. ఈ పర్యటనను వెంటనే రద్దు చేయాల్సిందిగా తమ దేశ క్రికెట్ బోర్డును కోరారట. దీంతో ఈ సిరీస్ జరగడం సందిగ్ధంగా మారింది. మరోవైపు దాడి నేపథ్యంలో లంక జట్టుకు భద్రతను కట్టుదిట్టం చేశారు. పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న ఆ దేశ మంత్రి మొహిసిన్ నఖ్వీ బుధవారం లంక జట్టు అధికారులను కలిశారు. దాడి ఘటన గురించి ఆందోళనపడొద్దని, లంక ఆటగాళ్లకు అన్నివిధాలా భద్రత ఉంటుందని ఆ జట్టు అధికారులకు నఖ్వీ హామీ ఇచ్చారు. 2009 మార్చిలో పాకిస్థాన్ పర్యటనకు వచ్చిన లంక క్రికెట్ జట్టు బస్సుపై లాహోర్‌లోని గడాఫీ స్టేడియం సమీపంలో తీవ్రవాదులు దాడులకు పాల్పడ్డారు. దీంతో అంతర్జాతీయ జట్లు పాక్‌లో ఆడేందుకు నిరాకరించడంతో పదేళ్లపాటు ఇక్కడ ఎలాంటి క్రికెట్ సిరీస్‌లు జరగని సంగతి తెలిసిందే.

పరదాలు, బారికేడ్లు లేని
ప్రజా ప్రభుత్వమిది

- ఇక్కడి స్థితిగతుల జనమందరికీ తెలియాలి
- ప్రజల మధ్యనే అధికారులతో మంత్రి నిమ్మల సమీక్ష

త్రిపురాంతకం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): 'పరదాలు, దాపరికాలు ప్రజా ప్రభుత్వంలో ఉండవు. బారికేడ్లు పెట్టి ప్రజలను దూరంగా ఉంచడం మా తీరు కాదు' అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. బుధవారం ప్రకాశం జిల్లా దోర్నాల మండలం కొత్తూరు వద్ద వెలిగొండ ప్రాజెక్టు టన్నెళ్ల పనుల పురోగతిపై సమీక్షించారు. ఆ సమయంలో లోపలికి వచ్చిన ప్రజలను అధికారులు బయటకు పంపడానికి ప్రయత్నించారు. కలుగజేసుకున్న మంత్రి నిమ్మల పై విధంగా వ్యాఖ్యానించారు. ప్రజల సమక్షంలోనే సమీక్ష చేద్దామంటూ అందరూ లోపలే కూర్చోవాలని ఆహ్వానించారు. 'మీ నాయకత్వంలో అంకితభావంతో పనిచేస్తాం' అని ఒక అధికారి అనగానే... 'అలాంటి పొగడ్తలు అక్కర్లేదు. అలా గతంలో డబ్బులిచ్చి పొగిడించుకునేవారు. ఆ రోజుల నుంచి బయటకు రండి' అని మంత్రి స్పష్టం చేశారు. 'ఈనెల 7న వచ్చాను. ఐదు రోజుల వ్యవధిలోనే మళ్లీ వచ్చానంటే వెలిగొండ పట్ల ప్రభుత్వం ఎంత శ్రద్ధ చూపుతుందో మీరు అర్థం చేసుకోవాలి. అనుకున్న గడువు లోగా వెలిగొండ పూర్తికి ఎవరికి వారు పనిచేయాలి. మన హయాంలో పనులు పూర్తిచేసి వెలిగొండ ద్వారా నీరివ్వగలిగితే అంతకన్నా అదృష్టం మరొకటి ఉండదు. రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనుల శంకుస్థాపన కార్యక్రమం ఈ నెలలోనే చేపట్టాలి. కార్యక్రమానికి సీఎం చంద్రబాబును ఆహ్వానిస్తాం. మళ్లీ నెలరోజుల్లోపే ప్రాజెక్టు పనుల పరిశీలనకు వస్తా. అప్పుడు సమీక్షలో మీ పనితీరు తెలుస్తుంది. పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే... నిర్వహణ ఏజెన్సీ అయినా, అధికారులైనా... వేటు తప్పదు' అని మంత్రి నిమ్మల హెచ్చరించారు.



వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కేంద్ర మంత్రి నిర్మలతో మంత్రి నారాయణ భేటీ

న్యూఢిల్లీ, అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అమృత్ పథకం నిధులు, 15వ ఆర్థిక సంఘం పెండింగ్ నిధులు విడుదల చేయాలని మంత్రి నారాయణ విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలతో కలసి కేంద్ర మంత్రితో ఆమె కార్యాలయంలో భేటీ అయ్యారు. నిధులు విడుదలకు సంబంధించి తాను చేసిన విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి నారాయణ మీడియాకు తెలిపారు.

మీ విషయంలో తప్పు చేశాను!

- ఏబీవీ, జాస్తి కృష్ణకిశోర్‌కు ప్రవీణ్ ప్రకాశ్ క్షమాపణ
- 'పశ్చాత్తాపం'తో వీడియో విడుదల



అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణ కిశోర్‌కు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాశ్ క్షమాపణలు చెప్పారు. జగన్ హయాంలో తాను జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా ఉన్న సమయంలో వారి పట్ల వ్యవహరించిన తీరుకు పశ్చాత్తాపపడుతూ బహిరంగ క్షమాపణలతో తాజాగా ఆయన వీడియో విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రవీణ్ ప్రకాశ్ వీఆర్ఎస్ తీసుకున్న సంగతి తెలిసిందే. వీడియోలో ఆయన మాట్లాడుతూ.. తానెప్పుడూ చట్టవిరుద్ధంగా ఫైలు రాయలేదన్నారు. జూనియర్లకు, కింది ఉద్యోగులకు కూడా చట్టవిరుద్ధంగా వ్యవహరించాలని ఎన్నడూ చెప్పలేదని తెలిపారు. 'నాపై సమాజానికి ఉన్న అంచనాల మేరకు పనిచేయలేకపోయాను. అందుకే ట్రోలింగ్‌కు గురయ్యాను. 2020లో జీఏడీకి పొలిటికల్ విభాగానికి ముఖ్య కార్యదర్శిగా పనిచేశాను. ఆ సమయంలో డీజీపీ కార్యాలయం నుంచి నాకో ఫైలు వచ్చింది. అప్పటి అదనపు డీజీ ర్యాంకు అధికారి ఏబీ వెంకటేశ్వరరావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. ఆ సమస్య ఎలా ఉందంటే.. సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్ ప్రకారం.. ప్రభుత్వ వాహనాన్ని వ్యక్తిగత పనుల కోసం వాడితే ప్రభుత్వానికి తెలియజేసి అదనంగా డబ్బు చెల్లించాలి. కానీ మేం 24 గంటలూ ప్రభుత్వ పనే చేస్తుంటాం. మొబైల్ ద్వారా ఎప్పుడూ అందుబాటులోనే ఉంటాం. ఇంట్లోఉన్నా, బయట ఉన్నా పనిచేస్తూనే ఉంటాం. అందుకే మా జీవితాల్లో ప్రభుత్వం, వ్యక్తిగతం అనే గీతలు లేవు. మాల్‌లో ఉన్నా, వెకేషన్‌లో ఉన్నా.. ఇంకెక్కడ ఉన్నా 24గంటలూ అందుబాటులోనే ఉంటాం. నెలకు 300 కిలోమీటర్లు వ్యక్తిగత అవసరాల కోసం ప్రభుత్వ కారు వాడితే 30 ఏళ్లకు లక్ష కిలోమీటర్లు అవుతుంది. మీ కెరీర్‌లో మొత్తం లక్ష కిలోమీటర్లు ప్రభుత్వ వాహనాన్ని వ్యక్తిగత అవసరాల కోసం వాడారు.. కాబట్టి పెనాల్టీతో రూ.40 లక్షలు చెల్లించాలంటే చట్ట ప్రకారం అది కరెక్టే. చట్టవిరుద్ధమైన పనులు చేసినట్లే! ప్రపంచంలో ఏ కోర్టుకు వెళ్లినా ఈ కేసులో ఊరట లభించదు. కానీ ప్రాక్టికల్‌గా చూస్తే అది తప్పేమీ కాదు. ఇలాంటి సమస్యే ఏబీ వెంకటేశ్వరరావు ఫైలులో ఉంది. నా కంటే 5 ఏళ్లు సీనియర్ అయిన ఐపీఎస్ అధికారి ఫైలు చూసి టెన్షన్ పడ్డాను. చట్ట ప్రకారం ఇది కరెక్టా కాదా అన్న లైన్‌లో పరిశీలించాను. చట్టవిరుద్ధంగా, సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఉందని.. డీజీపీ కార్యాలయం నుంచి వచ్చిన ప్రతిపాదనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చని ఆ ఫైలులో రాశాను. ఆ ఫైలు పరిశీలించడానికి కార్యదర్శి, అదనపు కార్యదర్శి, ఉపకార్యదర్శి ఉన్నారు. ఒక ముఖ్య కార్యదర్శిగా ఆ సమస్యను నేను విలువలు, నైతికత కోణంలో చూడాల్సింది. క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్న వ్యక్తి స్థానంలో ఉండి ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సింది. ఆ ఫైలును తిరస్కరించాల్సింది. అలా చేయకపోవడం కరెక్టు కాదనే ఇప్పుడు అనిపిస్తోంది. ప్రస్తుత సమాజం ఏ సమస్యనైనా మొదట విలువలు, నైతికత కోణాల్లో పరిశీలించాలని కోరుకుంటున్నారు. జాస్తి కృష్ణకిశోర్ ఫైలు విషయంలోనూ ఇదే తప్పు చేశాను. ఈ రెండు ఫైళ్లను నేను నైతికత, విలువల కోణంతో చూసి నిర్ణయం తీసుకోవాల్సింది. అప్పుడు చేయలేదు. అందుకే ఏబీవీ, కృష్ణకిశోర్‌కు ఫోన్‌చేసి వారికి, వారి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాను. నాలో ఉన్న అపరాధ భావన పోగొట్టుకోవడానికి బహిరంగంగా కూడా వారిద్దరికీ క్షమాపణలు చెబుతున్నాను' అంటూ ప్రవీణ్ ప్రకాశ్ ముగించారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

తోట తరణి అరుదైన ఘనత



కళా దర్శకుడు తోటతరణి అరుదైన ఘనత సాధించారు. ఫ్రాన్స్ ప్రభుత్వపు అత్యున్నత పురస్కారమైన 'చెవాలియర్'కు ఎంపికయ్యారు. ఆయన ఈ పురస్కారం సాధించినందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన 'ఘాటి', 'హరి హర వీరమల్లు', 'కుబేర' చిత్రాలతో పాటు 'అతడు', 'గీతాంజలి', 'పుష్పక విమానం', 'సాగర సంగమం' వంటి సూపర్ హిట్స్‌కు ఆయన కళాదర్శకత్వం వహించారు. ఉత్తమ కళాదర్శకత్వం విభాగంలో 'నాయకుడు', 'భారతీయుడు' చిత్రాలకు రెండు సార్లు జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే మూడు నంది పురస్కారాలు దక్కించుకున్నారు. 2001లో పద్మశ్రీ అవార్డును స్వీకరించారు. చెన్నైలోని ఫ్రెంచ్ కాన్సులేట్‌లో ఈ పురస్కారాన్ని ఆయన నేడు అందుకోనున్నారు. దివంగత నటుడు శివాజీ గణేశన్, తారలు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, షారుక్ ఖాన్, ఐశ్వర్యా రాయ్ తదితరులు గతంలో 'చెవాలియర్' అవార్డును అందుకున్నారు.

హీమ్యాన్ ఇంటికి వచ్చేశారు!



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర ఆరోగ్య పరిస్థితి గురించి కొన్ని రోజులుగా ఆందోళన చెందిన వారంతా ఊపిరిపీల్చుకుంటున్నారు. కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న ఆయన బుధవారం ఉదయం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ధర్మేంద్రను ఇంటికి తరలించాలని కుటుంబసభ్యులు నిర్ణయించుకున్నట్లు ఆయనకు చికిత్స అందించిన ప్రతీత్ సందానీ తెలిపారు. ఇంటి వద్దే ఆయనకు చికిత్సను కొనసాగిస్తామని చెప్పారు. అక్టోబరు 31న శ్వాస సంబంధిత సమస్యతో ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పతిలో ధర్మేంద్ర చేరిన సంగతి తెలిసిందే.

ఆ బాలనటికి క్షమాపణలు చెప్పిన ఆర్జీవీ




శివ సినిమా రీ రిలీజ్ సందర్భంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అందులో నటించిన బాల నటి సుష్మకి సారీ చెప్పారు. సైకిల్ ఛేజ్ సీక్వెన్స్‌లో నటించిన ఆ అమ్మాయి ఇప్పుడెలా ఉందో తెలియజేస్తూ ఆమె ఫొటోను షేర్ చేశారు. 'సుష్మ.. నువ్వు సాహసోపేతమైన సన్నివేశాల్లో నటించావు. ఆ రిస్కీ షాట్‌తో నువ్వు ఎంతగా భయపడ్డావో దర్శకుడిగా అప్పుడు నాకు తెలియదు. ఇప్పుడు మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నా. అంగీకరించు' అని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఇందులో హీరో నాగార్జున అన్న కూతురి పాత్రలో సుష్మ నటించింది. సినిమాలోని ముఖ్యమైన సన్నివేశాల్లో ఈ సన్నివేశం ఒకటిగా నిలిచింది. ఈ నెల 14న 'శివ' మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తున్న సంగతి తెలిసిందే.

కాంత రూపంలో మా కోరిక తీరింది

– దుల్కర్ సల్మాన్, రానా



'కాంత' సినిమా మా ఇద్దరికీ చాలా ప్రత్యేకం. ఇండస్ట్రీ మాకు చాలా ఇచ్చింది. ఇలాంటి మంచి చిత్రంతో ఇండస్ట్రీ రుణం కొంతైనా తీర్చుకునే అవకాశం దక్కిందని భావిస్తున్నాం. అలాగే మేమిద్దరం కలసి ఓ సినిమా చేయాలని చాలా కాలంగా అనుకుంటున్నాం. 'కాంత' రూపంలో ఆ కోరిక తీరింది. ఇందులో మా పాత్రలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతాయి' అని దుల్కర్ సల్మాన్, రానా అన్నారు. వారిద్దరూ ప్రధాన పాత్రలు పోషిస్తూ, నిర్మించిన చిత్రం 'కాంత'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్, రానా మీడియాతో ముచ్చటించారు. దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ 'కథ విన్న వెంటనే ఈ సినిమా చేయాలనుకున్నాం. దర్శకుడు సెల్వ తన విజన్‌తో సినిమాను అద్భుతంగా క్రియేట్ చేశారు. ఇందులో నా నటన ఎలా ఉంటే బావుంటుందో దర్శకుడు, నేనూ చర్చించి ఒక నిర్ణయానికి వచ్చేవాళ్లం. రానా, సముద్రఖని, భాగ్యశ్రీ తమ పాత్రలకు పరిపూర్ణత చేకూర్చారు. ఈ సినిమాను తెరకెక్కించే క్రమంలో ఒక మ్యాజిక్ క్రియేట్ అయింది. కాంత నా కెరీర్లో ప్రత్యేక చిత్రం. ఇలాంటి సినిమా చేసే అవకాశం జీవితంలో ఒక్కసారే వస్తుంది' అని చెప్పారు. రానా మాట్లాడుతూ "అందరూ అనుకుంటున్నట్లు 'కాంత' చిత్రం బయోపిక్ కాదు. అలాంటి అనుమానాలను నివృత్తి చేసే ఆలోచనతో చెన్నైలో ప్రత్యేకంగా ఒక షో వేస్తున్నాం. ఇది పూర్తిగా కల్పిత గాథ. ఇప్పుడు ఇండస్ట్రీలో ఏదైనా జరిగితే వెంటనే అందరికీ తెలిసిపోతుంది. కానీ పాతకాలంలో చాలా తక్కువ మందికి తెలిసేవి. ఆ కాలం నుంచి స్ఫూర్తి పొందిన రాసిన కథ ఇది. గొప్ప వ్యక్తుల జీవితాల్లోని చీకటి కోణం గురించి చెబుతుంది. ఇండస్ట్రీలో దిగ్గజాలైన ఇద్దరు వ్యక్తులు తమ అహంతో గొడవలు పడిన నేపథ్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.



మందాకిని వచ్చేసింది

మహేశ్ బాబు కథానాయకుడిగా దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ 29' నుంచి మరో అప్డేట్ వచ్చేసింది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న ప్రియాంక చోప్రా పాత్ర పేరును, ఆమె ఫస్ట్ లుక్‌ను రాజమౌళి విడుదల చేశారు. మందాకినిగా ఆమె కనిపించనున్నారు. చీరకట్టులో గన్ పట్టుకుని యాక్షన్ మోడ్‌లో ఉన్నారామె. 'భారతీయ సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా పునర్నిర్వచించిన దేశీ గర్ల్ ప్రియాంకకు తిరిగి స్వాగతం. మందాకిని పాత్రలోని భిన్న పార్శ్వాలను చూడడానికి యావత్ ప్రపంచం ఎదురుచూస్తోంది' అని రాజమౌళి పోస్ట్ చేశారు. 'మందాకినికి హలో చెప్పండి' అని ప్రియాంక చోప్రా పేర్కొన్నారు. 'ఇదిగో మందాకిని' అని మహేశ్ కూడా ఈ పిక్‌ను షేర్ చేశారు. కేఎల్ నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



రోషన్ కనకాల కథానాయకుడిగా సందీప్‌రాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. డిసెంబర్ 12న విడుదలవుతోంది. బుధవారం హీరో ఎన్టీఆర్ చేతుల మీదుగా ఈ చిత్రం టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

విజయ్ అంటే ఒక ఆశీర్వాదం: రష్మిక



'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ప్రారంభం నుంచి విజయవంతమయ్యే వరకూ విజయ్ కూడా వ్యక్తిగతంగా ఒక భాగంగా ఉన్నాడు. ప్రతి ఒక్కరి జీవితంలో ఒక విజయ్ దేవరకొండ ఉండాలని నేను కోరుకుంటున్నాను. ఎందుకంటే అదొక ఆశీర్వాదం' అని కథానాయిక రష్మిక మందన్న అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన ఈ చిత్రం సక్సెస్‌మీట్ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'ఈ రోజే 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా చూశాను. చాలా సార్లు కన్నీళ్లు ఆపుకోవాల్సి వచ్చింది. ఈ మధ్యకాలంలో నేను చూసిన గొప్ప చిత్రాల్లో ఇదొకటి. అందరి అమ్మాయిల్లానే రష్మిక కూడా వేధింపులు ఎదుర్కొన్నారు. ఆమె కెరీర్‌లో ఎదిగిన తీరు చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. నన్ను ఎవడైనా ఏమైనా అంటే నేను రివర్స్‌లో వెళ్తాను. కానీ రష్మిక మాత్రం తనను ఎగతాళి చేసినా పట్టించుకోకుండా తన కెరీర్ పైనే ఫోకస్ పెట్టింది. తనొక అద్భుతమైన మహిళ. ప్రపంచం ఏదో ఒక రోజు నీ సత్తా తెలుసుకుంటుంది అని చెప్పాను. అది నిజమైంది' అని ప్రశంసించారు.

కొండారెడ్డి ఆదేశాలతోనే...
వైజాగ్ ప్రేమికులకు మత్తు!

- ఫోన్‌లో సిఫారసు చేసిన వైసీపీ విద్యార్థి నేత
- ర్యాపిడో రైడర్ ముసుగులో మధుసూదన్‌రెడ్డి డ్రగ్స్ దందా
- 25 వరకు రిమాండ్.. నెల్లూరు జైలుకు తరలింపు

విజయవాడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈగల్ బృందాలకు చిక్కిన వైజాగ్ ప్రేమికులు అర్జాల శ్రీవాత్సవ్, హవీలా డిలైట్‌కు వైసీపీ విద్యార్థి విభాగ నేత కొండారెడ్డి, జోగా లోహిత్ యాదవ్ సిఫారసుతోనే మల్లెల మధుసూదన్‌రెడ్డి ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ సమకూర్చాడు. గోవాలో పార్టీకి వెళ్లిన ఈ జంట బెంగళూరు వెళ్లి మధుసూదన్‌రెడ్డి నుంచి డ్రగ్స్ తీసుకున్నారు. ఈ కేసులో ఏ4గా ఉన్న మధుసూదన్‌రెడ్డి అలియాస్ మడ్డీని విజయవాడలోని మొదటి అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. వైజాగ్ జైల్లో ఉన్న పి.కొండారెడ్డికి, మధుసూదన్‌రెడ్డికి ఉన్న బంధాన్ని పోలీసులు రిమాండ్ రిపోర్టులో వివరించారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం కోట మండలం బీరంగి గ్రామానికి చెందిన మల్లెల మధుసూదన్‌రెడ్డి బెంగళూరులో ర్యాపిడో రైడర్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి సుధాకర్‌రెడ్డి 13 ఏళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. మడ్డీ పదో తరగతి వరకు బి.కొత్తకోటలోని సిద్ధార్థ స్కూల్‌లో, ఆ తర్వాత తిరుపతిలో ఇంటర్ చదివాడు. చెన్నైలోని సవిత ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్‌లో చేరాడు. స్నేహితుల ఒత్తిడితో సిగరెట్లు, మద్యం, గంజాయి తాగడం మొదలుపెట్టాడు. ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలోనే స్నేహితులకు డ్రగ్స్ సరఫరా చేసేవాడు. మూడో సంవత్సరంలో హాజరు లేకపోవడంతో పరీక్షలకు అనుమతించలేదు. 2022లో ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లాడు.

హైదరాబాద్‌లో డ్రగ్స్ కేసు

బెంగళూరులో ఉంటున్న మడ్డీ డ్రగ్స్ కోసం వాట్సాప్ ద్వారా నైజీరియన్‌ను సంప్రదించాడు. డ్రగ్స్ సరఫరాదారులు సూచించిన ప్రదేశాల వద్దకు వెళ్లి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకునేవాడు. 2023 మార్చిలో ఇంజనీరింగ్ కళాశాలలో సీనియర్ గురుప్రసాద్, క్లాస్‌మేట్ సంతోష్‌తో కలిసి ఎండీఎంఏ తీసుకుని హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ కేపీహెచ్‌బీ పోలీసులకు దొరికిపోవడంతో ఈ ముగ్గురూ జైలుకు వెళ్లారు. జూన్‌లో బెయిల్‌పై విడుదలైన తర్వాత బెంగళూరు వెళ్లి శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేశాడు. వైజాగ్‌కు చెందిన అర్జాల శ్రీవాత్సవ్.. కొండారెడ్డి, లోహిత్ యాదవ్ ద్వారా డ్రగ్స్ కోసం మడ్డీని సంప్రదించాడు. శ్రీవాత్సవ్‌కు డ్రగ్స్ ఇవ్వాలని కొండారెడ్డి ఫోన్‌లో చెప్పాడు. మధుసూదన్‌రెడ్డి నుంచి 1.07 గ్రాముల ఎండీఎంఏ, వివో ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మధుసూదన్‌రెడ్డికి కోర్టు 25 వరకు రిమాండ్ విధించింది. అతడిని ఎస్కార్ట్ పోలీసులు నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసులో ఏ3గా ఉన్న జోగా లోహిత్ యాదవ్‌ను 3రోజులు కస్టడీకి ఇవ్వాలని మాచవరం పోలీసులు వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది

కర్నూలు బస్సు ప్రమాదం...
వెలుగులోకి మరో బస్సు డాష్ క్యామ్ వీడియో

- సుమారు 20 నిమిషాలు ముందే బైకు ప్రమాదం
- శివశంకర్ మృతదేహాన్ని పక్కకు లాగిన ఎర్రిస్వామి

కర్నూలు క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కర్నూలు శివారులో గత నెల 24న జరిగిన బస్సు ప్రమాద ఘటనకు సంబంధించిన వీడియోలు కొన్ని తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రమాదం జరగక ముందు ఆ మార్గంలో వెళ్లిన ప్రైవేటు బస్సు డాష్ క్యామ్‌లో ఆ దృశ్యాలు నమోదయ్యాయి. బైకు ప్రమాదంలో శివశంకర్ మృతి చెందాడు. నాకు స్వల్ప గాయాలు అయ్యాయి. నేనే శివశంకర్ మృత దేహాన్ని పక్కకు లాగాను' అంటూ మృతుని మిత్రుడు, స్వల్ప గాయాలతో బయటపడ్డ ఎర్రిస్వామి పోలీసులకు చెప్పాడు. ఎర్రిస్వామి ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు ఇప్పటి వరకూ విస్పష్టమైన ఆధారమేదీ లభించలేదు. దీంతో అతను చెప్పిన అంశంపై సందిగ్ధత నెలకొంది. తాజాగా బయటకు వచ్చిన వీడియోతో బైక్ ప్రమాదం ముందే జరిగిందని ఎర్రిస్వామి చెప్పిన మాట నిజమేనని స్పష్టమయింది. ఈ ప్రమాదంలో బైక్ కుడి పక్కకు పడిపోగా... మృతి చెందిన శివశంకర్‌ను ఎడమ వైపునకు లాగిన దృశ్యాలు ఉన్నాయి. కొన్ని బస్సులు, వాహనాలు ఆ బైక్‌ను తప్పించుకుని వెళ్తున్న దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. ఏ ఒక్కరూ రోడ్డుకు ఒకవైపు పడిపోయిన బైకును కానీ, మరోవైపు పడున్న మృత దేహాన్ని కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. వాటి తరువాత అటుగా వెళ్లిన వి.కావేరి ట్రావెల్స్ బస్సు ఆ బైకు పైనుంచి వెళ్లడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. దీంతోపాటు సమీపంలోని ఓ ధాబాలో ఉన్న సీసీ ఫుటేజీ కూడా ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయింది. ఇందులో వి.కావేరి బస్సు నుంచి క్షణాల్లో మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడటం స్పష్టంగా కనిపించింది. రాత్రి 2:44 గంటలకు మంటలు వ్యాపించినట్లు వీడియోలో నమోదయింది.శివ మృత దేహాన్ని స్నేహితుడు ఎర్రిస్వామి రోడ్డు పక్కకు లాక్కొని వస్తున్నప్పుడు సమయం రాత్రి 2:25 గంటలు అయినట్లు కొన్ని వీడియోల్లో కనిపించింది. కాగా.. ప్రమాద ఘటనలో వి.కావేరి ట్రావెల్స్ బస్సు యజమాని వేమూరి వినోద్ కుమార్‌కు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ న్యాయస్థానంలో పిటిషన్ వేసేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.



శివ మృత దేహాన్ని రోడ్డు పక్కకులాగి నిల్చున్న స్నేహితుడు ఎర్రిస్వామి

కేంద్ర నిధులన్నీ 10 రోజుల్లో ఖర్చు చేయండి

» జల వనరుల శాఖకు ఆర్థిక మంత్రి పయ్యావుల ఆదేశం

అమరావతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం విడుదల చేసిన నిధులన్నింటినీ పది రోజుల్లోనే ఖర్చు చేయాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జల వనరుల శాఖను ఆదేశించారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులు పీయూష్‌కుమార్, రొనాల్డ్ రోజ్ తదితరులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం విడుదల చేసిన నిధులు, ఇప్పటివరకూ జరిగిన వ్యయంపై ప్రత్యేకంగా చర్చించారు. ఇచ్చిన నిధులను ఖర్చు చేయడం లేదని కేంద్ర ఆర్థిక శాఖ రాష్ట్రప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తోంది. ప్రధానంగా నిర్వాసితులకు సహాయ పునరావాస కార్యక్రమాల అమలులో జాప్యం వద్దని కేంద్ర ఆర్థిక, జలశక్తి శాఖలు ఆదేశించాయి. ఇచ్చిన నిధులను పోలవరం కోసం తెరచిన ప్రత్యేక ఖాతాలో వేయాలని స్పష్టంచేశాయి. గత జనవరిలో నిర్వాసితుల వ్యక్తిగత ఖాతాల్లో రూ.998 కోట్లను రాష్ట్ర ఆర్థిక శాఖ జమచేసింది. తాజాగా ఇంకో రూ.1,000 కోట్లను వారికి అందజేశారు. కేంద్రం రెండు విడతల్లో రూ.5,052.71 కోట్లు ఇవ్వగా..అందులో 4,324.22 కోట్లను ఆర్థిక శాఖ ప్రత్యేకఖాతాకు జమచేసింది. మరోరూ.728.49కోట్లు దాని వద్దే ఉన్నాయి.

డొంక తిరుగుడు సమాధానమెందుకు?

» మంత్రి నిమ్మల తీరును తప్పుపట్టిన ఆలోచనాపరుల వేదిక

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పిలిచిన టెండర్లను ఎందుకు ఉపసంహరించుకున్నారని ప్రశ్నిస్తే మంత్రి నిమ్మల రామానాయుడు డొంక తిరుగుడు సమాధానం చెప్పారంటూ ఆలోచనాపరుల వేదిక ఆరోపించింది. బుధవారం ఈ మేరకు ఏబీ వెంకటేశ్వరరావు, కంభంపాటి పాపారావు, అక్కినేనిభవానీప్రసాద్,టి.లక్ష్మీనారాయణ, నలమోతు చక్రవర్తి, జొన్నలగడ్డ రామారావు పేరుతో ప్రకటన విడుదలచేసింది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు సరికాదని వేదిక మొదటినుంచీ చెపుతోందని పేర్కొంది.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత యూపీఎస్సీ కోచింగ్

» నేటి నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు యూపీఎస్సీ సివిల్స్ ఉచిత శిక్షణ ఇస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్రంలో 340 మందికి ఉచిత శిక్షణ అందించనున్నట్టు పేర్కొన్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిసెంబరు 10 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 10వ తేదీ వరకు నాలుగు నెలల పాటు నిర్వహించే శిక్షణలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నామని తెలిపారు. అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని, మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఏపీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని మంత్రి సూచించారు.

వీఐటీ మారిషస్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

చెన్నై, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) మారిషస్ ప్రాంగణంలో.. 2026 విద్యాసంవత్సరం(ఫిబ్రవరి, ఆగస్టు) ఇంజనీరింగ్ ప్రోగ్రాంలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఔత్సాహికులైన విద్యార్థులు www.vitmauritius.mu లో దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి ప్రవేశ పరీక్ష అవసరం లేదని, హైస్కూలు పనితీరు, వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో నిర్వాహకులు పేర్కొన్నారు. మెరిట్‌తో పాటు అవసరమైన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు కూడా లభిస్తాయని తెలిపారు. విద్యార్థులు తమ అధ్యయన కాలంలో పార్ట్‌టైం జాబ్‌తో పాటు మూడు సంవత్సరాల పోస్ట్-స్టడీ వర్క్ పర్మిట్ కూడా పొందవచ్చని వివరించారు.



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం ఇస్తున్న కృష్ణవేణి (ఫైల్)

పేద మహిళ సొంతింటి కల నెరవేర్చిన పవన్

» ఇంటి కోసం గతేడాది డిప్యూటీ సీఎంకు మహిళ వినతి

» పవన్ ఆదేశాలతో ఇల్లు నిర్మించి తాళాలు అందజేసిన కలెక్టర్

ఆకివీడు రూరల్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ఓ పేదరాలి సొంతింటి కల నెరవేరింది. ఏడాది క్రితం ఆమెకు ఇచ్చిన హామీని పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు గ్రామానికి చెందిన కంకణాల కృష్ణవేణికి తాళ్లకోడులో గత ప్రభుత్వంలో ఇంటిస్థలం మంజూరైంది. కానీ ఇల్లు కట్టుకునే స్తోమత లేకపోవడంతో గతేడాది మంగళగిరి పార్టీ కార్యాలయం వద్ద ఆమె పవన్ కల్యాణ్‌ను కలిసి తన సమస్యను వివరించింది. ఆయన స్పందించి ఆమెకు గృహం నిర్మించి ఇవ్వాలని ఆదేశించారు. దీంతో జిల్లా కలెక్టర్ నాగరాణి తన పరిధిలోని నిధులు రూ.1.50 లక్షలు, హౌసింగ్ నిధులు రూ.1.80 లక్షలతో గృహం నిర్మించి బుధవారం తాళాలు స్వయంగా కృష్ణవేణికి అందజేశారు. దీంతో కృష్ణవేణి సంతోషం వ్యక్తం చేస్తూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది.



కృష్ణవేణి కోసం నిర్మించిన ఇల్లు ఇదే

ప్రతి పేదవాడికీ.. 2029 నాటికి సొంతిల్లు



(మొదటి పేజీ తరువాయి)

చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో బుధవారం జరిగిన ప్రజావేదిక సభ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఇళ్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చాక.. నిధుల లేమి ఇబ్బంది పెడుతున్నా రాష్ట్రవ్యాప్తంగా 3,00,192 ఇళ్లు పూర్తి చేశామన్నారు. పీఎం ఆవాస్ యోజన-లబ్ధిదారుల నేతృత్వంలో 2,28,034, పీఎంఏవై-గ్రామీణ పథకం ద్వారా 65,292, పీఎంఏవై-జన్ మన్ పథకం కింద మరో 6,866 ఇళ్లకు బుధవారం గృహ ప్రవేశాలు జరిగాయని తెలిపారు. పట్టణాల్లో గృహ నిర్మాణాలకు కేంద్రం రూ.2.5 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు ఇస్తోందని, దానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష అందజేస్తున్నామని చెప్పారు. ఇక నుంచి ముస్లిం మైనారిటీలకు కూడా అదనంగా రూ.50 వేలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, బీసీ జనార్దన్‌రెడ్డి, మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ తదితరులు పాల్గొన్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

● కూడు, గూడు, గుడ్డ అన్న నినాదంతో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. ఎన్టీఆర్ దేశంలోనే మొదటగా పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇచ్చారు. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ నేను అధికారంలో ఉన్న ప్రతిసారీ పేదలకు పెద్దఎత్తున ఇళ్లు మంజూరు చేశాను.

● మేం కుటుంబాలను విడగొట్టదలచుకోలేదు. కలపాలనుకుంటున్నాం.. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించేందుకు కుటుంబ పెద్దలు, పిల్లలకు ఉమ్మడిగా ఇళ్లు నిర్మించాలనుకుంటున్నాం. - సీఎం చంద్రబాబు

భ్రష్టు పట్టించారు

గృహ నిర్మాణ రంగాన్ని గత ప్రభుత్వం కుక్కలు చింపిన విస్తరిలా చేసి భ్రష్టు పట్టించింది. ఇచ్చిన ఇళ్లను కూడా పట్టణ ప్రాంతాల్లో ఒక సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంట్లతో అగ్గిపెట్టెల్లాంటి ఇళ్లను మంజూరు చేసింది. అవి కూడా ఊరికి దూరంగా ఎక్కడో కొండలు, గుట్టల్లో ఇచ్చారు. అక్కడ చదును పేరుతో వైసీపీ నాయకులు కోట్లు దోచుకున్నారు. కాలనీల్లో రోడ్లు, నీరు వంటి సౌకర్యాలు కూడా కల్పించలేదు. 4.73 లక్షల ఇళ్లను రద్దు చేయడమే కాకుండా 2.73 లక్షల మందికి రూ.900 కోట్ల మేర డబ్బులు చెల్లించలేదు. ఆ రూ.900 కోట్లను చెల్లించే బాధ్యత కూడా కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది.

జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ కుళాయి

గత ప్రభుత్వం తాగునీటి పథకాలనూ నాశనం చేసింది. కేంద్ర జల్ జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు అందించాలని నిర్ణయించాం. జగన్ పులివెందులకు కూడా నీళ్లు ఇవ్వలేదు.. మేమిస్తాం.

నాడు పెట్టుబడుల మాటేలేదు

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉద్యోగం, పెట్టుబడులు అనే మాటే వినపడలేదు. పారిశ్రామికవేత్తలు పారిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 17 నెలల్లో మెగా డీఎస్సీ ద్వారా 16,347 మందిని ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేశాం. రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాం.

అనుసంధానంతో కరువుకు చెక్

నదుల అనుసంధానం నాజీవిత ఆశయం. సాగునీటి ప్రాజెక్టులను నేనెన్నడూ నిర్లక్ష్యం చేయలేదు. కరువు రహిత రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తాం. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో తాగు, సాగునీటి కొరతలేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అన్నమయ్య జిల్లాలో వెలిగల్లు ప్రాజెక్టు నిండింది. వచ్చే ఏడాదికి శ్రీనివాసపురం రిజర్వాయర్‌ను పూర్తిచేస్తాం.



ముంతాజ్ బేగం గృహంలో వారికి వస్త్రాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

లబ్ధిదారులకు నూతన వస్త్రాలు

చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో పేదల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ముందుగా లబ్ధిదారు హేమలత కుటుంబంతో కలిసి గృహప్రవేశం చేశారు. అనంతరం పూజలో పాల్గొన్నారు. హేమలత, ఆమె భర్త ఈశ్వర్‌కు ముఖ్యమంత్రి కొత్త వస్త్రాలు బహూకరించారు. మరో లబ్ధిదారు ముంతాజ్‌బేగం గృహానికి వెళ్లి.. ఆమె గృహంలో నమాజ్‌లో పాల్గొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు కూడా కొత్త వస్త్రాలు అందించారు. ఆ కుటుంబానికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లిన ఆమె భర్త మహమ్మద్ షరీఫ్ వీడియో కాల్‌లో సీఎంతో మాట్లాడి తన సంతోషాన్ని పంచుకున్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో రాయచోటి నియోజకవర్గంలోని అల్తాఫ్‌బేగం, యలమందు స్వప్న, షేక్ మొహసీన్, అమావాస్యదేవి, ఉయ్యాల అంజనమ్మ అనే మహిళలకు కూడా ఇళ్ల తాళాలను అందజేశారు. ఇంధన పొదుపు పరికరాలను కూడా ఇచ్చారు. అనంతరం సీఎం సమక్షంలో మార్గదర్శి కొణిదల చంద్రకాంత్.. పి.మహబూబ్‌జాన్ బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. ఆమె భర్త పదేళ్ల కిందట మృతిచెందారు.



ర్యాలీలో సైకిల్‌పై హోం మంత్రి వంగలపూడి అనిత

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు: మంత్రి అనిత


» 'అభ్యుదయం' సైకిల్ ర్యాలీని ప్రారంభించిన వంగలపూడి

పాయకరావుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాల జోలికి పోకుండా భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని హోం మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో పోలీస్ శాఖ తలపెట్టిన 'అభ్యుదయం' సైకిల్ ర్యాలీని బుధవారం ఆమె అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రాంభించారు. 'కూటమి ప్రభుత్వం యువతకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. గంజాయిపై ఉక్కుపాదం మోపింది' అని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విశాఖపట్నం రేంజ్ పరిధిలోని అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం, మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో మొత్తం 25 రోజులపాటు, సుమారు 500 కిలోమీటర్ల మేర అభ్యదయం సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. అనితతోపాటు డీఐజీ, ఎస్పీ సైకిల్ తొక్కుతూ పట్టణ శివారు వరకు వెళ్లారు.

పీపీపీ పద్ధతిలోనే వైద్య కళాశాలలు: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల నిర్మాణం పీపీపీ పద్ధతిలోనే చేపడతామని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఉనికికోసమే వైద్య కళాశాలలపై వైసీపీ రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. జగన్ 17 వైద్యకళాశాలలకు అట్టహాసంగా భూమిపూజ చేశారు. కానీ వాటిని ఎందుకు పూర్తి చేయలేదు? అని మంత్రి పేర్కొన్నారు.

'కల్తీ'లో కీలక పాత్రధారి వైవీ సుబ్బారెడ్డే!



I. COW GHEE SPECIAL GRADE WITH AGMARK THORUGH TANKERS (NATIONAL WIDE DAIRIES)

Existing tender conditions	Recommendations of committee members
Condition No.18: The dairy should have been operational at least for the past 3 years	Condition No.18: The dairy should have been operational at least for the past 1 (one) year
Condition No.19: The dairy should have been collecting at least 4,00,000 Ltrs of Cow milk per day for the last one year as evident from their procurement records and returns submitted to FSSAI.	
Condition No.20: It also shall have a processing capacity of minimum of 8 tons cow milk fat/ghee in excess of its market requirement of cow milk fat for liquid milk and other products for the last one year. This shall be evident from the returns submitted to FSSAI	Condition No.19 & 20 to be removed

టీటీడీ నెయ్యి సరఫరాలో నిబంధనల సడలింపునకు 2020లో కమిటీ సిఫారసులు

(మొదటి పేజీ తరువాయి)

టీటీడీకి నెయ్యి సరఫరా నిబంధనలను అడ్డగోలుగా మార్చిన విషయం తాజాగా బయటపడింది. అప్పట్లో టీటీడీ చైర్మన్‌గా సుబ్బారెడ్డే ఉన్నారు. బోర్డులో ఆయన చెప్పిందే ఫైనల్. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు ఆయన సమీప బంధువు కావడంతో ఎవరూ ఎదురు చెప్పలేని పరిస్థితి. అస్మదీయ కంపెనీలకు టెండర్లు కట్టబెట్టడానికి టీటీడీ చైర్మన్ హోదాలో ఆయనే నిబంధనలు మార్చించారు. టెండర్లలో పాల్గొనే డెయిరీల అర్హతలను తగ్గించారు. కనీసం మూడేళ్లు డెయిరీ నిర్వహించి ఉండాలని పాత నిబంధన ఉండగా, దాన్ని ఏడాదికి తగ్గించారు. కనీసం ఏడాది పాటు డెయిరీ ప్రతి రోజు 4 లక్షల లీటర్ల ఆవు పాలు సేకరించడంతో పాటు 8టన్నుల ఆవు పాలు ఫ్యాట్/నెయ్యి ప్రాసెస్ కెపాసిటీ కలిగి ఉండాలని పాత నిబంధనలు ఉండగా, ఈ రెండింటినీ (కండీషన్స్ 19, 20) పూర్తిగా తొలగించారు. డెయిరీ ఏడాది టర్నోవర్‌ను రూ.250 కోట్ల నుంచి 150 కోట్లకు తగ్గించేలా చేశారు. ప్రస్తుత టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అప్పుడు కూడా ఈవోగా ఉన్నారు. నెయ్యి సరఫరా వ్యవహారంలో నిబంధనల మార్పు విషయంలో ఆయన మౌనముద్ర దాల్చారు. సిఫారసులకు ఆమోదం తెలిపారు. అంతిమంగా సుబ్బారెడ్డి మాటే నెగ్గింది. నిబంధనల సడలింపు ఫలితంగా ఊరూపేరూ లేని అనామక డెయిరీలు శ్రీవారి ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసి అపవిత్రం చేసేశాయి. మాస్టర్ ప్లాన్‌లో భాగంగానే కల్తీ నెయ్యి దందా చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణలో నాటి అక్రమాలు వెలుగు చూస్తున్నాయి.

ఏళ్లుగా కఠిన నిబంధనలు

శ్రీవారి ఆలయంతో పాటు టీటీడీ పరిధిలోని ఆలయాలకు నిత్యాన్న ప్రసాదాలకు భారీగా నెయ్యి ఉపయోగిస్తారు. ఈ నెయ్యి సరఫరాకు డెయిరీలు ఎక్కువగా పోటీ పడుతుంటాయి. టీటీడీకి నెయ్యి సరఫరా చేయడం ఆషామాషీ విషయం కాదు. టీటీడీ పిలిచే టెండర్లల్లో పాల్గొనే డెయిరీలకు అనేక అర్హతలు ఉండాలి. కొన్నేళ్లుగా టీటీడీ కఠిన నిబంధనలను అమలు చేసింది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వరకూ తిరుమలేశుని లడ్డూ ప్రసాదాల తయారీలో ఉపయోగించే నెయ్యి సరఫరాకు కొన్ని విధివిధానాలను నిర్దేశించారు. అనామక డెయిరీలు నెయ్యి సరఫరా చేస్తే ప్రసాదం నాణ్యత ఉండదన్న ఉద్దేశంతో బాగా పేరున్న పెద్ద డెయిరీలు టెండర్లు వేసేలా నిబంధనలు ఉండేవి. టీటీడీ పరిధిలోని ఆలయాలతో పాటు తిరుమల శ్రీవారి అన్నప్రసాదాలు, లడ్డూలకు దేశీయ ఆవు నెయ్యినే వాడాలి. ఇందుకు అనుగుణంగా టెండర్ల నిబంధనలను పగడ్బందీగా రూపొందించారు.

వైవీ వచ్చాక...

2020లో వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్ అయిన తర్వాత నెయ్యి సరఫరా 'వ్యవహారం' మొత్తం మారిపోయింది. నెయ్యి కొనుగోలుకు సంబంధించిన కీలక నిబంధనల్లో మార్పు చేసేశారు. ముందుగా టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం ద్వారా ఒక టెక్నికల్ కమిటీని నియమించారు. దీనికి 28.12.2019లో బోర్డు అనుమతి తీసుకున్నారు. ఈ బోర్డు మీటింగ్‌లో నెయ్యి కొనుగోలుకు సంబంధించిన టెండర్లలో మరిన్ని డెయిరీలు పాల్గొనేందుకు అవకాశం కల్పించేందుకు నిబంధనల్లో మార్పులు చేయాలని నిర్ణయించారు. టీటీడీ బోర్డు ఆమోదం మేరకు అప్పటి టీటీడీ సూపరింటెండెంట్ ఇంజనీర్, ప్రొక్యూర్‌మెంట్ జీఎం, ఎస్వీజీఎస్ డైరెక్టర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, టీటీడీ హెల్త్ ఆఫీసర్‌తో పాటు ఐఐఎం లక్నోకు చెందిన ప్రొఫెసర్ వెంకట్రమణయ్య, డెయిరీ ఎక్స్‌పర్ట్ ఎం.విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ కె.జయరాజారావును కమిటీలో నియమించారు. ఈ కమిటీ 23.01.2020లో తిరుమలలోని ప్రొక్యూర్‌మెంట్ జీఎం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసింది. టెండర్ నిబంధనలను రివిజన్‌చేసి, పాత నిబంధనల్లో మార్పులు చేయాలని టీటీడీకి కొన్ని సిఫారసులు చేస్తూ నివేదిక సమర్పించింది. టీటీడీ జాతీయ స్థాయిలో పిలిచే టెండర్లకు కొన్ని నిబంధనలు, రాష్ట్ర, దక్షిణ భారత స్థాయిలో పిలిచే టెండర్లకు కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ మూడు విభాగాల్లో టెండర్ల నిబంధనల్లో ఉన్న కీలకమైన వాటిని ఎత్తేశారు. కీలకమైన షరతులు 19, 20ని తొలగించారు. సదరు కమిటీ సిఫారసుల ఆధారంగానే 2020 నుంచి టీటీడీ నెయ్యి టెండర్లు పిలవడం ప్రారంభించింది. ఇక్కడే కల్తీ నెయ్యి సరఫరాకు బీజం పడింది. అనామక, కనీస అర్హత లేని డెయిరీలు టెండర్లలో పాల్గొన్నాయి.

ఏపీ డెయిరీలకూ మినహాయింపులు

● ఏపీలో ఉన్న డెయిరీలకు సంబంధించిన నిబంధనల్లోనూ మార్పులు చేశారు. ఏడాది క్రితం ఏర్పాటు చేసిన డెయిరీ అయినా పర్వాలేదని మార్చారు.

● డెయిరీ రెండు లక్షల లీటర్ల పాలు సేకరణ చేయాలన్న నిబంధన తొలగించారు.

● ఏపీలో ఉన్న డెయిరీ లేదా మ్యానుఫ్యాక్చరర్ టీటీడీ టెండర్లలో పాల్గొనాలంటే ప్రతి రోజు 3 టన్నుల ఆవు పాల ఫ్యాట్ కొనుగోలు చేస్తున్నట్లు రికార్డులు సమర్పించాలి. ఈ నిబంధన కూడా తొలగించారు.

● డెయిరీ ఏడాది టర్నోవర్‌ను రూ.100 కోట్ల నుంచి రూ.50 కోట్లకు ఉండేలా మార్చారు. అలానే దక్షిణ భారతదేశంలో ఉన్న డెయిరీలకు సంబంధించి కండీషన్ 19, 20లను తొలగించారు. మిగిలిన కండీషన్లలో కీలక మార్పులు చేశారు.

మార్పులకు ఆమోదం


టీటీడీ నియమించిన కమిటీ కొన్ని కీలక సూచనలు కూడా చేసింది. టెండర్లల్లో పాల్గొనే కంపెనీ రెండేళ్లకు ఒకసారి ఎంప్యానల్ కావాలని సూచించింది. ప్రస్తుతం ఉన్న డెయిరీలు, ఆవు నెయ్యి మ్యానుఫ్యాక్చరర్స్ ఆసక్తి కనబరిస్తే వారివద్ద నుంచి సలహాలు తీసుకోవచ్చు. టెండర్ గడువు రెండు లేదా మూడేళ్ల పాటు పెట్టుకోవచ్చు. నిబంధనల్లో మార్పుల సడలింపు, కొత్త నిబంధనలు పెట్టుకునేందుకు ఏడాదికి ఒకసారి సమీక్ష చేయాలి. ఇలా మరికొన్ని సూచనలను కమిటీ టీటీడీకి ఇచ్చింది. కమిటీ ఇచ్చిన సూచనలు, నిబంధనల సడలింపునకు సంబంధించి 2020 ఫిబ్రవరి 18న టీటీడీ పర్చేస్ కమిటీ సమావేశమైంది. ఎక్స్‌ఫర్ట్ కమిటీ చేసిన సిఫారసులను పర్చేస్ కమిటీ ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా ఆమోదించింది. ఇవే సిఫారసులను పర్చేస్ కమిటీ 2020 ఫిబ్రవరి 29వ తేదీన టీటీడీ బోర్డు ముందుకు తీసుకువచ్చింది. నిబంధనల మార్పులకు వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలోని టీటీడీ బోర్డు ఆమోదించింది. ఆ వెంటనే అధికారులు నెయ్యి కొనుగోలుకు సంబంధించిన టెండర్లు ఆహ్వానించారు. అనామక, అర్హత లేని కంపెనీలు టెండర్లలో పాల్గొని కాంట్రాక్టులు దక్కించుకున్నాయి.

నిబంధనల్లో మార్పులు

పాత నిబంధనలు	కమిటీ సభ్యుల సిఫారసులు
కనీసం మూడేళ్ల నుంచి డెయిరీ నిర్వహించి ఉండాలి. (కండిషన్: 18)	ఏడాది క్రితం ఏర్పాటు చేసిన డెయిరీ అయినా పర్వాలేదు
కనీసం ఏడాది పాటు డెయిరీ ప్రతి రోజు 4 లక్షల లీటర్ల ఆవు పాలు సేకరించాలి. దీనికి సంబంధించిన రికార్డులు ఎఫ్ఎస్ఎస్ఏఐకు సమర్పించాలి. (కండిషన్: 19)	ఈ నిబంధన తొలగించాలి.
డెయిరీ కనీసం 8 టన్నుల ఆవు పాలు ఫ్యాట్/నెయ్యి ప్రాసెస్ కెపాసిటీ కలిగి ఉండాలి. దీనికి సంబంధించిన రిటర్న్స్ ఎఫ్ఎస్ఎస్ఏఐకు సమర్పించాలి (కండిషన్ : 20)	ఈ నిబంధన తొలగించాలి.
టెండర్లలో పాల్గొనే డెయిరీ లేదా మ్యానుఫ్యాక్చరర్ ప్రతి రోజు 12 టన్నుల ఆవు పాల ఫ్యాట్ కొనుగోలు చేస్తున్నట్లు రికార్డులు సమర్పించాలి. డెయిరీ కనీసం గత మూడేళ్ల నుంచి నిర్వహణలో ఉండాలి. (కండిషన్ : 21)	కనీసం 8 టన్నులు ఉండాలి. ఏడాది పాటు డెయిరీ నిర్వహణలో ఉన్నా చాలు.
డెయిరీ లేదా టెండర్లలో పాల్గొనే కంపెనీల ఏడాది టర్నోవర్ రూ.250 కోట్లు ఉండాలి. చార్టర్డ్ అకౌంటెంట్ సర్టిఫై చేసిన స్టేట్‌మెంట్‌ను సమర్పించాలి. (కండిషన్ :72)	టెండర్లలో పాల్గొనే కంపెనీల టర్నోవర్ రూ.150 కోట్లు ఉంటే చాలు.

చైర్మన్ ఒత్తిడి తెచ్చారు!

పాలకమండలిలో కొందరు సభ్యులు కూడా.. వారు చెప్పినట్లు చేయాలని ఉన్నత స్థాయి నుంచీ ఆదేశాలు: ధర్మారెడ్డి



తిరుపతి/తిరుపతి (నేరవిభాగం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి సరఫరా విషయంలో అప్పటి టీటీడీ చైర్మన్ (వైవీ సుబ్బారెడ్డి), పాలకమండలిలో కొందరు సభ్యులు ఒత్తిడి తెచ్చారని టీటీడీ మాజీ ఈవో ఏవీ ధర్మారెడ్డి సిట్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. వాళ్లు చెప్పినట్లు నడుచుకోవాలంటూ ఉన్నత స్థాయి నుంచీ ఆదేశాలు వచ్చాయని.. దాంతో మిన్నకుండిపోవలసి వచ్చిందని వెల్లడించినట్లు సమాచారం. ఈ విషయం టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగంతో పాటు జవహర్‌రెడ్డికి కూడా తెలుసని స్పష్టంచేశారని తెలిసింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో సిట్ బుధవారం వరుసగా రెండో రోజు కూడా ఆయన్ను విచారించింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. విశాఖ సీబీఐ డీఐజీ మురళి రాంబా పలు అంశాలపై ధర్మారెడ్డిని సూటిగా ప్రశ్నించినట్లు తెలిసింది. 'నెయ్యి కల్తీ వ్యవహారంలో బాధ్యులెవరు? ఈ వ్యవహారం నడిపించింది ఎవరు? టీటీడీ ఈవోగా పనిచేసిన మీరా.. లేక అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డా? కల్తీ వ్యవహారం తెలిశాక కూడా లడ్డూల తయారీకి ఆ నెయ్యిని మీరెలా అనుమతించారు' అని అడిగినట్లు సమాచారం. ఓ దశలో సహనం కోల్పోయిన ధర్మారెడ్డి.. ఎందుకు పదేపదే ఇవే ప్రశ్నలు వేస్తున్నారని ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. అదనపు ఈవోగా ఉన్న తాను ఈవోగా బాధ్యతలు తీసుకోవడమే తాను చేసిన పాపమా అని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. కల్తీ గురించి తెలిశాక కూడా అదే నెయ్యిని ఎందుకు తెప్పించారని డీఐజీ మళ్లీ అడగడంతో ఆయన ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తంచేసినట్లు సమాచారం. 'ఈ వ్యవహారంలో నా ప్రమేయం లేదు. నన్ను బాధ్యుడిని చేయొద్దు' అని మాజీ ఈవో కోరినట్లు సమాచారం. సిట్ బృందం 9 గంటల పాటు ఆయన్ను ప్రశ్నించింది. ఉదయం 8.30 గంటలకు సిట్ కార్యాలయానికి చేరుకున్న ధర్మారెడ్డిని మొదట మధ్యాహ్నం 2 గంటల వరకూ విచారించారు. భోజనం విరామం తర్వాత తిరిగి 2.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ప్రశ్నించారు. మంగళవారం మధ్యాహ్నం భోజనం కోసం ధర్మారెడ్డి బయటకు వెళ్లిరావడానికి అనుమతించిన అధికారులు.. బుధవారం మాత్రం కార్యాలయానికే భోజనం తెప్పించారు.

కాగా, కల్తీ నెయ్యి కేసులో కీలక నిందితులు, భోలేబాబా అధినేతలు పొమిల్ జైన్, విపిన్ జైన్‌లను సిట్ అధికారులు బుధవారం కూడా విచారించారు. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ సుదీర్ఘంగా ప్రశ్నించారు. నాలుగు రోజులుగా వారిని విచారిస్తున్నారు. ఇంకోవైపు.. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ కదూరు చిన్న అప్పన్న బెయిల్ పిటిషన్‌పై నెల్లూరు ఏసీబీ కోర్టులో విచారణ ఈ నెల 17వ తేదీకి వాయిదా పడింది.

ఎక్కువగా వెజిటబుల్ ఆయిల్ తింటే రిపోర్టు ఇలానే వస్తుంది

» జగన్ సూత్రీకరణలపై తాజాగా సోషల్ మీడియాలో ట్రోలింగ్



అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): 'ఇటువంటి రిపోర్టు ఆవు సీరియస్ అండర్ ఫీడింగ్‌తో ఉన్నప్పుడు... ఆవు సరిగ్గా తిండి తిననప్పుడు... ఆ ఆవు నుంచి పాలు తీసినప్పుడు కూడా ఇటువంటి రిపోర్టు వస్తుంది' అంటూ వైసీపీ అధ్యక్షుడు జగన్ చేసిన వ్యాఖ్యలు తాజాగా సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నాయి. జగన్ సీఎంగా ఉన్న సమయంలో తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారంటూ తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. 2024 ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి ఉన్నట్లుగా బహిర్గతమైంది. దీనిపై ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు స్పందిస్తూ మాట్లాడారు. దీంతో రాష్ట్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జగన్మోహన్‌రెడ్డి వెంటనే తాడేపల్లి ప్యాలెస్‌లో మీడియా సమావేశం నిర్వహించి 'అధిక మొత్తంలో వెజిటబుల్ ఆయిల్స్... సచ్ యాజ్... రిఫైన్డ్ ఆయిల్స్, కాటన్, పామాయిల్ ఇటువంటివి తిన్న పరిస్థితులు ఆ ఆవులో ఉంటే ఈ రిపోర్టులు ఈ మాదిరిగా రావచ్చు' అని వ్యాఖ్యానించారు. తాజాగా తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి ఉందంటూ సిట్ రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న నేపథ్యంలో... మరోసారి ఆనాడు జగన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గతంలో జగన్ మాటలను మరిచిపోయినవారు కూడా తాజా వీడియోను చూసి 'ఔను జగన్ ఇలా అన్నాడేంటి..!' అంటూ ఆశ్చర్యపోతున్నారు.

తప్పు చేశా.. క్షమించండి: ప్రకాశ్ రాజ్

హైదరాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసి తప్పు చేశానని, తనని క్షమించాలని, మరోసారి అలాంటి పొరపాటు చెయ్యనని ప్రముఖ సినీనటుడు ప్రకాశ్‌రాజ్ అన్నారు. బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసులో సిట్ విచారణకు ప్రకాశ్‌రాజ్ బుధవారం హాజరయ్యారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసి తప్పు చేశానని, ప్రజలు క్షమించాలని, మరోసారి ఇలాంటి పొరపాటు చేయనని అన్నారు.

కల్తీ నెయ్యి వెనుక హైకమాండ్ ఎవరో తేలాలి: ఉమ

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఐదేళ్ల పాలనలో వెంకటేశ్వరస్వామి భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించింది. పవిత్రమైన స్వామి వారి ప్రసాదాన్ని కల్తీ చేసింది' అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. 'మాజీ ఈవో ధర్మారెడ్డిని సుమారు 10 గంటలపాటు విచారించగా హైకమాండ్ ఒత్తిడి మేరకే కల్తీ నెయ్యి కొనుగోలు చేశానని అంగీకరించినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. హైకమాండ్ ఎవరో తేలాల్సి ఉంది' అని దేవినేని ఉమా అన్నారు.

బీపీఎస్ గడువు పొడిగింపు

రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల్లో అనుమతి లేకుండా నిర్మించిన భవన నిర్మాణాల క్రమబద్ధీకరణకు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్)-2025 గడువును మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మరోసారి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇదే చివరి అవకాశమని, తర్వాత అనధికార నిర్మాణాలను గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

సచివాలయ పాలన పట్టాలెక్కించాలి

ఆంధ్రజ్యోతి విజిట్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సాధారణంగా ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా కింది స్థాయి నుంచి పై స్థాయి వరకూ ఏ ఉద్యోగి/అధికారికి అయినా నిర్దిష్టమైన విధులు ఉంటాయి. ఆఫీసుకు వెళితే సంబంధిత ఉద్యోగి విధుల్లో ఉన్నారా? లేదా ఫీల్డ్‌కు వెళ్లారా? అన్న విషయం తెలుస్తుంది. కానీ గత జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఇందుకు దాదాపు పూర్తిగా భిన్నం. కొందరు సిబ్బందికి పనిభారం ఎక్కువగా, మరికొందరికి అంతంత మాత్రంగానే ఉంటోంది. ఇంకొందరు ఖాళీగా ఉంటున్నారు. ఆయా కేటగిరీల ఉద్యోగులకు వర్క్ రేషనలైజేషన్ అంతా గందరగోళం. పర్యవేక్షణ లేక చాలా చోట్ల సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. ఎప్పుడొస్తారో, ఎక్కడుంటారో తెలియని పరిస్థితి. సర్వేలు, ఫీల్డ్, ఇతరత్రా పనులు అప్పగించడంతో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. కొందరు నిజంగానే విధులకు వెళ్లగా, మరికొందరు ఈ పేరు చెప్పి డ్యూటీలకు డుమ్మా కొడుతున్నారు. రాష్ట్రంలో చాలా సచివాలయాల్లో పాలన అస్తవ్యస్తంగా ఉంది. ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలు ఇవ్వకపోవడానికి గత జగన్ ప్రభుత్వం ఓ ప్రణాళిక అంటూ లేకుండా తీసుకురావడమే కారణం. కూటమి ప్రభుత్వం వచ్చాక మార్పులు చేసినా వ్యవస్థ గాడిన పడటం లేదు. 'ఆంధ్రజ్యోతి' రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయాల పనితీరును పరిశీలించింది. జిల్లాల వారీగా ప్రస్తుత పరిస్థితి ఇదీ...

కర్నూలు జిల్లాలో..



కర్నూలు జిల్లా పత్తికొండలోని మూడో సచివాలయంలో మధ్యాహ్నం 12:04 గంటల సమయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కర్నూలు జిల్లాలో పలు సచివాలయాల్లో ముగ్గురు, నలుగురు సిబ్బంది మాత్రమే పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. మిగతా ఉద్యోగులకు ఒకటో తేదీ పింఛన్ పంపిణీ తప్ప మిగిలిన రోజుల్లో పెద్దగా పనులు లేవు. కౌతాళం మండలం బాపురం సచివాలయంలో 9 మంది సిబ్బందికి గానూ గ్రామ సర్వేయర్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, మహిళా పోలీస్‌ను మాత్రమే నియమించారు. మిగిలిన ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ నలుగురిలో మహిళా పోలీస్ తిరుపతిబాయి ఒక్కరే విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు మిగిలిన ముగ్గురు విధులకు హాజరు కాలేదు. గ్రామస్థులను విచారిస్తే మహిళా పోలీస్ మినహా మిగిలిన ఉద్యోగులు ఎప్పుడొస్తారో తెలియదని అంటున్నారు. పత్తికొండ నియోజకవర్గ కేంద్రంలోని మూడో సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. 11.30 గంటల వరకు సిబ్బంది కార్యాలయానికి హాజరు కాలేదు.

శ్రీసత్యసాయి జిల్లాలో...

జిల్లాలో చాలా సచివాలయాల్లో ఉదయం 11గంటలైనా సిబ్బంది విధులకు హాజరు కాలేదు. కొందరు బయోమెట్రిక్ వేసి.. విధుల పేరిట బయటకు వెళ్లిపోయారు. ధర్మవరం మండలం మల్లాకాల్వ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్ మాత్రమే కనిపించారు. చెన్నేకొత్తపల్లి సచివాలయం-2 తలుపులు ఉదయం 10-30గంటలైనా తెరుచుకోలేదు.

పార్వతీపురం మన్యం జిల్లాలో..

జిల్లాలో 312 గ్రామ, 38 వార్డు సచివాలయాలు ఉన్నాయి. పార్వతీపురం నియోజకవర్గం అడ్డాపుశీల సచివాలయ గ్రామ సర్వేయర్ నెల రోజులుగా విధులకు హాజరు కావడం లేదు. కనీసం సెలవు కూడా పెట్టలేదు. పాలకొండ నియోజకవర్గం లివిరి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన ఉద్యోగులు కనిపించలేదు. సాలూరు నియోజకవర్గం మక్కువ ఒకటో నంబర్ సచివాలయంలో 8 మంది ఉద్యోగులకు వీఆర్వో ఒక్కరే కార్యాలయంలో ఉన్నారు.

ప్రకాశం జిల్లాలో..



ఒంగోలు హౌసింగ్ బోర్డు కాలనీలోని సచివాలయానికి 10.40 గంటల సమయంలో ఒక్కరు మాత్రమే విధులకు హాజరు

ప్రకాశం జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో మొత్తం 6,122 మంది పనిచేస్తున్నారు. మహిళా పోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వంటి వారికి పెద్దగా పనేమీ లేదు. వ్యవసాయ, వెటర్నరీ, సర్వే అసిస్టెంట్లకు పరిమితంగా పనులు ఉంటున్నాయి. సర్వేల పేరుతో యంత్రాంగం కూడా సచివాలయ సిబ్బందిని గందరగోళం చేస్తోంది. ఎప్పుడు ఏ సర్వే వస్తుందో, ఎవరికి ఏ బాధ్యత ఇస్తారో, ఆ సర్వే కోసం సిబ్బంది ఏ సమయంలో ఎక్కడ పనిచేస్తారో స్పష్టత లేదు. దీంతో చాలామంది సర్వేల పేరుతో కార్యాలయాలకు దూరంగా ఉంటున్నారు. చాలా సచివాలయాల్లో ఇద్దరు, ముగ్గురు మించి సిబ్బంది కనిపించడం లేదు.

విశాఖపట్నం జిల్లాలో...

విశాఖపట్నం జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది అంతా ప్రస్తుతం రకరకాల సర్వేలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 14 రకాల సర్వేలు జరుగుతున్నాయి. దాంతో అత్యధికులు క్షేత్రస్థాయి విధులకు వెళుతున్నారు. జీవీఎంసీ పరిధిలో 572 వార్డు సచివాలయాలు ఉండగా, 4,386 మంది పనిచేస్తున్నారు. వీరిలో 225 మంది వివిధ కారణాలతో విధులకు దీర్ఘకాలంగా హాజరుకావడం లేదు. కొన్ని కేటగిరీల ఉద్యోగులకు తగిన పని లేదు.

కృష్ణా జిల్లాలో...

జిల్లాలో 508 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. అడ్మిన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ మినహా మిగిలిన వారెవ్వరూ అందుబాటులో ఉండటం లేదు. రీగ్రూపింగ్ తరువాత వీఆర్వో, ప్లానింగ్, వ్యవసాయ, ఎమినిటీ సెక్రటరీలతో పాటు ఏఎన్ఎం రెండేసి సచివాలయాల్లో పనిచేయాల్సి వస్తోంది. దీంతో వీరు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియని పరిస్థితి. మహిళా పోలీసులు ఎక్కడ ఉంటున్నారో తెలియట్లేదు. కొందరు సర్వేయర్లు 2 గంటలు విధులు నిర్వహించి మిగిలిన 6 గంటలు ప్రైవేటు పనులు చేస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో...

జిల్లాలో కొన్ని కేటగిరీల సచివాలయ ఉద్యోగులపై సర్వేల పేరుతో, ఇతరత్రా మోపుతున్న పనులతో పని భారం ఎక్కువగా ఉంటోంది. మరికొన్ని కేటగిరీ పోస్టులకు పని చాలా తక్కువగా ఉంటోంది. విజయవాడ నగరంలోని 287 వార్డు సచివాలయాల పరిధిలో 250 మంది శానిటరీ సెక్రటరీలు ఉన్నారు. నగరంలో ప్రజారోగ్యశాఖ పరిధిలో అతిపెద్ద శానిటరీ వ్యవస్థ ఉన్నందున వీరి సేవలు దాదాపుగా అవసరం లేదనే చెప్పవచ్చు. వీరిని ఖాళీలు ఉన్న చోట అవసరాలకు అనుగుణంగా వాడుకోవచ్చు.

నంద్యాల జిల్లాలో...



నంద్యాలలోని 15వ సచివాలయంలో ఉదయం 10.30 గంటల సమయంలో ఎనిమిది మందికి గానూ హాజరైన ముగ్గురు సిబ్బంది

నంద్యాల జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పలు చోట్ల మధ్యాహ్నానికే ఇంటికి వెళ్తున్నారు. నంద్యాల పట్టణంలోని సరస్వతి నగర్‌లోని 15వ సచివాలయంలో 8 మంది ఉద్యోగులు పని చేయాల్సి ఉండగా.. 10.30 గంటలైనా ముగ్గురు ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు. నంద్యాల పట్టణంలో 48 వార్డు సచివాలయాలు ఉండగా.. 409 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 10.30 గంటల వరకు వీరిలో 60 శాతం మాత్రమే ముఖ హాజరు వేశారు. మిగిలిన 40శాతం మంది ఎప్పుడు పడితే అప్పుడు హాజరు వేసినట్లుగా నమోదైంది. విధులకు వచ్చిన తరువాత ఇతరత్రా సర్వేల పేరుతో చాలా మంది బయటికి వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 4,353 మంది పని చేస్తుండగా, 2,788 మంది మాత్రమే ముఖ హాజరు వేసినట్లు నమోదైంది. 523 మంది ఉద్యోగులను వివిధ సచివాలయాలు, ప్రాంతాలు, కార్యాలయాల్లో డిప్యుటేషన్‌పై పని చేయిస్తున్నారు.

కడప జిల్లాలో..



కడప జిల్లా చి.మరం మండలం పోమిరెడ్డిపల్లె సచివాలయం-3లో 8 మంది సిబ్బందికి ఇద్దరే హాజరు

జిల్లాలో 423 గ్రామ, 222 వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 5,383 మంది పనిచేస్తున్నారు. సచివాలయాల్లో ఉద్యోగులు ఫుల్.. పనులు నిల్ అన్నట్లుగా పరిస్థితి తయారైంది. సిబ్బందికి తగ్గట్లుగా పనులు లేవు. ఫీల్డ్ విజిట్ అంటూ కొందరు బయటనే కాలం గడుపుతూ మధ్యాహ్నానికి కార్యాలయాలకు వస్తున్నారు. మహిళా పోలీసు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు అసలు పనే ఉండడం లేదు. కొన్ని కేటగిరీల ఉద్యోగులకు పనిభారం ఉండగా, ఇంకొందరికి పెద్దగా పనిలేదు.

తిరుపతి జిల్లాలో...



తిరుపతి జిల్లా డక్కిలి మండలం పలుగోడు సచివాలయంలో ఖాళీగా కుర్చీలు

జిల్లాలో కొన్ని చోట్ల క్లస్టర్ పరిధిలోకి ఒకటికి మించి సచివాలయాలు వస్తున్నాయి. కొందరు ఉద్యోగులు క్లస్టర్ పరిధిలో రెండు చోట్ల విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. దీంతో ఆయా ఉద్యోగులు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియక జనం ఇబ్బంది పడుతున్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, ఫిషరీస్, వెటర్నరీ అసిస్టెంట్‌లకు. కేవలం రబీ, ఖరీఫ్, మామిడి కోతల సమయాల్లోనే పని ఉంటోంది. చాలా సచివాలయాల్లో ఒకరిద్దరు సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి మండలం పలుగోడు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్ మినహా ఇతరులు లేరు. పంచాయతీ కార్యదర్శి గదిలోని టేబుల్‌పై ఫైళ్లన్నీ చిందరవందరగా పడివున్నాయి.

అన్నమయ్య జిల్లాలో..



అన్నమయ్య జిల్లా వీరబల్లి సచివాలయంలో ఇద్దరు సిబ్బంది మాత్రమే హాజరైన దృశ్యం

రీగ్రూపింగ్ విధానంతో కొన్ని శాఖల సిబ్బందిపై పని భారం పడుతోంది. మిగిలిన కొందరికి ఎటువంటి పని భారం ఉండడం లేదు. తాపీగా సచివాలయాలకు వచ్చి రోజుకు ఒకరో.. ఇద్దరో ప్రజలు వస్తే వారితో మాట్లాడి ఇంటికి వెళ్లిపోతున్నారు. కొందరు సిబ్బంది మాత్రం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చడంతో పాటు వివిధ సర్వేలతో సతమతమవుతున్నారు. చాలాచోట్ల సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. రాజంపేట పట్టణం 11వ వార్డు సాయినగర్ సచివాలయంలో 9 మంది సిబ్బందికి గానూ ఐదుగురు మాత్రమే హాజరయ్యారు.

తూర్పు గోదావరి జిల్లాలో..

జిల్లాలో 512 సచివాలయాలు ఉన్నాయి. 4,278 ఉద్యోగులు పనిచేస్తున్నారు. పలు సచివాలయాల్లో ఏ ఉద్యోగి ఎక్కడికి వెళుతున్నారనే సమాచారం ఉండడం లేదు. శానిటేషన్, మహిళా పోలీస్, ఏఎన్ఎంలు ఖాళీగా ఉంటున్నారు. కొన్ని చోట్ల మహిళా పోలీసులు ఉదయం వచ్చి సంతకం పెట్టి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మళ్లీ సాయంత్రం వచ్చి సంతకం పెడుతున్నారు. ఏఎన్ఎంల పరిస్థితి ఇలాగే ఉంది. ఫీల్డ్‌లో ఉన్నామని చెబుతుంటారు. వీఆర్వోలు ఎక్కడ ఉంటున్నారో ఎవరికీ తెలియని పరిస్థితి. సర్వేయర్లు పూర్తి స్థాయిలో పనిచేయడంలేదు.

అనంతపురం జిల్లాలో...



అనంతపురంలోని 41వ వార్డు సచివాలయంలో 11 గంటలకు ఖాళీగా కుర్చీలు

అనంతపురం నగరంలోని 40, 41వ వార్డు సచివాలయ ఉద్యోగులు ఉదయం 11 గంటలైనా సచివాలయానికి రాలేదు. ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. మిగతావారి గురించి ఆరా తీస్తే.. ఫీల్డ్‌లో ఉన్నారని చెప్పారు. చాలామందికి పనిలేకపోవడంతో హాజరు వేసి బయటికి వెళ్లిపోతున్నారని చెప్పారు. శింగనమల నియోజకవర్గ కేంద్రంలోని సచివాలయ ఉద్యోగుల తీరు మరీ దారుణంగా ఉంది. ఉదయం 10.30 గంటలైనా ఏ ఒక్కరూ సచివాలయానికి రాలేదు. కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఆ తరువాత గ్రామ రెవెన్యూ అధికారి వచ్చారు. ఈ సచివాలయంలో 10 మంది ఉద్యోగులు ఉండగా.. మధ్యాహ్నానికి ఐదుగురే విధులకు హాజరయ్యారు.

నెల్లూరు జిల్లాలో...



నెల్లూరు నగర పరిధిలోని పద్మావతి గ్రీన్‌సిటీలో ఉన్న 13/1 సచివాలయంలో ఖాళీగా కుర్చీలు

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో పలు చోట్ల సిబ్బంది సరిగా విధులకు రావడంలేదు. నెల్లూరు నగర పరిధిలోని ఒక సచివాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉదయగిరి సచివాలయం-2లో ఇద్దరు మాత్రమే విధులకు హాజరయ్యారు. వరికుంటపాడు మండలం తోటలచెరువుపల్లిలో ముగ్గురు మాత్రమే కనిపించారు. వీఏవో 12 గంటలకు సచివాలయం నుంచి సెలవు తీసుకోగా, మహిళా పోలీస్, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు మిగిలారు.

అల్లూరి జిల్లాలో...

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గ్రామ సచివాలయాలపై పర్యవేక్షణ లోపించడంతో ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదు. ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ప్రజలు పదే పదే సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. చాలా తక్కువ సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. మిగిలిన సిబ్బంది ఏమి చేస్తున్నారనే దానిపై స్పష్టత లేని పరిస్థితి. అనేకచోట్ల అటెండెన్స్ సక్రమంగా వేయకపోవడం, తమ పర్యటన వివరాలు నమోదు చేయకపోవడం చేస్తున్నారు. డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్లకు పని అధికంగా ఉండగా.. మహిళా పోలీస్, వ్యవసాయ/ఉద్యానవన అసిస్టెంట్, సర్వేయర్లకు పని లేని పరిస్థితి.

గుంటూరు జిల్లాలో...

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో 4,979 మంది సిబ్బంది ఉండగా, 2 వేలమందికి మాత్రమే పనిఉంది. రీసర్వే కారణంగా విలేజ్ సర్వేయర్, వీఆర్‌ఓలకు పనులు ఉంటున్నాయి. సర్వే పూర్తయితే వారు ఖాళీగానే ఉండాల్సిన పరిస్థితి. గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో ఉండే సిబ్బందిని గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, సీఆర్డీఏ, టాటా ఇన్నోవేషన్ హబ్ వంటి చోట్ల విధుల్లోకి తీసుకున్నారు. దీంతో వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లపై భారం పడుతోంది. ఇలా రెండు చోట్ల విధుల్లో ఉండే పలువురు ఉద్యోగులు అక్కడ ఉన్నామని చెప్పి ఇక్కడ, ఇక్కడ ఉన్నామని చెప్పి అక్కడ విధులకు గైర్హాజరవుతున్న సందర్భాలు ఉన్నాయి. మరికొంత మంది ఫీల్డ్ విజిట్ పేరుతో ఆఫీసుకు రావడం లేదు.

కోనసీమ జిల్లాలో...

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని చోట్ల ఉద్యోగులు హాజరు వేయించుకుని క్యాంపుల పేరుతో బయటకు వెళ్లిపోతున్నట్టు తెలుస్తోంది. కొన్ని చోట్ల ఫిషరీస్, వెటర్నరీ, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు పనులు తక్కువగా ఉన్నాయి. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లను అదనపు పనులకు నియమిస్తున్నారు. దాంతో ఎవరు ఎక్కడ పనిచేస్తున్నదీ స్పష్టత లేదు. మహిళా పోలీసులకు శిక్షణ లేకుండా డిజిటల్ అసిస్టెంట్లుగా పనులు అప్పగించారు. తుఫాన్‌తో పంటనష్టాలను వ్యవసాయ, ఉద్యాన శాఖలకు చెందిన అసిస్టెంట్లను గ్రామస్థాయిలో వినియోగించి మదింపు చేశారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పల్లవారిపాలెం సచివాలయంలో కార్యదర్శి ఒక్కరే అందుబాటులో ఉన్న దృశ్యం

ఏలూరు జిల్లాలో...



ఏలూరులోని ఇశ్రాయలుపేట సచివాలయంలో విధి నిర్వహణలో సచివాలయ ఉద్యోగులు

ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలో చాలాచోట్ల సచివాలయాల సెక్రటరీలు లేరు. వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు 85 శాతం మందే ఉన్నారు. ఏఎన్ఎంలు గ్రామ సచివాలయాల్లో కనిపించట్లేదు. ఉదయం పూట పిల్లలకు టీకాలు, గర్భిణుల వివరాల నమోదుకు ఎక్కువగా వెళ్లాల్సి ఉందని చెబుతున్నారు. సర్వేయర్లు అందుబాటులో ఉండట్లేదు. ఏలూరు ఇశ్రాయల్‌పేటలోని సచివాలయంలో ఏఎన్ఎం ఏడాదిగా రూ.6 వేల సొంత ఖర్చుతో డేటా పుస్తకాలు కొని నిర్వహిస్తున్నారు.

బాపట్ల జిల్లాలో...

జిల్లాలో 475 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. 3,500 మంది ఉద్యోగులు ఉండగా, సిబ్బంది సర్దుబాటు విషయంలో పొరుగు జిల్లాల్లో అదనంగా ఉన్న 60 మందిని ఇక్కడకు డిప్యుటేషన్‌పై తీసుకొచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. జనాభాతో పాటు స్థానిక స్థితిగతుల ఆధారంగా సచివాలయాల్లో సిబ్బంది సర్దుబాటు ఉండాలన్న నిబంధన అమలవుతున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. విధుల కేటాయింపులో స్పష్టత లేదు. సర్వే పేరిట ఫీల్డ్ వర్క్‌పైనే సిబ్బందిలో ముగ్గురు వరకు బయట తిరగాల్సిన పరిస్థితి. పంచాయతీల పరిధిలోని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు మినహా ఎవరికీ పని విషయంలో స్పష్టత లేదు.

పల్నాడు జిల్లాలో...

పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలో గ్రామ సచివాలయాల్లోని 212 సిబ్బందిలో 83 మంది సెలవు పెట్టారు. వినుకొండ మండలంలోని పెద్దకంచర్ల సచివాలయంలో ఉదయం 11 గంటలకు ఇద్దరు సిబ్బంది మాత్రమే వచ్చారు. మాచర్ల పట్టణం శుద్ధగుంతల సచివాలయంలో ఆరుగురికి ఇద్దరు మాత్రమే విధుల్లో ఉన్నారు. వెల్దుర్తి మండలం మండాది సచివాలయంలో ఉదయం 10:45 గంటలకు వీఆర్వో మాత్రమే విధులకు హాజరయ్యారు. మండల పరిధిలో 95 మంది సిబ్బందిలో ఉదయం 11:41 గంటలకు 38 మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు వేశారు. విజయపురిసౌత్-2లో ఆరుగురికి గాను ముగ్గురు మాత్రమే హాజరయ్యారు.



నరసరావుపేట మండలం ములకలూరు సచివాలయంలో ఖాళీగా కుర్చీలు

చిత్తూరు జిల్లాలో...

సచివాలయాల రీగ్రూపింగ్‌తో చిత్తూరు జిల్లాలో సత్ఫలితాలు వస్తున్నాయి. గతంలో సచివాలయాల్లో లెక్కకు మించి ఉద్యోగులు ఖాళీగా ఉండేవారు. ఇప్పుడు మహిళా పోలీసులు తప్ప మిగిలిన వారంతా పనుల్లో బిజీగా ఉన్నారు. జిల్లాలో 4,088 మంది సచివాలయ సిబ్బంది పనిచేస్తుండగా, వైసీపీ హయాంలో వెయ్యి పోస్టుల లోటు ఉండేది. రీగ్రూపింగ్ వల్ల ప్రస్తుతం 917 పోస్టులు మిగులులో ఉన్నాయి.

విజయనగరం జిల్లాలో..

విజయనగరం జిల్లాలో పలు సచివాలయాల్లో ఉదయం 10.30 గంటలకు పలువురు సిబ్బంది హాజరు వేసుకుని ఫీల్డ్‌వర్క్ అంటూ బయటకు వెళ్తున్నారు. విజయనగరంలోని కేఎల్ పురం 55వ సచివాలయంలో పదిమంది సిబ్బందికి గాను ఓ పోస్టు ఖాళీగా ఉండగా ఉదయం 11.30 గంటలకు నలుగురు మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన వారు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారని తోటి సిబ్బంది తెలిపారు.

కాకినాడ జిల్లాలో...

జిల్లాలో పలు చోట్ల ఉదయం 11 గంటలు దాటినా ఒకరిద్దరు మినహా మిగిలిన వారి జాడే కనిపించలేదు. అడిగితే ఫీల్డ్ వర్క్‌కు వెళ్లారంటూ సమాధానం వచ్చింది. సామర్లకోట నీలమ్మచెరువు వద్ద ఉన్న సచివాలయం, పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న సచివాలయాల్లో అడ్మిన్‌లు మినహా ఇతర సిబ్బంది కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. అనేక సచివాలయాల్లో సిబ్బంది సమాచారం ఇవ్వకుండా సెలవులపై వెళ్తున్నారు. ప్రస్తుతం రీసర్వే తప్పిదాలు అధికంగా ఉండటంతో జిల్లావ్యాప్తంగా సర్వేయర్లపై ఒత్తిడి ఉంది.

శ్రీకాకుళం జిల్లాలో...

జిల్లాలో 6,416 మంది విధులు నిర్వహిస్తున్నారు. చాలా చోట్ల పూర్తిస్థాయిలో సిబ్బంది హాజరు కాలేదు. ఒక్కో సచివాలయంలో ఇద్దరు, ముగ్గురు మాత్రమే ఉన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం, మామిడివలస మేజర్ పంచాయతీల్లో సిబ్బంది అందుబాటులో ఉండట్లేదని స్థానికులు చెప్పారు. రెండేసి సచివాలయాలకు ఒకరే సిబ్బంది కావడంతో మరింత ఇబ్బంది ఉంది.



సాగరతీరంలో వెల్‌కమ్ గూగుల్ సైకత శిల్పం

సాగర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుండడంతో కళాకారుడు కోట అప్పలనరసింహం రుషికొండ బీచ్‌లో 'వైజాగ్ వెల్‌కమ్ గూగుల్ సైకత శిల్పాన్ని బుధవారం రూపొందించాడు. దీనిని తిలకించేందుకు సందర్శకులు ఆసక్తి కనబరుస్తున్నారు.

44 వేల కోట్లతో గ్రీన్ అల్యూమినియం ప్లాంట్

- ఉప్పాడలో ఏఎంజీ మెటల్స్, మెటీరియల్స్ సంస్థ ఏర్పాటు
- ప్రోత్సాహకాలను ప్రకటించిన పరిశ్రమల శాఖ

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో ప్రఖ్యాత పరిశ్రమ ఏర్పాటుకు ముందడుగు పడింది. కాకినాడ జిల్లా ఉప్పాడలో రూ.44,000 కోట్ల పెట్టుబడితో గ్రీన్ అల్యూమినియం యూనిట్‌ను ఏఎంజీ మెటల్స్ అండ్ మెటీరియల్స్ సంస్థ స్థాపించనుంది. ఏటా ఒక మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఆ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతిస్తూ పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ బుధవారం ఉత్తర్వు జారీచేశారు. ఈ ప్లాంటు స్థాపనతో 3,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. 2029-30 నాటికి ఉత్పత్తిని ప్రారంభిస్తుంది. ఈ ప్లాంటు కోసం 250 ఎకరాలను మార్కెట్ ధరకు కేటాయిస్తారు. ఏటా రూ. 33.12 కోట్ల పరిమితికి మించకుండా ఎలక్ట్రిసిటీ డ్యూటీ, స్టాంపు డ్యూటీని మినహాయిస్తారు. కాగా, రాష్ట్రంలో విమానాశ్రయాల నిర్మాణాలకు భూ సేకరణ, మౌలిక సదుపాయాల కల్పన కోసం హడ్కో నుంచి ఎయిర్ పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ రూ.1000కోట్ల తీసుకునేందుకు ప్రభుత్వం గ్యారెంటీని ఇచ్చింది.

ఐటీ కంపెనీలకు ప్రోత్సాహకాలు విడుదల

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ప్రోత్సాహకాలు మంజూరుచేస్తూ రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీచేశారు. మదర్సన్ టెక్నాలజీ సర్వీసెస్, క్రెయాన్ టెక్నాలజీ సర్వీసెస్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఎపిటోన్ కార్పొరేషన్స్, కె.రహేజా గ్రూప్, ఎన్ఎస్‌పీఎల్, ఏపీ క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ, క్వార్క్స్ టెక్నాలజీస్, అమరావతి నైబర్‌హుడ్, ఇండిచిప్ సెమీకండక్టర్, విశాఖ రియాలిటీ, ఎస్‌సీఐసీ వెంచర్స్‌కు ప్రోత్సాహకాలు ఇస్తారు.

నేటి ఉదయం 9కి సంచలనం!

- భారీ పెట్టుబడిపై ఆసక్తి రేపిన మంత్రి లోకేశ్ పోస్టు
- 2019 నుంచి కొత్త ప్రాజెక్టులు చేపట్టని సంస్థ తుఫానులా రాష్ట్రానికి తిరిగి వస్తోంది



అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో భారీ కంపెనీ రాబోతోందా? ఇప్పటికే ఆ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వ సంప్రదింపులు ఫలించాయా? ఇలాంటి సందేహాలు రేకెత్తించేలా ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా ఎక్స్‌లో బుధవారం పోస్టు చేశారు. గొప్ప ఆవిష్కరణ అంటూ ఆ పోస్టులో పేర్కొన్నారు. "2019 నుంచి కొత్త ప్రాజెక్టులను నిలిపివేసిన ఆ కంపెనీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రేపు (గురువారం) తుఫానులా రాష్ట్రానికి తిరిగివస్తోంది. ఎవరది?? ఉదయం 9 గంటలకు పెద్ద ప్రకటన ఉంటుంది. వేచి చూడండి" అంటూ లోకేశ్ ఆ పోస్టులో పేర్కొన్నారు. లోకేశ్ పోస్టు సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

విశాఖలో డబ్ల్యూటీసీకి నేడు శంకుస్థాపన



విశాఖపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరగనుంది. పెట్టుబడిదారుల సదస్సు కోసం ఒకరోజు ముందుగా విశాఖకు వస్తున్న మంత్రి లోకేశ్ చేతులు మీదుగా ఈ కార్యక్రమం జరగనుంది. ఎండాడలో పనోరమ హిల్స్ వెనుక పది ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసే ఈ ప్రాంతంలో పెద్ద స్టార్ హోటల్, ఆఫీసు స్పేస్‌తో పాటు కోవర్కింగ్ స్పేస్ వస్తాయి. మొత్తం రూ.1,250 కోట్లు పెట్టుబడి పెట్టనున్న ఈ ప్రాజెక్టులో సుమారు 15 వేల మందికి ఉపాధి లభిస్తుంది.

ఫెనోమ్ ఐటీ క్యాంపస్‌కు నేడు శంకుస్థాపన

రుషికొండ ఐటీ పార్కులో ఫెనోమ్ ఐటీ క్యాంపస్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ చేతుల మీదుగా గురువారం శంకుస్థాపన జరగనుంది. ఈ కంపెనీకి ఐటీ హిల్ నంబరు 2లో 4 ఎకరాలు, మధురవాడలో మరో 0.45 ఎకరాలు కేటాయించింది. ఈ సంస్థ రూ. 207.5 కోట్లు పెట్టుబడి పెట్టి 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది.

99.62 కోట్లతో 'క్వాంటమ్' సెంటర్

- సీఆర్‌డీఏ కమిషనర్‌కు టెండర్లు ఖరారు చేసే అధికారం

అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో రూ. 99.62 కోట్లతో నిర్మించనున్న అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్(ఏక్యూసీసీ) టెండర్లను ఖరారు చేసేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. అమరావతిలో క్వాంటమ్ సెంటర్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. చీఫ్ ఇంజనీర్ల బోర్డు చేసిన సిఫారసులను ఏపీ సీఆర్‌డీఏ 54వ సమావేశంలో ఆమోదించింది. టెక్నికల్, ప్రైస్ బిడ్లను నిపుణుల కమిటీ పరిశీలించి సిఫారసులు చేసింది.

5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధిస్తాం

- సీఐఐ దక్షిణ ప్రాంత సదస్సులో మంత్రి లోకేశ్




వీఐటీలో ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్

తుళ్లూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశం ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించడం ఖాయమని, అయితే దానిని ఎంత త్వరగా చేరుకోగలమనేదే అసలు ప్రశ్న అని మంత్రి లోకేశ్ అన్నారు. దక్షిణ ప్రాంత కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ సదరన్ రీజియన్) ఆధ్వర్యంలో 'ఉన్నత విద్య పునర్ వ్యవస్థీకరణ ద్వారా భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు' అనే అంశంపై వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయం అమరావతి క్యాంపస్‌లో బుధవారం జరిగిన సమావేశంలో లోకేశ్ ప్రసంగించారు. దేశం ఆశయాన్ని పరిమితం చేసుకోకూడదని, 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకోవాలన్నారు. సీఐఐ దక్షిణ ప్రాంతం కాలేజ్ ఎక్సలెన్స్ క్లస్టర్ 2025, వీఐటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సెల్వం మాట్లాడుతూ... దేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు విద్యాసంస్థల సహకారం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి, ప్రొఫెసర్ కె.రత్నషీలా మణి(ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్), శరణం నరేంద్ర కుమార్ (వైస్ చైర్మన్, సీఐఐ ఆంధ్రప్రదేశ్) తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి

- నిధులు సమకూర్చడం కోసం ఆర్థిక శాఖ కసరత్తు: పయ్యావుల



అమరావతి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటివరకు వివిధ శాఖలతో సమీక్షలు నిర్వహించి తీసుకున్న నిర్ణయాలను పట్టాలెక్కించే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పోలవరం, రాయలసీమ, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు, రాయలసీమను హార్టికల్చర్ హబ్ చేయడం కోసం, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ రోడ్లు, జల్‌జీవన్ మిషన్ లాంటి ప్రాధాన్య ప్రాజెక్టుల కార్యాచరణ ప్రణాళిక, వాటికి అవసరమయ్యే నిధుల గురించి ఆర్థికశాఖ తీవ్రంగా కసరత్తు చేస్తోందని ఆ శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. మంగళవారం ఆయా శాఖల మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి వివిధ సమీక్షల్లో తీసుకున్న నిర్ణయాల విషయంలో నిధులు సమకూర్చడంపై ఆర్థికశాఖ కసరత్తు చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. త్రైమాసికాల వారీగా ఏ ప్రాజెక్టుకి ఎంత ఖర్చవుతుందో సమీక్షించామన్నారు. యుద్ధప్రాతిపదికన హంద్రీనీవాను 100రోజుల్లో పూర్తిచేసినట్లు మిగతా ప్రాజెక్టులకు కూడా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జల్‌జీవన్‌మిషన్ ప్రాజెక్టుపై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోకపోవడం వల్ల బిల్లులు ఆగిపోయాయన్నారు. ఆ బిల్లుల చెల్లింపునకు ప్రత్యామ్నాయాలు అన్వేషిస్తున్నట్టు పేర్కొన్నారు. కాగా, పీపీపీ ప్రాజెక్టులపై ప్రచారం కల్పించడం, ఆ రంగంలోని కొత్త విధానాలను తెలుసుకోవడం కోసం ఈనెల 14, 15 తేదీల్లో ఆర్థిక శాఖ విశాఖలో రీఇమాజినింగ్ ఫైనాన్స్ సమ్మిట్‌ను నిర్వహిస్తోంది.

గ్లోబల్ ట్రేడ్ గేట్‌వేగా విశాఖ

'ఇన్వెస్ట్ ఇన్ ఏపీ' నినాదంతో రేపటి నుంచే భాగస్వామ్య సదస్సు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నాన్ని 'గ్లోబల్ ట్రేడ్ గేట్‌వే'గా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఇన్వెస్ట్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే నినాదంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించడానికి కృషి చేస్తోంది. సీఐఐతో కలిసి 30వ 'పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు-2025'ను శుక్ర, శనివారాల్లో విశాఖలో నిర్వహిస్తోంది. 'పార్టనర్స్ ఇన్ ప్రోగ్రెస్-ఇండియాస్ రోడ్‌మ్యాప్ టు వికసిత్ భారత్' అనే థీమ్‌తో 14, 15 తేదీల్లో జరిపే ఈ సదస్సుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, ఆటోమొబైల్, అంతరిక్షం, రక్షణ, పర్యాటక రంగాల్లో భారీ పెట్టుబడులు రానున్నాయి. వివిధ దేశాల నుంచి వందమందికి పైగా ప్రతినిధులు వస్తున్నారు. వారితో 30కి పైగా అవగాహన ఒప్పందాలను ప్రభుత్వం చేసుకోనుంది.

దగ్గరుండి చంద్రబాబు పర్యవేక్షణ

సదస్సు ఏర్పాట్లు దగ్గరుండి చూసుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం రాత్రి ఏడు గంటలకు విశాఖ చేరుకున్నారు. బీచ్‌రోడ్డులోని నోవాటెల్ హోటల్‌కు వెళ్లారు. అక్కడ ఆయనతో భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ అమిత్ కల్యాణి సమావేశమయ్యారు. రాష్ట్రంలో షిప్ బిల్డింగ్, ఎలక్ట్రానిక్స్ రంగంలో ఉత్పత్తులకు సంబంధించి పరిశ్రమల ఏర్పాటుపై ఆయన ఆసక్తి చూపారు. పర్యాటక రంగంలో గండికోట వద్ద రివర్ క్రూయిజ్ ప్రాజెక్టు ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తంచేశారు. సదస్సు సందర్భంగా ఒక్కక్షణం కూడా వృథా చేయకుండా వివిధ వ్యాపార,పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యేలా సీఎం తన షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు.

నేడు సీఎం షెడ్యూల్

విశాఖ నోవాటెల్ హోటల్‌లో ఇండియా-యూరప్ వ్యాపార ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో గురువారం ముఖ్యమంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం తైవాన్, ఇటలీ, స్వీడన్, నెదర్లాండ్ ప్రతినిధులతో భేటీ అవుతారు. ఎస్‌పీసీ పంప్స్ లిమిటెడ్, రెన్యూ పవర్, బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్, మురుగప్ప గ్రూప్, జుల్ గ్రూప్, హీరో ఫ్యూచర్ ఇంజనీర్స్ ప్రతినిధులతో సమావేశమవుతారు. సాయంత్రం 'వైజాగ్ ఎకనామిక్ రీజియన్' కార్యక్రమంలో పాల్గొంటారు. సీఐఐ ప్రత్యేక భేటీకి హాజరవుతారు.

వివిధ రంగాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు

రంగం	ప్రాజెక్టుల సంఖ్య	పెట్టుబడులు	ఉద్యోగావకాశాలు
పరిశ్రమలు, వాణిజ్యం	101	4,03,528	1,97,342
ఇంధన రంగం	26	2,65,288	68,660
ఐటీ, ఎలక్ట్రానిక్స్	79	98,138	1,61,757
ఏపీ మారిటైమ్ బోర్డు	23	54,954	74,390
ఏపీసీఆర్‌డీఏ	40	48,965	6,200
మెప్మా	19	38,768	39,287
పర్యాటకం	56	28,660	52,199
టెక్స్‌టైల్స్	14	21,635	53,850
ఫుడ్ ప్రాసెసింగ్	32	12,313	88,412
ఏపీఏడీసీఎల్	2	4,000	----
పశు సంవర్ధకం	18	------	6,330
మొత్తం	410	9,76,248	7,48,427

పెట్టుబడులు రూ. కోట్లలో

సదస్సు తొలిరోజు...

పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సును 14వ తేదీన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రారంభిస్తారు. ఏపీ పెవిలియన్ ప్రారంభోత్సవంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పాల్గొంటారు. యూసఫ్ అలీ, బాబా కల్యాణి, కరణ్ అదానీ వంటి ప్రముఖులు హాజరవుతారు. మధ్యాహ్నం జరిగే 'ఏఐ ఫర్ వికసిత్ భారత్' సమావేశంలో చంద్రబాబు ప్రసంగిస్తారు. సింగపూర్ నుంచి నేరుగా విజయవాడకు విమానాలు నడిపేందుకు సింగపూర్ ప్రతినిధులతో ఒప్పందం చేస్తారు. సాయంత్రం 'రీఇమేజినింగ్ పబ్లిక్ ఫైనాన్స్' సదస్సులో పాల్గొంటారు. సంజీవ్ గోయెంకా గ్రూప్ వైస్ చైర్మన్‌తో భేటీ అవుతారు. విశాఖలో లులూ నిర్మించే మాల్‌కు శంకుస్థాపన చేస్తారు. రాత్రికి వివిధ కంపెనీలు, ప్రభుత్వ ప్రతినిధులకు విందు ఇస్తారు.



విశాఖ ఆర్కే బీచ్‌రోడ్డులోని పార్క్ హోటల్ జంక్షన్‌లో విద్యుత్ వెలుగులు

చివరిరోజు..

15న ఉదయం బ్లూమ్ బెర్గ్ మీడియా సమావేశంలో సీఎం పాల్గొంటారు. రేమండ్, శ్రీసిటీ, ఇండోసోల్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. బహ్రెయిన్, న్యూజిలాండ్, కెనడా, జపాన్ ప్రతినిధులతో భేటీ అవుతారు. మధ్యాహ్నం 'సెంటర్ ఫర్ ఫ్రాంటియర్ టెక్నాలజీస్'ను ప్రారంభిస్తారు. గూగుల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం ఎంవోయూల కార్యక్రమంలో పాల్గొంటారు. చివరిగా.. మీడియా సమావేశం నిర్వహిస్తారు. భాగస్వామ్య సదస్సు కోసం పారిశ్రామిక ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు భారీగా తరలివస్తున్నారు. ఇంకోవైపు.. విశాఖలోని ప్రధాన మార్గాల్లో కూడళ్లు విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్నాయి. జీవీఎంసీ అధికారులు నగర సుందరీకరణ పనులు చేపట్టారు.

410 ఎంవోయూలు.. 9.76 లక్షల కోట్ల పెట్టుబడులు

విశాఖపట్నం పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు ద్వారా భారీ పెట్టుబడులు రానున్నాయి. సదస్సు వేదికగా 410కి పైగా అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, ఎనర్జీ, ఐటీ, మారిటైమ్ బోర్డ్, పర్యాటకం తదితర 11 రంగాల్లో రూ.9,76,248 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. వీటి ద్వారా రాష్ట్రంలో 7,48,427 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంలోని ఏ ప్రాంతానికి ఎంతమేర లబ్ధి జరుగుతుందనేది కూడా అంచనా వేశారు.

- సీమకు 34 ప్రాజెక్టుల ద్వారా రూ.58,883 కోట్ల పెట్టుబడులు..47,558 ఉద్యోగాలు.
- కోస్తాకు 11 ప్రాజెక్టుల ద్వారా రూ.17,188 కోట్ల పెట్టుబడులు, 8,119 ఉద్యోగాలు.
- దక్షిణ కోస్తాకు 17 ప్రాజెక్టుల ద్వారా రూ.13,982 కోట్ల పెట్టుబడులు, 15,720 ఉద్యోగాలు.
- సెంట్రల్ ఆంధ్రాకు 8 ప్రాజెక్టుల ద్వారా 1,283 కోట్ల పెట్టుబడులు, 12,560 ఉద్యోగాలు.
- ఉత్తర కోస్తాకు 42 ప్రాజెక్టుల ద్వారా రూ.3,139 కోట్ల పెట్టుబడులు, 4,308 ఉద్యోగాలు.

30 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం: 26,302 కోట్లపెట్టుబడులు..26,676 మందికి ఉద్యోగాలు

82 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు: 2,65,634 కోట్ల పెట్టుబడులు..2,45,574మందికి ఉద్యోగాలు

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 7,500 కోట్ల పెట్టుబడులు

విశాఖ సదస్సులో ఎంవోయూలు

- జాబితాలో మోండలెజ్, పతంజలి, జైన్ ఇరిగేషన్ సంస్థలు
- ఐదేళ్లలో ఈ రంగంలో లక్ష్యం 30 వేలకోట్ల పెట్టుబడులు.. 3 లక్షల ఉద్యోగాలు
- ఏడాదిన్నరలోనే 16 వేలకోట్ల పెట్టుబడుల రాక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ (ఆహారశుద్ధి) రంగంలోకి సుమారు 7,500 కోట్లకు పైగా పెట్టుబడులు రానున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఆహారశుద్ధి పరిశ్రమలు నెలకొల్పేందుకు అనేక కంపెనీలు ముందుకు వస్తున్నాయి. 14, 15 తేదీల్లో విశాఖలో ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న భాగస్వామ్య సదస్సులో ఆయా కంపెనీలు ఎంవోయూలు చేసుకోనున్నాయి. మోండలెజ్ డైరీ మిల్క్, పతంజలి, జైన్ ఇరిగేషన్, గోద్రేజ్, రిలయన్స్, ఐటీసీ, కెలాగ్స్, ఇండస్ కాఫీ వంటి అనేక కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ ఐదేళ్లలో ఆహారశుద్ధి రంగంలోకి 30 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, మూడు లక్షల మందికి ఉద్యోగాలను కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ ఏడాదిన్నరలోనే దాదాపు రూ.16 వేల కోట్ల విలువైన పెట్టుబడులు సాధించి ఇప్పటికే సగానికి పైగా లక్ష్యం సాధించింది. మెగా ప్రాజెక్టుల కేటగిరీలో రూ.6,100 కోట్ల మేర పెట్టుబడులతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ఆయా కంపెనీలు సమర్పించిన ప్రతిపాదనలకు ఇప్పటికే ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. వీటిలో కొన్ని పరిశ్రమలు గ్రౌండింగ్ దశలో ఉండగా, మరికొన్ని ప్రారంభోత్సవాలకు సిద్ధమవుతున్నాయి. ఇక భారీ, చిన్నతరహా పరిశ్రమల విభాగంలో మరో రూ.1,500 కోట్లకు పైగా పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలు ఎంవోయూలకు సిద్ధంగా ఉన్నాయి. ఇవిగాక మరో రూ.3 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. వచ్చే మూడు, నాలుగేళ్లలో 40 నుంచి 50 వేల కోట్ల వరకు పెట్టుబడులు ఆకర్షించే అవకాశముందని అంచనా. కొత్తగా రానున్న పెట్టుబడులతో రాష్ట్రంలో ఆహారశుద్ధి రంగం మరింత అభివృద్ధి చెందనుంది.

గత ప్రభుత్వంలో కుదేలు

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. వేల కోట్ల పెట్టుబడులతో నెలకొల్పే భారీ పరిశ్రమలతో పాటు ఉపాధి కల్పనలో కీలకమైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) స్థాపనకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వపరంగా తగిన ప్రోత్సాహకాలు అందిస్తే ఫుడ్ ప్రాసెసింగ్ రంగం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని భావిస్తోంది. అయితే కొవిడ్ దెబ్బతో కుదేలైన చిన్న పరిశ్రమలకు గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకం లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వేలసంఖ్యలో యూనిట్లు మూతపడ్డాయి. లక్షల మంది కార్మికులు, ఉద్యోగులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. గత వైసీపీ పాలనలో అతలాకుతలమైన ఎంఎస్ఎంఈ రంగానికి ప్రభుత్వపరంగా మళ్లీ ఊతమిచ్చి గాడిన పెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేస్తోంది.

ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ

రాష్ట్రంలో ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు, అపారమైన సహజ వనరులు అందుబాటులో ఉండటంతో పెద్దఎత్తున యూనిట్లు నెలకొల్పేందుకు వీలుగా ఎంఎస్ఎంఈ రంగంతో ఈ సెక్టార్‌ను ప్రభుత్వం అనుసంధానం చేసింది. రైతులు పండించే ఆహార ఉత్పత్తులకు టెక్నాలజీ వినియోగంతో విలువ జోడింపు ఇచ్చి, ఆయా జిల్లాల్లోని ఆహార ఉత్పత్తులకు అంతర్జాతీయస్థాయిలో మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. రాయలసీమ జిల్లాల్లో మామిడి సహా ఉద్యాన పంటలు, మిరప, పసుపు తదితరాలతో పాటు కోస్తా జిల్లాల్లో ఆక్వా ఉత్పత్తులను శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని ప్రకటించింది. చిన్న యూనిట్లకు పెట్టిన స్థిర మూలధన పెట్టుబడిలో 75 శాతం, భారీ పరిశ్రమలకు 35 శాతం వరకు రాయితీలతో పాటు భూములు, విద్యుత్తు తదితర వసతులు కల్పిస్తామని ప్రకటించింది.

ట్రిలియన్ డాలర్లే లక్ష్యం

- ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్
- విశాఖ పెట్టుబడుల సదస్సుకు 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు: లోకేశ్

న్యూఢిల్లీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడుల వేగం ఎంతో పెరిగిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ట్రిలియన్ డాలర్ల (లక్ష కోట్ల డాలర్లు) పెట్టుబడులను ఆకర్షించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని తమ ప్రభుత్వ పాలనలో గత 16 నెలల్లో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. పలు రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండగా రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉందని, అలాగే ఏపీలో నమో (నాయుడు, మోదీ) ప్రభుత్వం ఉందని తెలిపారు. పెట్టుబడిదారులు ఏపీని ఎంచుకునేందుకు మూడు కారణాలున్నాయని, అందులో మొదటిది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్.. రెండోది చంద్రబాబు సమర్థ నాయకత్వం.. మూడోది పరిపాలన అని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. శుక్ర, శనివారాల్లో విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుపై ఢిల్లీలోని ఏపీభవన్‌లో బుధవారం నిర్వహించిన కర్టెన్‌రైజర్ ప్రెస్‌మీట్‌లో మంత్రి లోకేశ్ మాట్లాడారు. 'భాగస్వామ్య సదస్సు సమయంలో రూ. 2.7 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తాం. ఏపీలో ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలని చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. క్లస్టర్ల వారీ విధానంలో పారిశ్రామికాభివృద్ధికి కృషిచేస్తున్నాం. టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు వచ్చాయి. పర్యాటక రంగాన్ని ఇండస్ట్రీగా గుర్తించిన తొలి రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. వచ్చే మూడేళ్లలో 50 వేల హోటల్ గదులు సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. చంద్రబాబుకు సీఐఐతో మంచి అనుబంధం ఉంది. 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు సంబంధించి ప్రభుత్వం 410 ఒప్పందాలు కుదుర్చుకోనుంది. వీటి ద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు రానున్నారు. మొత్తం 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు, 12 అంతర్జాతీయ సంస్థలు, జీ20 దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. సదస్సులో మొత్తం 48 సెషన్లు, ఒక ప్లీనరీ, 27 సాంకేతిక సెషన్లు, 3 స్టాండ్ అలోన్ సెషన్లు, 11 రాష్ట్రానికి సంబంధించిన సెషన్లు ఉంటాయి' అని వివరించారు



అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరం కార్యక్రమంలో మంత్రి లోకేశ్, అడోబ్ చైర్మన్, సీఈవో శాంతన్ నారాయణన్

20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

'ఎన్నికల సమయంలో ప్రధానంగా ఆరు హామీలు ఇచ్చాం. మొదటి హామీ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన. ఏ రాష్ట్రం ఇప్పటివరకు చేపట్టని ఎంప్లాయిమెంట్ మిషన్ ఇది. అందుకే మేం రూపొందించిన ప్రతి పాలసీ కూడా ఉద్యోగాల సృష్టికోసమే. ఉద్యోగాల కల్పనే ఏకైక అజెండాగా పెట్టుకున్నాం. దేశంలోనే ప్రముఖ 10 సోలార్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీల్లో 5 సంస్థలు ఏపీని ఎంచుకున్నాయి. బీపీసీఎల్ లక్ష కోట్ల పెట్టుబడితో భారీ రిఫైనరీ ప్రాజెక్ట్‌ను స్థాపిస్తోంది. ఎన్టీపీసీ రూ. 1.65 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను అభివృద్ధి చేస్తోంది. రాష్ట్రం కోసం యువగళం పేరుతో చేసిన పాదయాత్రలో ఎదురైన సంఘటనలు నన్ను తీర్చిదిద్దాయి' అని లోకేశ్ తెలిపారు. ఆయన వెంట కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, బైరెడ్డి శబరి, సానా సతీశ్, తెన్నేటి కృష్ణప్రసాద్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

టిల్మాన్ గ్లోబల్ 15 వేల కోట్ల పెట్టుబడులు

న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ గ్లోబల్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ (టీజీహెచ్) ఏపీలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఢిల్లీలో యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరం సదస్సులో టిల్మాన్ ఏపీలో పెట్టుబడులపై అడోబ్ చైర్మన్ శంతను నారాయణ్ ప్రకటించారు. వెంటనే లోకేశ్ సమక్షంలో టీజీహెచ్ చైర్మన్-సీఈవో సంజీవ్ అహూజా ఎంవోయూ పత్రాలను ప్రభుత్వ ప్రతినిధులతో పంచుకున్నారు.

ఇకపై నమో అంటే నాయుడు, మోదీ

న్యూఢిల్లీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): "ఆంధ్రప్రదేశ్‌లో ఇకపై నమో అంటే... నాయుడు అండ్ మోదీ. ఇద్దరు సమర్థ నేతల నేతృత్వంలో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది" అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో మంత్రి లోకేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. "నేను 180 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధిని. ఏపీలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెట్టబోతోంది. ఇది దేశ చరిత్రలో సింగిల్ లార్జెస్ట్ ఎఫ్‌డీఐ. ఆర్సెలార్ మిట్టల్ సంస్థ భారత్‌లో అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను విశాఖపట్నం సమీపంలో నిర్మిస్తోంది. యూనివర్సిటీ స్థాయిలో ఏఐ పాఠ్యాంశాలను ప్రవేశపెడుతున్నాం. హైదరాబాద్ ఐఎస్‌బీ నమూనాలో ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. సీఎం చంద్రబాబుకు కొత్త నగరాలు నిర్మించిన ట్రాక్ రికార్డు ఉంది. ఇప్పుడు అమరావతి మాదిరిగానే గతంలో సైబరాబాద్ నిర్మించారు. గుంటూరు-విజయవాడల నడుమ సుందరమైన అమరావతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో రైతులను కూడా భాగస్వాములుగా చేశాం. భారత్‌లో కొత్తనగరాల నిర్మాణానికి మేం చేపట్టిన ల్యాండ్ పూలింగ్ విధానం దిక్సూచిగా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్‌ను కాలిఫోర్నియా ఆఫ్ ఈస్ట్‌గా పిలవచ్చు. దేశంలో హెచ్‌ఆర్‌డీ, ఐటీ శాఖలను కలసి నిర్వహించిన మంత్రిని నేను మాత్రమే" అని లోకేశ్ చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.